ధనిక, పేదల మధ్య వ్యత్యాసం తగ్గించి సమసమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అందుకోసం పేదల అభ్యున్నతికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు పాలకులు పదేపదే చెప్పుకుంటున్నా ధనికులు మరింత లక్ష్మీపుత్రులుగా ఎదిగిపోతున్నారు. మరొకపక్క పేదలు మరింత పేదలుగా దిగజారిపోతున్నారు. భారతదేశ సంపదలో యాభైఎనిమిది శాతంపైగా కేవలం వేళ్లమీద లెక్కపెట్టగలిగే గుప్పెడు మంది చేతిలో చిక్కుకున్నదని నివేదికలు వెల్లడిస్తున్నాయి. చివరకు కరోనా కష్టకాలంలో పేదలు జీనోపాధి కోల్పోయి, అర్థాకలితో అల్లాడుతూ మరింత దారిద్ర్యంవైపు నెట్టబడితే లక్ష్మీపుత్రులు మాత్రం రోజుకూ వందలాది కోట్ల ఆదాయాన్ని ఆ సమయంలో పెంచుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈ అంతరాయం పెరిగిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో స్పష్టమయింది. మనిషి ఆకలితో అలమటించే పరిస్థితిని రూపుమాపాలనే లక్ష్యాన్ని అందుకోవడం కష్టసాధ్యమేనని తాజాగా ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడిస్తున్నది. 2030నాటికి ఆకలి సమస్యను అధిగమించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరడానికి మరో ఏడు సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉంది.అయితే యేటా ఆకలితో అల్లాడిపోతున్న వారి సంఖ్య పెరిగిపోతుండడంతో ఈ లక్ష్యసాధన కనుచూపు మేరలో కన్పించడం లేదు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఎనభైరెండు కోట్లమందికిపైగా ఆకలి సమస్యను ఎదుర్కొన్నారు.ఆ సమస్యను పూర్తిగా రూపుమాపాలని 2015లో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అప్పటి నుంచి ఆకలిబాధితుల సంఖ్య తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్తున్నా ఆనాటికంటే పద్దెనిమిది కోట్ల మంది ఎక్కువయ్యారు. 2019లోకరోనా రక్కసి విజృంభణతో దాదాపు పదిహేను కోట్లమంది అధికమైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. మొత్తం మీద ప్రపంచంలో ప్రతిముగ్గురిలో ఒకరు అంటే దాదాపు 230 కోట్ల మందికిపైగా ఏదోరకమైన ఆహారభద్రత సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలో ఇదేపరిస్థితి కొనసాగితే 2030 నాటికి ప్రపంచ జనాభాలో ఎనిమిదిశాతంపైగా పోషకాహారాల లోపానికి గురవుతారని నివేదికలో స్పష్టమవుతున్నది. అదే పరిస్థితి వస్తే 2015 నాటి స్థాయికి తిరిగి చేరుకుంటామని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి. మొత్తం మీద సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతుండడం తీవ్రప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా ఒక వైపు సంపన్నుల సంపదమరింత పెరిగిపోతుండడంపేదల సంపాదన దారుణంగా పడిపోతున్నదనేది వాస్తవం.ఇండోనేషియా, చైనా, లావోస్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో ధనికుల సంపద ఇరవైయేళ్లలో పదిహేను శాతం పెరిగింది. కూలీల చెల్లింపుల విషయంలో ఆసియా దేశాల మహిళలపై వివక్ష తీవ్రంగానే ఉంది. ఒకే పనిచేస్తున్నా పురుషులకు ఇచ్చేకూలి మహిళలకు ఇవ్వడం లేదు. వేతనాల చెల్లింపులో వివక్ష భారత్‌లోనే ఎక్కువగా ఉన్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అనేక కంపెనీలు బాలికలతో తక్కువ వేతనాలతో పనిచేయిస్తున్నారు. బాల కార్మికుల వెట్టిచాకిరి జరుగుతున్నతీరుపై ఎన్నోసార్లు కమిటీలు నివేదికలు అందించాయి. కానీ చట్టపరంగా ఏదో నామమాత్రంగా చర్యలుతీసుకుంటున్నారే తప్ప ఈ బాల కార్మిక వ్యవస్థను రూపుమాపలేకపోతున్నారు. దక్షిణాసియా, కొన్ని ఆఫ్రికా దేశాల్లో పేదరికం ఛాయలు చాలా తీవ్రంగానే ఉన్నాయి. ప్రపంచంలోనే పేదలు అధికంగా దక్షిణాసియా,సబ్‌సహారా ఆఫ్రికా దేశాల్లోనేఉన్నారు.రెండు దశాబ్దాల క్రితం లెక్కలు పరిశీలిస్తే ఆ దేశాల్లో జనాభా ఆనాటి నుంచి ఎంతపెరిగిందో పేదల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నది. భారత్‌లో కొంత పరిస్థితి మెరుగ్గా ఉన్నా పేదరికంపై పోరాటం చేస్తూ పెద్దఎత్తున లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తూ వివిధరకాల పథకాలను రూపొందించి అమలుచేస్తున్నా ఆశించినమేరకు ఫలితాలు కన్పించడంలేదు. స్వల్పవృద్ధి సాధించడం తప్ప పేదరికాన్ని ఆశించినస్థాయిలో నిర్మూలించలేకపోతున్నారు. పేదల కుటుంబాలకు ఆకలిబాధలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ఎన్నో సబ్సిడీపథకాలు అటుకేంద్రం, ఇటురాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ఇందులో అతిపెద్దది. దేశంలో సగానికిపైగా ప్రజలు ఈ పథకంకింద లబ్ధిపొందుతున్నారు. కానీ యేడాదియేడాదికి ఈ పథకంకింద లబ్ధిపొందేవారి సంఖ్య పెరుగుతుండడం పేదల సంఖ్య పెరుగుతుందని సంకేతాలు ఇస్తున్నది.కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి సంస్థ లెక్కలకు ప్రజాపంపిణీ సంస్థ లెక్కలకు పొంతన ఉండడంలేదు. రెండూ ప్రభుత్వ విభాగాలే అయినా ఆ లెక్కల ప్రకారం పేదల సంఖ్య తగ్గిపోతుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ రికార్డుల ప్రకారం పేదల సంఖ్య ఊహించని విధంగా పెరిగిపోతున్నది. ఇక 1995లో ప్రారంభించిన మధ్యాహ్నభోజనం పథకం కింద దాదాపు పది,పన్నెండు కోట్ల మందికిపైగా పిల్లలకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. ఇలాంటి ఎన్నో పథకాలకు లక్షలాది కోట్ల రూపాయల వ్యయం చేస్తున్నా పేదరికంపై పోరాటం ఆశించినస్థాయిలో ఫలితాలు ఇవ్వడంలేదు.పేదరికం దాన్నంతట అదే తగ్గిపోతుందనుకోవడం కూడా ఒక భ్రమే. ఆఫ్రికా దేశాల్లోనూ ప్రభుత్వాలు కీలకమైన పాత్రపోషిస్తూనే పేదరికాన్ని నిర్మూలించడం టాంజేనియా అనుభవం చెప్తున్నది. ప్రభుత్వ విధానాలు ఇందుకు అనుగుణంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధితోపాటు సంపదపంపిణీ, వ్యవసాయరంగంలో సంస్కరణలు వైద్యసేవల విస్తరణ, విద్య, తదితర అంశాలపై కేంద్రీకరించాలి.

నాలుక నుండి జారిన ఒక దురదృష్టకరమైన మాటను, ఆరు గుర్రాలతోనైనా వెనక్కు రాబట్టలేం.



గోల్డ్‌స్మిత్

మంచి పనిని మించిన పూజ లేదు. మానవతను మించిన మతం లేదు.



అంబేద్కర్

## ప్రజావాక్కు



### శృతిమించుతున్న ఫీజుల దందా!

కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దందా శృతిమించుతోంది. తల్లిదండ్రులపై ఇష్టానుసారంగా ఫీజుల భారాన్ని మోపుతున్న కార్పొరేట్ పాఠశాలలు ఇప్పుడు కొత్తగా నెలవారీ ఫీజులపై కూడా ఫైన్‌లు విధిస్తుండడం దారుణం. చెప్పేది మామూలు చదువే అయినా విద్యాసంస్థలకు ఇంటర్నేషనల్, కార్పొరేట్, టెక్నో అన్న పేర్లు పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజుల భారం ఎక్కువగా ఉన్నప్పటికీ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు వాటిలోనే చదివిస్తున్నారు. డొనేషన్స్, వార్షికఫీజులు చెల్లిస్తూనోట్‌బుక్స్, యూనిఫాం, షూస్, తదితర సామాగ్రికూడా అక్కడే కొనేలా నిబంధనలు ఉన్నాయి. యాజమాన్యాలు ఇప్పటికే తిరుపతిరావు కమిటీ సూచనలను ఉల్లంఘిస్తూ యేటా 15నుంచి20 శాతం ఫీజులను పెంచుతున్నాయి. కంప్యూటర్ ప్రాజెక్ట్ వర్కు, ఇండస్ట్రీయల్ విజిట్ అంటూ అదనంగా వసూలుచేస్తోంది. నెలవారీ ఫీజుల చెల్లింపులు కొంత ఆలస్యమైతే ఫైన్ వసూలు చేస్తున్నాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అమరావతి మరిచారా?

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం సందర్భంగా ప్రధాని ప్రజాకాంక్షల ప్రతిబింబంగా అభివర్ణించారు. మరి ఇదే ప్రధాని ఏడుసంవత్సరాల క్రితం విజయదశమిరోజున రాజధాని లేని, విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధానిగా అమరావతిలో భూమిపూజ నిర్వహించి పలు హామీలు గుప్పించారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తామని ఎన్నికల సందర్భంలో హామీ ఇచ్చారు.ఆతర్వాత అమరావతిపురోగతిని పట్టించుకున్న పాపాన పోలేదు.రాష్ట్ర పాలకుల బాధ్యతారాహిత్య దుందుడుకు నిర్ణయాలను ఏదశలోనూ అడ్డుకోలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండుసార్లు అధికార పర్యటనకు వచ్చిన ప్రధాని అమరావతి పురోగతిని కనీసం విచారించలేదు.

-జి.భారతిదేవి, ఏలూరుజిల్లా

### నడుం బిగించాలి

భూతాపం అనుకున్నదానికంటే వేగంగా పెరుగుతుందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే 2030 నాటికి ప్రపంచంలో యేటా 560ఘోర విపత్తులు చోటుచేసుకుంటాయని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరించింది. వ్యవసాయం, పట్టణీకరణ, పారిశ్రామిక కార్యకలాపాలు, తవ్వకాలు కారణంగా యేటాలక్షల ఎకరాల్లో అడవులు కనుమరుగవుతున్నాయి.అడవుల పరిరక్షణ పట్లప్రజల్లో అవగాహన పెంచి వాటిని కాపాడేందుకు ప్రభుత్వాలు నడుం బిగించాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

### ఆత్మవంచన తగదు

దళిత ఎమ్మెల్యేలకు అవమానం జరిగితే వైకాపాలోని అగ్రవర్ణ నేతలు స్పందించడంలేదని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి వాపోతున్నారు.మాస్క్ అడిగిన నేరానికి దళిత డాక్టర్ సుధాకర రావుని పిచ్చివాడని ముద్రవేసి వేధింపులకు గురి చేశారు.ఒక దళిత డ్రైవరును కిరాతకంగా చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి అధిష్టానం ఆశీస్సులతో వైకాపాశ్రేణులు బ్రహ్మరథం పడుతున్నారు.ఇసుక అక్రమరవాణాను అడ్డుకున్న ఒదళిత యువకుడికి శిరోముండనం చేసి అవమానించారు. ఎంతో మంది దళితుల భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటున్నారు. ఎస్సీ,ఎస్టీ, ఉపప్రణాళిక నిధులను దారి మళ్లించారు. చిత్తూరు జిల్లాలోనే దళితులు ఎన్నోరకాల వేధింపులకు గురవుతున్నారు. దళితుల సంక్షేమానికి గత ప్రభుత్వం అమలు పరిచిన 27 పథకాలు రద్దు చేశారు. మరి నారాయణస్వామికి ఇవేమీ దళితులకు జరిగిన అవామానంగా కనపడలేదా?

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### జన్‌కి బాత్ వినాలి

ఎప్పుడూ కాకపోయినా అప్పుడప్పుడు అయినా పాలకులు ప్రజల వద్దకు వారు నివసించే చోటుకివెళ్లి మాట్లాడితే వారి కష్ట సుఖాలు తెలుస్తాయి. వారి స్థితిగతులు ప్రత్యక్షంగా చూసే అవకాశం కలుగుతుంది. పూర్వకాలంలో మహారాజులు చక్రవర్తులు ప్రజలు ఎలాజీవిస్తున్నారో తమ పాలనలో వారు సుఖంగా సంతోషంగా ఉంటున్నారో లేదో తెలుసుకోవడానికి మారువేషాల్లో వీరి వద్దకువెళ్లేవారు. అవసరమైన సాయం వెంటన చేసేవారు. ఇలాంటి చేతలతోఆనాటి పాలకులు ప్రజలకు చేరువయ్యేవారు. అయితే నేటి పాలకులు ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు చేస్తున్నారు. పేద ప్రజలకు దూరంగా ఉంటున్నారు. విదేశాలకు వెళ్లి తిరుగుతున్నారు. మాటలతోనే కాలాన్ని వెళ్లబుచ్చుతున్నారు. మాటలతో ప్రజలను మాయచేస్తున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### చెట్ల నరికివేత తగదు!

రాష్ట్రంలో ముఖ్యమంత్రి పర్యటిస్తున్న ప్రాంతాల్లో అధికార యంత్రాంగం చెట్లను విచక్షణారహితంగా నరికి వేయించడం సరికాదు. గతంలో ఎప్పుడూ ఇలా చెట్లను నరికివేసిన ఉదంతాలు లేవు.అసలు చెట్లవలన వచ్చే ఇబ్బంది ఏమిటి? అంత భద్రతా సమస్యలు ఉన్నాయనుకుంటే రాష్ట్ర సచివాలయం నుంచి బటన్ నొక్కి ప్రజలకు సందేశం ఇవ్వవచ్చు. గత ప్రభుత్వాలు కట్టినవేదిక,భవనాలేకాకుండా నాటించిన చెట్లను కూడా నరికివేసే అధికారం ఎవరిచ్చారు.

-ఉప్పలపాటిరాజా, గంగన్నగూడెం, ఏలూరుజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# రాజదండంపై ఇంత రాజకీయమా?

**దేశ ప్రతిష్ట-గౌరవాన్ని పెంచే ప్రతీకలను, చిహ్నాలను రాజకీయాలకు అతీతంగా గుండెల్లో దాచుకోవడం ప్రతిపౌరుడి ప్రాథమిక కర్తవ్యంగా భావించినప్పుడే దేశ ఔన్నత్యం పెరుగుతుంది. భవిష్యత్ ఉజ్వలంగా వెలుగుతుంది. స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. రాజకీయ లబ్ధికోసం వెంపర్లాడటం సంకుచిత స్వభావమే తప్ప మరొకటి అనిపించుకోదు. ఐదు మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో, ప్రపంచంలోనే అత్యధిక వృద్ధిరేటుతో దూసుకుపోతున్న భారతదేశం మరింత ఉజ్వలంగా, తలమానికంగా నిలిచేలా ఎదిగేందుకు అన్ని రాజకీయపక్షాలు పాటుపడతాయని, ఆకాంక్షిద్దాం. రేపు భారత్‌దే అని గుండెల నిండా ఊరిపి పీల్చుకుందాం. రాద్ధాంతాలకు సమయమిది కాదని చాటుదాం.**



వుప్పల నరసింహం
సీనియర్ జర్నలిస్టు

భవ్యమైన, రాజసం ఉట్టిపడుతున్న నూతన పార్లమెంట్ భవనంలో 'సెంగోల్' రాజదండానికి సముచిత స్థానం కల్పించడంపై పెద్దరాజకీయ రగడ కొనసాగింది. ఇంకా కొనసాగుతూఉంది. ఇది విషాదం,విచిత్రం. దేశ సంస్కృతి, సంప్రదాయ పరంపరగా వేల సంవత్సరాలుగా వస్తున్న విధానంలో భాగంగా అందిన అధికార మార్పిడి చిహ్నం సెంగోల్ పట్ల ఇంత విముఖత, వ్యతిరేకత వ్యక్తం కావడం విడ్డూరం. ఏకంగా 21 రాజకీయ పార్టీలు దేశ నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించడం బాధాకరం. ఎందరో హృదయాల్ని ఈ ఘటన గాయపరిచింది. రాజకీయం వేరు, దేశ, రాష్ట్ర పరువు, ప్రతిష్టగౌరవం వేరు అనిభావించిన అసంఖ్యాకులు ఖేదపడ్డారు. ప్రజాస్వామ్య పవిత్రను మందిరంగా భావించే పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవాన్ని పట్టించుకోకుండా, మీడియాలో నానా రకాలవ్యాఖ్యలు చేస్తూ ఆ భవనాన్ని 'శవపేటిక'తో పోలుస్తూ మాట్లాడటం, సామాజిక మాధ్యమాల్లో మరింత శృతిమించి వ్యవహరించడం వారికెవరికీ శోభనివ్వలేదు. ఇవ్వదు కూడా. ఈ అంశంపై ఏకమైన ప్రతిపక్షాలు కట్టిన జట్టును ఇలాగే కొనసాగించి వచ్చే యేడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మోడీని-బిజెపిని ఓడించాలని సంకల్పం చెప్పుకోవడం చిత్రవిచిత్రంగా ధ్వనించింది. కాని అప్పుడే ఆ జట్టులో బీటలు ఏర్పడటం గమనార్హం. నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని గాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే ప్రారంభింపచేయాలని తొలుత పట్టుపట్టారు. దేశ ప్రథమపౌరురాలిని కాదని ప్రధాని ఎలా ప్రారంభిస్తారని ప్రతిపక్షాలు ఒంటికాలిపై లేచాయి. కారాలు, మిరియాలు నూరాయి. అయితే అనూహ్యంగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా ప్రారంభోత్సవానికి నాలుగు రోజుల ముందు మీడియా, పత్రికా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి 1947 ఆగస్టు 14న రాత్రి అప్పటి ప్రధాని పండిట్ నెహ్రూ అందుకున్న అధికార మార్పిడికి చిహ్నామైన 'సెంగోల్'ను అదే రోజు ప్రధాని స్పీకర్ స్థానం సమీపంలో ప్రతిష్టిస్తారని ప్రకటించడంతో ప్రతిపక్షాలు మరింతగా అగ్గిమీద గుగ్గిలంలా చిటపటలాడాయి. తీవ్రంగా చిర్రుబుర్రులాడాయి. అంతేగాక 'శవపేటిక' రాజకీయ తీవ్రతను పెంచాయి. చివరికి సెంగోల్ ఓ బోగస్ అని దురుసుగా నోరు పారేసుకున్నారు. నాస్తిక వాది సంశయవాది నెహ్రూ 75ఏళ్ల క్రితం శాస్త్రోక్తంగా సెంగోల్‌ను అందుకున్నారన్న ప్రకటనను కొట్టిపారేశారు. కట్టుకథ అల్లి ప్రచారం చేస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. దూషణలకు దిగారు. అయితే ఆనాటి కొన్ని చిత్రాలు, ప్రమాణాలు, పత్రాలు తమిళనాడులోని ఆదీనం (మఠం)లోని స్వాములు చరిత్రను తవ్వితీసి చూపడంతో ప్రతిపక్షాలు ఆగ్రహజ్వాలలు కొంత చల్లబడినా పూర్తిగా సమిసిపోలేదు. ఆజాదీకా అమృత్ మహోత్సవం వేళ, ప్రపంచమంతా భారతదేశంవైపు చూస్తున్న సందర్భంలో గొప్ప జాతీయ వేడుకను ద్విగుణీకృత ఉత్సాహంతో గొప్ప ఉత్సవంలా



జరుపుకోవలసిన వారు ఇలా రాజకీయ ఆధిపత్యం కోసం బజారుకెక్కడం ప్రజలెవరు జీర్ణించుకోలేకపోయారు. గత 76 ఏళ్లుగా ప్రజల కెవరికీ తెలియని చరిత్రను, సంప్రదాయ సంస్కృతికి, అధికార మార్పిడికి ప్రతీక-చిహ్నాన్ని ఇలా అగౌరవపరుస్తూ కీచులాటకు దిగడం విలువల్ని మంటగలపడమే తప్ప మరొకటి కాదు. నిష్పక్షపాత పాలన, ప్రవర్తనను నిరంతరం పాలకులకు గుర్తుచేసే చిహ్నం సెంగోల్ అని తమిళంలోని అర్థ తాత్పర్యాలని పండితులు, విజ్ఞులు, చరిత్ర తెలిసిన వారు ఆ సెంగోల్‌ను తయారు చేయించిన ఆదీనం (మఠం) స్వాములు చెప్పినా, సాక్ష్యాలు, చిత్రాలు చూపినా ప్రతిపక్షాలు మాత్రం తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లని వాదిస్తూనే ఉండటం, గొంతు పెంచి మరీ వినిపించడం వింతగా ధ్వనించింది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా తమ దేశం ఆచరించే మతపద్ధతులు కొన్ని రాజకీయాల్లో ప్రతిఫలిస్తాయి. ఇటీవల బ్రిటిష్ రాజు పట్టాభిషేకం సందర్భంగా వేల సంవత్సరాల క్రైస్తవమత సంప్రదాయ క్రతువు కనిపించింది.కదా? మతాతీత పూర్తి లౌకిక సమాజం ఎక్కడాలేదు. ముఖ్యంగా తూర్పుదేశాల్లో దీన్ని ఊహించలేం. కాని కుహనా లౌకికవాదులు మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ ఉండటం నిజంగా విచారకరం. అది ప్రజాప్రయోజనాలకు గాక వారి స్వప్రయోజనాలకు మాత్రమే ఉపకరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు మనోభీష్టమే కీలకమన్న వాస్తవాన్ని కుహనా లౌకికవాదులు గ్రహించకపోవడం ఓ రకంగా అజ్ఞానమే! దేశంలో వేల సంవత్సరాలుగా ప్రజాస్వామ్య పవనాలు వీస్తున్నాయని, గణరాజ్యాలు గొప్పగా ప్రజాస్వామ్యాన్ని గౌరవించి కాపాడాలని చరిత్ర ఘోషిస్తున్నా, దాని కొనసాగింపుగానే సెంగోల్ అని స్పష్టంగా బోధపడుతున్నా, 'సెక్యులర్' ముసుగులో యుద్ధం చేయడం ఏమాత్రం సమంజసంకాదు. వాస్తవానికి ఉత్తర, దక్షిణ భారత ప్రజల్ని సెంగోల్ 1947లోగాని, వర్తమానంలో గాని మానసికంగా ఒకటి చేసింది, కలిపింది. ఆ శక్తి సహజసిద్ధంగా దానికుంది. అంతటి శక్తిమంతమైన వారధిని చిహ్నాన్ని ప్రతీకను తులనాడుతూ మాట్లాడటం, కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సంస్కారమనిపించుకోదు. ప్రజాస్వామ్యంలో ప్రమాణాలు, తర్కం, హేతుబద్ధత, చాలాకీలకం. ఇవే ప్రజల సాధికారతను సజీవంగా నిలుపుతాయి. ప్రతిపక్షాలు సెంగోల్ విషయంలో ప్రమాణాలు, సాక్ష్యాలు, తర్కం, హేతుబద్ధతను తుంగలో తొక్కడానికి ప్రయత్నించడం, ఏమాత్రం విజ్ఞత గల చర్య అనిపించుకోదు. 76ఏళ్లు కనిపించని, అనామకంగా అగౌరవ పద్ధతిలో పడి ఉన్న రాజదండాన్ని ధర్మదండాన్ని ఇప్పుడు వెలుగులోకి తీసుకొచ్చి ఒకప్పుడు నెహ్రూ అందుకున్న తరహాలోనే ఇప్పటి ప్రధాని మోడీ అందుకోవడాన్ని ఆహ్వానించాల్సింది పోయి ఆగ్రహించడం, ఆక్షేపించడం ఏరకంగా ఆమోదనీయమవుతుంది? దేశ ప్రతిష్ట-గౌరవాన్ని పెంచే ప్రతీకలను, చిహ్నాలను రాజకీయాలకు అతీతంగా గుండెల్లో దాచుకోవడం ప్రతిపౌరుడి ప్రాథమిక కర్తవ్యంగా భావించినప్పుడే దేశ ఔన్నత్యం పెరుగుతుంది. భవిష్యత్ ఉజ్వలంగా వెలుగుతుంది. స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. రాజకీయ లబ్ధికోసం వెంపర్లాడటం సంకుచిత స్వభావమే తప్ప మరొకటి అనిపించుకోదు. ఐదు మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో, ప్రపంచంలోనే అత్యధిక వృద్ధిరేటుతో దూసుకుపోతున్న భారతదేశం మరింత ఉజ్వలంగా, తలమానికంగా నిలిచేలా ఎదిగేందుకు అన్ని రాజకీయపక్షాలు పాటుపడతాయని, ఆకాంక్షిద్దాం. రేపు భారత్‌దే అని గుండెల నిండా ఊరిపి పీల్చుకుందాం. రాద్ధాంతాలకు సమయమిది కాదని చాటుదాం. ●

# చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా?



రామ కిష్టయ్య
సంగనభట్ల

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యేటాకోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యావ్యాప్తికి ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కరాణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు, బాలల తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్తోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాలలోపు పిల్లందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసిపిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక



చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతాసౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజ్యాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగచేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్నిఉన్నా చాలా మంది పిల్లలు బాలకార్మికులుగానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మనదేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి.ఐదు నుండి15 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు.పాఠశాలలో నమోదుకాని, మధ్యలో మానివేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువులపండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ 2003 సంవత్సరం నవంబర్ 4నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలోచేర్పించే బృహత్‌కార్యక్రమాన్నిఅమలుచేశారు. ఆ తర్వాత ఏటా ఆకార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు.బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి,నిర్బంధ ప్రాథమికవిద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసిఉంది.ముందుగావారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేయాలి.నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలుచేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. ●

# జల వనరులే జీవకోటి పునాదులు

బి.మధుసూదనరెడ్డి

దేశవ్యాప్తంగా 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2018-19లో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నాయకత్వంలో శాస్త్రీయంగా నీటి వనరుల గణనను చేపట్టి పలు ఆసక్తికర ప్రజాప్రయోజన విషయాలను వెల్లడించింది. ఇండియాలో మొత్తం 24.25 లక్షల జలవనరులు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఇందులో 97.1 శాతం గ్రామీణ ప్రాంతాల్లో, 2.9 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయని తేలింది. దేశ జలవనరుల్లో 55.2 శాతం ప్రైవేట్, 44.8 శాతం జలవనరులు ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ఉన్నాయి. భారత జలవనరుల్లో అత్యధికంగా 31 శాతం వనరులు పశ్చిమ బెంగాల్‌లోనే ఉన్నట్లు తెలుస్తున్నది. అదే క్రమంలో యూపీ 10 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అసోం రాష్ట్రాల్లో దాదాపు 1.7 లక్షల జలవనరులు ఉన్నాయి. జార్ఖండ్, తమిళనాడులో ఒక లక్ష వరకు జలవనరులు ఉన్నాయని తెలుస్తున్నది. దేశంలో ఉన్న మొత్తం జల వనరుల్లో 63శాతం వరకు నీటి వనరులు ఈ ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నాయని, 90.5 శాతం వాటార్ బాడీస్ 13 రాష్ట్రాల్లో నెలకొని ఉన్నాయని తెలుస్తున్నది. నీటి నిల్వకు అవసరమైన కట్టలు కట్టడం అడ్డుగోడలు సహజంగా లేదా మానవ నిర్మితంగా ఏర్పడి పళ్లెం లాంటి ఆకారాన్ని జలవనరుగా నిర్వచించవచ్చు. జీవవైవిధ్య సహకారం, జీవనోపాధి, ఆహార భద్రత, వరదల కట్టడి, నీటి సమతుల్యత కాపాడడానికి జలవనరులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఒకప్పుడు నీటి సంపద మెండుగా ఉన్న భారతంలో జనాభా విస్ఫోటనం, ప్రణాళికారహితం పట్టణీకరణ పలు రెట్లు పెరగడంతో నీటి ఒత్తిడి క్రమంగా పెరుగుతూ రానున్న రోజుల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి చేరనుందని హెచ్చరిస్తున్నారు. దేశంలో లభ్యమవుతున్న నీటిలో 70 శాతం వరకు మానవ వాడకానికి అర్హతను కోల్పోయి విషపూరితం అవుతున్నది. జాతీయ జల వనరుల గణన అధ్యయనంలో సహజ మానవ నిర్మిత నీటి వనరుల పరిమాణం,వాడకం, దురాక్రమణ, నీటి నిల్వ సామర్థ్యం, నీటి మూలాలు, పునరుద్ధరణ పనులు లాంటి పలు ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ జాతీయ నివేదికలో దేశ జలవనరుల వివరాలు, రాష్ట్రాల వారీగా వివరాలు అధ్యయనం చేయబడ్డాయి. నీటి వనరులతో వ్యవసాయం, పరిశ్రమలు, వినోద ప్రాంగణాలు, గృహ అవసరాలు, మత సంబంధ, భూగర్భ జలాల రీచార్జ్ లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. మంచు కొండలు కరగడం, ప్రవాహాలు, వర్షపు నీరు, డ్రైనేజ్ వాటర్, ట్యాంకులు, రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు, సరస్సులు మొదలగు సహజలేదా మానవ నిర్మిత జలవనరులుగా పేర్కొనబడుతున్నాయి. భారత జలవనరుల్లో 59.5 శాతం చెరు



వులు, 15.7 శాతం ట్యాంకులు, 12.1 శాతం జలాశయాలు, 2.5 శాతం ఇతర వనరులు, కేవలం 23000 సరస్సులు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. జలాశయాల్లో పశ్చిమ బెంగాల్, చెరువుల్లో ఆంధ్రప్రదేశ్, చెక్ డ్యామ్‌ల్లో మహారాష్ట్ర, సరస్సుల్లో తమిళనాడు ముందంజలో ఉన్నాయని తెలుస్తున్నది. మహారాష్ట్రలో 93 శాతం నీటి వనరులు చెక్ డ్యామ్‌ల రూపంలోనే ఉండగా 96,343 వనరులు గ్రామీణంలో, కేవలం 719 మాత్రమే పట్టణ ప్రాంతాల్లోఉండటం గమనించారు. ప్రపంచ దేశాల్లో అత్యంత నీటి ఒత్తిడి కలిగిన దేశాల్లో భారతదేశం నిలవడం విచారకరం. ప్రపంచ జనాభాలో 18శాతం కలిగిన భారతదేశంలో నాలుగు శాతం మాత్రమే మంచినీటి వనరులున్నాయి.దేశంలోని నీటిలో 80శాతం వ్యవసాయానికి వినియోగపడుతూ, మిగిలినవి గృహ అవసరాలకు ఉపయోగించబడుతున్నాయి.ఇండియాలో 1951 వివరాల ప్రకారం వార్షికనీటి సగటు అందుబాటు 5,000క్యూబిక్ మీటర్లు.2001లో 1,816 క్యూబిక్ మీటర్లు, 2011లో 1,545 క్యూబిక్ మీటర్స్. 2021లో 1,486 క్యూబిక్ మీటర్లు ఉండగా, 2031 నాటికి 1,367క్యూబిక్ మీటర్లకు పడిపోనున్నదని సెంట్రల్ వాటర్ కమిషన్ తేల్చింది. అందుబాటులో ఉన్న నీటివనరులు కాలుష్యం,అతి వినియోగం,ప్రతికూల వాతావరణాల కారణంగా నీటి ఒత్తిడి పెరుగుతోంది. దేశవ్యాప్తంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అత్యధికంగా సౌత్ 24పరగనాస్ జిల్లాలో అత్యధికంగా 3.56 లక్షల జలవనరులు,ఏపిలోని అనంతపూర్‌లో జిల్లాలో 50,537,పశ్చిమబెంగాల్‌లోని హౌరాజిల్లాలో 37,301 నీటివనరులు అధికంగా ఉన్నాయని తెలుస్తున్నది.దేశ జలవనరుల్లో 9.6శాతం గిరిజనప్రాంతాల్లో, 8.8శాతం వరద ప్రమాదప్రాంతాల్లో, 7.2శాతంకరవుప్రాంతాల్లో, రెండు శాతం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో, 0.7శాతం ఎడారి ప్రాంతాల్లో, మిగిలిన 71.7 శాతం వనరులు ఇతర ప్రాంతాల్లో ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. దేశ జలవనరుల్లో 78శాతం మానవ నిర్మిత, 22శాతంసహజంగా ఏర్పడినవిగా గుర్తించారు. భారతదేశంలో విస్తరించనున్న 24.25 లక్షల వనరుల్లో 83.7 శాతం జలవనరులు మాత్రమే మానవవినియోగానికి ఉపయుక్తంగా ఉన్నాయి.మిగిలిన 16.3శాతం జలవనరులు ఎండిపోవడం, పూడికతో నిండిపోవడం, పునరుద్ధరణకు వీలుకాని స్థితిలోకి జారడం, లవణశాతం అధికం కావడం, పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితం కావడంతో మానవ వినియోగానికి అర్హతను కోల్పోయాయి.వాటర్ బాడీస్ సెన్సెస్‌తో లభించిన వివరాలతో నీటి వనరుల పరిరక్షణ, స్వార్థపూరిత దుర్వినియోగ కట్టడి,సరైన అవసరాలకు మాత్రమే వాడుకోవడం, పునరుద్ధరణకు అడుగులు పడడం,చట్టాలఅమలుతో కాపాడడం లాంటి లక్ష్యాలను అధిగమిస్తూనే ఆర్థిక, సామాజిక, పర్యావరణ సుస్థిరత సాధనకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. నీటివనరుల సుస్థిర నిర్వహణకు నీటివనరుల గణన వినియోగపడుతుంది. జలం లేనిదే జీవం లేదు.జలమే సమస్త జీవుల ప్రధాన అవసరం. జలవనరుల ప్రాధాన్యాన్ని అవగాహన చేసుకొని నీటి వనరులను కాపాడుకోవడం,జలకాలుష్యాన్ని కట్టడిచేయడం, నీటిని పొదుపుగా వాడుకోవడం, పూడికతీతను తరుచుగా చేయడం, చెక్ డ్యామ్‌లను నిర్మించడం,వర్షపు నీటిని ఒడిసిపట్టడం,చెరువు కట్టల్ని బలోపేతం చేయడం లాంటి పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ●

# యుద్ధ వితంతువులకు నివాస స్థలాలు పంపిణీ చేస్తాం

**బాపట్ల.మే31,ప్రభాతవార్త :** యుద్ధ వితంతువులకు తక్షణమే నివాస స్థలాలుపంపిణి చేస్తామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు.స్థానికకలెక్టర్ కార్యాలయంలోని ఆయనచాంబర్‌లో బుధవారం జిల్లాసైనిక బోర్డు నూతన కమిటి తొలిసమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధంలో మృతి చెందిన సైనిక కుటుంబాలకు జివో నెంబర్ 92 అధారంగా 300 చదరపు అడుగులు నివాస స్థలాన్ని ఇస్తామన్నారు. బాపట్ల జిల్లాలో 11 మంది యుద్ధ వితంతువులు,5గురు యుద్ధ



సమావేశంలో మాట్లాడుతున్నజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

వీరమాతలు ,యుద్ధంలో దివ్యాంగులైన 8 మంది సైనికులు ఉన్నారన్నారు.వీరందరి వివరాలు సేకరించి తక్షణమే నివేధిక పంపాలని సైనిక సంక్షేమ శాఖ అధికారిణిని అదేశించారు. నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. జివో నెంబర్ 371 అధారంగా మాజి సైనికులకు ఇంటి పన్ను మినహాయింపు అమలు చేస్తామన్నారు. మున్సిపాలిటిలు పంచాయితీలలో ఈ ఉత్తర్వులు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాల భర్తీలో మాజి సైనికులకు 2 శాతం రిజర్వేషన్‌ను పక్కాగా అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా ఒప్పంద పద్ధతిలో ,పొరుగుసేవల విదానంలో మాజి సైనికులు రిజర్వేషన్‌లు వర్తింప చేస్తామన్నారు. ఉద్యోగ విరమణపోందిన మాజి సైనికులకు 2,5 ఏకరా సాగుభూమి లేదా 5 ఏకరాల మెట్టభూమి పంపిణికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో భూమి పంపిణి జరిగి 10 సంవత్సరాలు దాటిన పట్టాలను 22ఎ నుంచి తొలగించడానికి ప్రతిపాధనలు పంపాలని అధికారులను అదేశించారు. మాజి సైనికుల నుంచి సమగ్ర వివరాలు సేకరించి కలెక్టరేట్‌కు నివేధించాలన్నారు. సైనికుల సంక్షేమం కోసం ఫ్లాగ్‌డే కార్యక్రమంలో భాగంగా విరాళాల సేకరణ చెపట్టాలన్నారు. సైనిక రెస్ట్ హౌస్,సిఎస్‌డి క్యాంటిన్,ఈసిహెచ్‌ఎస్,సైనిక సంక్షేమశాఖ కార్యాలయాల నిర్మాణానికి 80 సెంట్లు భూమిని గుర్తించాలన్నారు. మాజి సైనికులుసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహాణలో మృతి చెందినసైనికుల వితంతువులకు అంగన్‌వాడీ ఉద్యోగాలు,నిజాంపట్నంలోసిఎస్‌డి క్యాంటిన్ ఏర్పాటు,బాపట్లలో మాజిసైనికుల హెల్త్ క్లినిక్ ,కేంద్రియ విద్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని కమిటీ తీర్మాణాలపై ఆయన చర్చించారు.ఈ సమావేశంలో జిల్లాసైనిక సంక్షేమశాఖ అధికారిణి గుణశీల ,ఎల్‌డిఎం శివకృష్ణ,గృహనిర్మాణశాఖ పిడి ప్రసాద్,,డిఈవో పివిరామారావు,పరిశ్రమల శాఖ జిఎం.మదన్‌మోహన్,మాజి సైనికులు,పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

# 'పొగాకును పూర్తిగా నిషేధించాలి'

**గుంటూరు కల్చరల్, మే 31, ప్రభాతవార్త :** పొగాకు విషపు కోరల నుండి దేశప్రజలను విముక్తి చేసేందుకు జాతీయస్థాయిలో సమగ్రవ్యూహాన్ని రూపొందించాలని పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను,వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని అవగాహన సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు.ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో హెల్త్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ ధూమపానం ప్రజారోగ్యంపై ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతుందో అందరికి తెలిసి కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు.వి శ్రాంత రాజనీతి శాస్త్ర శాఖాధిపతి ఎన్.తిరుపతయ్య మాట్లాడుతూ సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిది వందలకు పైగా విషవాయువులున్నాయని ఏనాడో గుర్తించారని ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయ న్నారు.ప్రభుత్వం,స్వచ్ఛంద సంస్థలు,విద్యాసంస్థలు ఈ వ్యసన నిర్మూలనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు టి.నారపరెడ్డి,కృష్ణారావు తదితరులు ప్రసంగించారు.

# డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు సిద్ధం

## -ఈనెల 2న గుంటూరులో రైతులకు పంపిణీ చేయనున్న సిఎం జగన్

**గుంటూరు మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ఈనెల 2న తేదీన డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ట్రాక్టర్లు, హార్వెస్టర్ల పంపిణీకి సంబంధించి గుంటూరుమిర్చియార్డులో ఉంచిన ట్రాక్టర్లు, హార్వెస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు.. ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంబంధించి జిల్లా వారీగా ట్రాక్టర్లను వరుస క్రమంలో ఉంచాలన్నారు. లబ్దిదారులకు, వాహన డ్రైవర్లకు బస ఏర్పాట్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం,మంచినీరు., రాత్రి భోజనం సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి, జడ్పీ సిఇఒ జె,మోహనరావు, డిఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, డిపిఒ కేశవరెడ్డి, డిసిఒ వీరాచారి తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేయనున్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

# వాడీవేడిగా తెనాలి కౌన్సిల్ సమావేశం

## ప్రతిపక్ష సభ్యుల వాకౌట్



తెనాలి, మే 31, ప్రభాతవార్త : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన ప్రారంభమైన క్రమంలో గత మార్చి నెల సమావేశంలో చోటు చేసుకున్న దాడి అంశంపై నిజనిర్ధారణ కమిటీ సేకరించిన సమాచారం ఏమిటో చెప్పాలంటూ ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ అధికార పక్ష కౌన్సిలర్ తాడిబోయిన రామయ్యను అడిగారు. ఇదే అంశంపై ప్రతిపక్ష కౌన్సిలర్లు కలుగజేసుకుని నిజ నిర్ధారణ కమిటీ అవసరం ఏముంది ఆ రోజు అధ్యక్ష స్థానంలో మీరున్నారు, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే హోదా మీకుంది ఆ విధంగా చర్యలు తీసుకోండి అంటూ డిమాండ్ చేశారు. దీనిపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు మధ్య చోటు చేసుకున్న వాగ్వివాదం ఎసి హాల్లో సైతం హీటెక్కించే విధంగా కొనసాగింది. ఈ క్రమంలో ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ దాడి జరిగిన సమయంలో నేను లేనన్నారు. ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తులు ఆ సమయంలో అధ్యక్ష స్థానంలో మీరున్నారని అన్నారు. ఆధారాలు చూపాలని ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ చెప్పడంతో సిసి పుటేజ్ తెప్పించండి దాని ఆధారంగా నిర్ణయం తీసుకుని ఎవరిది తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ స్పష్టమైన నిర్ణయం ప్రకటించలేక తర్జన భర్జన పడుతూ ఇక ముందు ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకోకుండా చూస్తానని అన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ కౌన్సిల్ నుండి వాకౌట్ చేశారు. దీంతో కౌన్సిల్ సమావేశంలో అజెండాను చదవడం ప్రారంభించారు. ప్రతిపక్షం లేకపోవడంతో అజెండా అంశాల్లోని 17వ అంశమైన 23వ వార్డులో పైపులైన్ల ఏర్పాట్ల అంశాన్ని రద్దు చేస్తూ మిగిలిన అంశాలను ఆమోదించుకోవడంతో సమావేశం ముగిసింది. ఒక క్రమంలో 26వ వార్డు అధికార పార్టీ కౌన్సిలర్ ఇస్మాయిల్ తన వార్డులో లోప భూయిష్టంగా ఉన్న అభివృద్ధి పనుల విషయంపై అధికారులను నిలదీశారు. దీనికి 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య తన వంతుగా అధికారుల నిర్లక్ష్యాన్ని నియంత్రిస్తూ తనదైన విధానంలో అధికారులకు కొన్ని సూచనలు చేశారు. మొత్తానికి ప్రతిపక్షం లేకపోవడంతో కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది.

# సత్తెనపల్లి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా

## కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, మే 31 ప్రభాతవార్త : సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జిగా రాష్ట్ర మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు కన్నా లక్ష్మీనారాయణను నియమిస్తూ రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు కన్నాకు చేరాయి. కన్నా టిడిపి ఇన్‌చార్జిగా నియమింపబడ్డారని తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీ ఎత్తున సత్తెనపల్లికి చేరుకొని ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భవన్, కన్నా కార్యాలయం వద్ద టిడిపి కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. అదే విధంగా ఒకరికొకరు మిఠాయిలను పంచిపెట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గానికి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కన్నా లక్ష్మీనారాయణను ఇన్‌చార్జిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎల్లినేడి రామస్వామి, సత్తెనపల్లి మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్‌లు ఆళ్ళ సాంబయ్య, మక్కపాటి రామచంద్రరావు, టిడిపి నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, కట్టా రమేష్, గన్నమనేని శ్రీనివాసరావు, బుడగాల సుబ్బారావు, షేక్.ఆదంసాహెబ్, నందం కబ్బయ్య, తోట శ్రీనివాసరావు, నర్రా బాబూరావు, అంచుల నరసింహారావు, ఎల్.రవి, టైలర్ చిన్న, మారెళ్ళ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వర్సిటీలో పీసెట్ ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే31, ప్రభాతవార్త: వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్) సజావుగా ప్రారంభమైంది. తొలిరోజు అర్హత పరీక్షలకు 468మందికిగాను 340మంది హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి ఆద్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలను కౌన్సిల్ స్పెషల్ ఆఫీసర్ డా॥ యం.సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా పీసెట్ కన్వీనర్






ఆచార్య పి.పి.ఎస్.పాల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ విద్య కోర్సుల్లో (బిపిఇడి, యూజిడిపిఇడి) ప్రవేశాలను నిర్వహిస్తున్న పీసెట్‌కు హాజరయ్యే అభ్యర్థులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులకు 100మీటర్ల పరుగు, లాంగ్‌జంప్/హైజంప్, షాట్‌పుట్,800మీటర్ల పరుగు పరీక్షలు నిర్వహించామన్నారు. క్రీడానైపుణ్యాల్లో బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, షటిల్ బ్యాడి ్మంటన్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో అభ్యర్థులను పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఈ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. పరీక్షల నిర్వహణకు విభాగం అధ్యాపకులు డా॥రామ్మోహనరావు, డా॥డి.సూర్యనారాయణ, పిఇటిలు పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**నేటి పరీక్షల షెడ్యూల్**

మెన్ కేటగిరిలో గురువారం జూన్1న హాల్‌టికెట్ నెంబరు 200469 నుంచి 200937 (469మంది)వరకు గల అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తామని పాల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం పరీక్షలు పూర్తయిన వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు.

# ఏఎన్‌యును సందర్శించిన దర్శకుడు నారాయణమూర్తి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే31, ప్రభాతవార్త:** ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి బుధవారం వర్సిటీని సందర్శించారు. ఈ మధ్యకాలంలో ఈయన పర్యటన రెండవది కావడం గమనార్హం. నారాయణ మూర్తి స్వీయ నిర్మాణంలో వస్తున్న యూనివర్సిటీ అనే సినిమా త్వరలో విడుదల కానుంది. సినిమా వివరాలను వీసి రాజశేఖర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తిని వీసి రాజశేఖర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంలో రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపరాణి, సిద్దయ్య, సిడిసి డీన్ మధుబాబు, సిడిఇ డైరెక్టర్ నాగరాజు, సోషల్‌వర్క్ విభాగాధిపతి ఆచార్య వెంకటేశ్వర్లు, సిఇ నర్సా రెడ్డి, ఏసిఇ ప్రకాశరావు తదితరులు నారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.



# విజయవాడలో సింగిల్ యూజ్డ్‌ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన

## : మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విజయవాడ కార్పొరేషన్,మే 31,ప్రభాతవార్త**

విజయవాడ నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడంలో,నియంత్రించడంలో ప్రజలకవసరమైన అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేస్తున్నామని మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంతర్జాతీయ సదస్సులో పేర్కొన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి 28వ తేదీ వరకు ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరంలో 'నగరాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అంతర్జాతీయ ఫోరం'ను భారత మంత్రిత్వ శాఖ,భారత ప్రభుత్వం వారి సన్నిహిత సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్వహించడం,నగరాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే ప్రక్రియ దేశ వ్యాప్తంగా బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విజయవాడ మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్,అంబాకాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ప్రతిష్ట మాంగైన్,ఫోర్ట్ బ్లెయిర్ కార్యదర్శి స్మిత ఆర్,యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమ నిర్వాహకుల ఆహ్వానం మేరకు పారిస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించడంలో,నియంత్రించడంలో వారి అనుభవాలను,అనుసరిస్తున్న ఉత్తమ పద్దతులను,వారి అభిప్రాయాలను సదస్సులో తెలియచేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ సుస్థిరమైన,సమ్మిళిత విధానంపై దృష్టి సారించిందని,అందుకవసరమైన చర్యలు ఇప్పటికే తీసుకోవడం జరుగుతోందని, అందుకు గాను విజయవాడ నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో సింగిల్ యూజ్ పాస్టిక్ వినియోగాన్ని నిరోధించడంలో,నియంత్రించడంలో ప్రజలకవసరమైన అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయడం జరుగుతోందన్నారు. మిగిలిన ప్రతినిధులు కూడ తమ ప్రాంతాల్లో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి స్థిరమైన సమ్మిళిత విధానంపై దృష్టి సారించామని తెలిపారు. నగరాలు,రాష్ట్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్,పునర్వినియోగాన్ని పర్యవేక్షించడానికి,ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కోసం జాతీయ స్థాయి మార్గదర్శకాలను అనుసరించడానికి గాను జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫారంను ఏర్పాటు చేయాలని ఫోరంలో ప్రతిపాదించారు. పారిస్ నగరానికి చెందిన మేయర్ అతిథులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. సదరు విందు కార్యక్రమంలో పట్టణాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలు,ముఖ్యంగా వ్యర్థాల నిర్వహణలపై ప్రత్యేక దృష్టితో చర్చించారు.

# సిటీలో ఘనంగా సూపర్‌స్టార్ జయంతి వేడుక

గుంటూరు, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి: సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని బుధవారం సిటీలో ఘనంగా నిర్వహించారు.. గుంటూరు తూర్పులోని మాయాబజార్ సెంటర్‌లోకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి మొహమ్మద్ నజీర్




పాల్గొన్నారు. అనంతరం కృష్ణ బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సినీప్రస్థానంలో ఎన్నో అద్భుతమైన విజయాలను కృష్ణ అందుకున్నారని అన్నారు. ఫస్ట్‌కలర్ పిక్చర్, ఫస్ట్ 70 ఎంఎం చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు ఆయన పరిచయంచేశారన్నారు. సినీవినీలాకాశంలో సూపర్‌స్టార్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో నేరెళ్ల సురేష్, హరి, ఫిరోజ్, కృష్ణా, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు శేషగిరి, బాజీ, కొండెబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరపెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# నల్లపాడు ఎస్సీకాలనీలో పుస్తక పంపిణీ కేంద్రం ప్రారంభం



గుంటూరు విద్య, మే 31, ప్రభాతవార్త :గుంటూరు నగరపాలక సంస్థ 27వ డివిజన్ పరిధిలోని నల్లపాడు ఎసీ ్సకాలనీలో బుధవారం జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్,గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీ ్సలక్ష్మీల చేతుల మీదుగా పుస్తక పంపిణీ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. సమాజ చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుంటూరు పరిశుద్ధరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం మరింతగా అభివృద్ధి చెందుతుందని పుస్తక పంపిణీ కేంద్రాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కందుల ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ పుస్త పంపిణీ కేంద్రాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా దివంగతులు మాజీ శాసనసభ్యులు చదలవాడ జయరాంబాబు తనయుడు రఘురామ్ పుస్తక పంపిణీ కేంద్రానికి ఒక బీరువాను పలు కుర్చీలను అందజేశారు.గుంటూరు పరిశుద్ధరావు నేతృత్వంలో బత్తుల దేవానంద్,కందుల ఝాన్సీలక్ష్మీలకు ఘనంగా సత్కారం గావించారు.బాలబాలికలకు వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించి విజేతలైన వారికి ముఖ్యఅతిధుల చేతుల మీదుగా పుస ్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మీ,దళిత నాయకులు సొంగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.కాలనీలో ఎప్పటినుంచో పుస్తక పంపిణీ కేంద్రం నెలకొల్పాలనే సదుద్దేశ్యంతో గుంటూరు పరిశుద్ధరావు నెలల తరబడి ఎంతో చొరవతో పుస్తక పంపణీ కేంద్రాన్ని ప్రారంభింపచేయడం ఎంతైనా అభినందనీయం అంటూ ముఖ్యఅతిధులు చేతుల మీదుగా గ్రామ ప్రజలు పరిశుద్ధరావును ఘన రీతిలో సత్కరింపచేశారు.కార్యక్రమంలో జి.రత్నబాబు,జి.చైతన్య,బూరె తేజస్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్చియార్డు ఛైర్మన్‌గా 'నిమ్మకాయల'

**గుంటూరు సిటీ, మే 31, ప్రభాతవార్త :** ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్‌గా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.



# నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ ఎడిసిపి

**విజయవాడ క్రైం,మే 31,ప్రభాతవార్త**

నూతనంగా ట్రాఫిక్ ఏడిసిపిగా భాధ్యతలు స్వీకరించిన డి.ప్రసాద్ బుధవారం విజయవాడ సిపి క్రాంతిరాణా టాటాన మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చాన్నిచ్చి అభినందించారు.



**దేవాదాయ ధర్మదాయశాఖ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**సీల్డ్ టెండరు**

పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి దేవస్థానం నందు వేసిన ర్యాంపులను తొలగించుటకుగాను ఎస్టిమేట్స్ వ్యాల్యూ రూ.2,00,000/-లుకు 1% శాతం ఈ.యం.డి. తో సీల్డ్ టెండర్ కోరడమైనది. సీల్డ్ టెండరుదారులు షెడ్యూల్ కొరకు రూ.500/-లు చెల్లించి. ది.01.06.2023 నుండి ది.09.06.2023 వరకు టెండర్ షెడ్యూలును ఆఫీస్ కార్యాలయం నందు తీసుకొనగలరు. ది.10.06.2023న సీల్ టెండర్ బాక్స్ నందు ఉదయం 10 గంటల్లోపు సీల్డ్ కవర్లను టెండర్ బాక్స్‌లో వేయవలెను. అదేరోజు 11 గంటల వరకు

హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. ఇతర వివరాలు మరియు షరతులు కొరకు 9390855670 ను సంప్రదించగలరు.

ఇట్లు/ అమ్మవారిసేవలో/ **కార్యనిర్వహణాధికారి**

# యువత స్టార్టప్‌ల వైపు దృష్టి సారించాలి

## -కెఎల్‌యు ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్

**తాడేపల్లి, మే 31, ప్రభాతవార్త :** యువత నూతన స్టార్టప్‌ల వైపు దృష్టిసారించాలని కెఎల్‌యు ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. వర్సిటీలోని జాస్మిన్ హాల్లో కెఎల్ టెక్నాలజీ ఇంక్యూబెటర్స్ ఫౌండేషన్, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబెటర్ విభాగాలు నిర్వహించిన అమృత్‌కాల్ అధ్యాయ్ అనే కార్యక్రమంలో పాల్గొని ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు తలపెట్టిన వినూత్న సాంకేతికత, వ్యాపార ప్రక్రియ, రీ ఇంజనీరింగ్ ఆలోచనలను సాధించే వారికి నిధులను కేటాయించే అవకాశాలు గురించి ఆయన వివరించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఇన ఫర్మేషన్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్



కార్యక్రమం కింద ప్రారంభ దశ స్టార్టప్‌ల కోసం కెఎల్ వర్సిటి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశోధన మరియు అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ హైడ్రో కార్బన్ సెక్టార్‌లో స్టార్టప్ ఐడియాల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి నిధుల అవకాశాలు గురించి విద్యార్థులకు వివరించారు. నూతన స్టార్టప్‌లకు తమ సంస్థ తరుపున ఏవిధంగా ఆర్థిక సహకారాన్ని అందిస్తారో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరినట్లు తెలిపారు. ఇండియన్ ఆయిల్ స్టార్టప్ పథకం కింద గ్రీన్ రిజర్వ్ అమృత్‌కాల్ అధ్యాయ్‌పై ఓపెన్ ఇన్నోవేషన్ సవాల్‌ను ప్రారంభించామన్నారు. నూతనంగా స్టార్టప్‌లను ప్రారంభించే వారికి ఇది ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కెఎల్ స్టార్టప్ ముఖ్యఅధికారి గోవిల్ అలోక్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్ మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ డాక్టర్ కె.రాజశేఖర్, మేనేజర్ డాక్టర్ సన్నీ అగర్వాల్, ఇండియన్ అయిల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశోధన మరియు అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.రామకుమార్, జనరల్ మేనేజర్ పంకజ్ కస్లీవాల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై స్టేటస్‌కో

**పొన్నూరు, మే 31, ప్రభాతవార్త:**

చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి క్వారీలో వేంచేసియున్న శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరడంతో కార్యనిర్వహణాధికారి, మరికొంత మంది కలిసి ఆధునీకరణకు దాతల సహాయాన్ని కోరారు. అందుకు దాతలు స్పందించి విరాళాలు కూడా ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఈ నేపథ్యంలో అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యురాలు సూర్యదేవర జయప్రద శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి తన ఇష్టాను సారం వ్యవహరిస్తూ దేవాలయ రూపురేఖలు మారుస్తున్నారని, పురాతన దేవాలయం యొక్క విశిష్టత దెబ్బతినే పరిస్థితి ఉందని, అంతేకాకుండా ఎన్నో శతాబ్దాల నుంచి ఉన్నటువంటి దేవుని విగ్రహాన్ని కూడా కదిలించేందుకు సన్నాహాలు చేస్తున్నారని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అయిన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టులో పిటీషనర్ తరపున, దేవాదాయధర్మాదాయశాఖ తరపున వాదనలు వినిపించారు. పిటీషనర్ ఏమో పురాతన దేవాలయ రూపురేఖలు పూర్తిగా మార్చివేసేందుకు కార్యనిర్వహణాధికారి తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పుంటే, దేవాదాయధర్మాదాయశాఖ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తాము శిథిలావస్థకు చేరిన దేవాలయాన్ని ఆధునీకరిస్తున్నామే కానీ, విగ్రహాన్ని అసలు కదిలించే ఉద్దేశమే లేదని విన్నవించారు. న్యాయస్థానం ఇరువురి వాదనలు విని ప్రస్తుతం స్టేటస్కో(యధాతథస్థితి) ఉత్తర్వులు ఇచ్చింది. కేసును ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. ఇలాంటి పరిస్థితుల్లో దేవాలయానికి సంబందించి అభివృద్ధి పనులు జరుగుతాయో లేదోననే అనుమానం దాతల్లో కలుగుతుంది.

# పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

## - సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్

**పొన్నూరు, మే 31, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్ సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్స




వాన్ని పురస్కరించుకొని బుధవారం ప్లాస్టిక్ వ్యర్థాల కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.గోపాలకృష్ణన్ మాట్లాడుతూ పర్యావరణహిత జీవన విధానం కోసం ప్రతి ఒక్కరూ ఏడు రకాలైన ముఖ్య విషయాలను పాటించాలన్నారు. డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఉన్నతాధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెదేపా మేనిపెస్టోతో వైకాపాలో వణుకు

## - టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు

**పొన్నూరు, మే 31, ప్రభాతవార్త:** మహానాడు వేదికగా టిడిపి జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిపెస్టో టీజర్‌తోనే వైకాపా నాయకుల్లో వణుకు మొదలైందని, దసరాకు విడుదల చేసి పార్టుతో వైకాపా నాయకులు మైండ్ బ్లాక్ కాబోతోందని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా చంద్రబాబు నాయుడు మేనిపెస్టోను ప్రకటించారన్నారు. ఆడ బిడ్డ నిధి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత బస్సు ప్రయాణం, స్థానిక అర్హత అనే అంశాలతో మహిళలంతా ఆనందోత్సాహాలతో



ఉన్నారన్నారు. అదే విధంగా యువత కోసం యువగళం పథకంలో పరిశ్రమలు, కంపెనీలు తేవడం ద్వారా ఐదేళ్ళలో ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పన, ఉద్యోగం వచ్చేదాక నిరుద్యోగ భృతి రూ.3వేలు చొప్పున ఇవ్వడం అనే పథకాలు యువతకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తాయన్నారు. రైతే రారాజు అని నమ్మిన చంద్రబాబునాయుడు రైతుల కోసం రైతు సాయం కింద అన్నదాత పథకం పేరుతో ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు, ఇంటింటికీ కుళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించడం అనే కార్యక్రమాలు ఎంతో మేలును చేస్తాయన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చి ఎస్సీ, ఎస్టీ అత్యాచారం నిరోధక చట్టం తరహాలో బీసి వర్గాలపై దాడులు, అత్యాచారం నిరోధానికి బీసీల రక్షణ చట్టం వంటి వినూత్న పథకాలను ప్రకటించిన అధినేతకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో పఠాన్ అహ్మద్‌ఖాన్, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎద్దు సొంబాబు, బండారు వంశీకృష్ణ, ఆకుల సాంబశివరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, నన్నపనేని ప్రభాకరరావు, పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు తోట ప్రసాద్, చలమశెట్టి సీతారామయ్య, మున్నంగి సుబ్బారెడ్డి, యక్కటి పద్మారావు, చిల్కా రవి, తమనం రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**భట్టిప్రోలు, మే 31, ప్రభాత వార్త :** మండల కేంద్రమైన భట్టిప్రోలు ప్రభుత్వ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం నుండి భట్టిప్రోలు బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ



నిర్వహించారు. పొగాకు వలన కలిగే అనర్థాలను గురించి నిదాలు చెప్పడం జరిగింది. మత్తు పదార్థాలు వద్దు ఆరోగ్యం ముద్దు ముందు సిగరెట్ వద్దు పౌష్టికాహారం ముద్దు పొత త్రాగవద్దు క్యాన్సర్ వ్యాధికి గురి కావొద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మరియు మెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



● వేమూరు ● రేపల్లె ● బాపట్ల ● పర్చూరు ● అద్దంకి ● చీరాల

# అల్పాహార క్యాంటిన్‌కు భూమి పూజ

**బాపట్లరూరల్, మే31, ప్రభాతవార్త :** పోలీస్, డిపివో సిబ్బందికి అల్పాహారం కోసం ఏరాటు చేయనున్న క్యాంటిన్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం భూమి పూజ చేసారు. ఈ సంద్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సరైన క్యాంటిన్ లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే పోలీస్ సిబ్బంది, డిపివోలో విధులు



నిర్వహించే సిబ్బంది ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరి అవసరాలను దృష్టిలో పెట్టుకున తక్కువ ధరలో మంచి అల్పాహారంఅందించేందుకు నూతన క్యాంటిన్ ఏర్పాటుకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. పోలీస్‌సిబ్బందికి ఏవిధమైన అల్పాహారం భోజనం అవసరమైతే సరైన సదుపాయాలు లేకపొండంతో పట్టణంలోకి వెల్లి రావాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా వయస్సు పై బడిన వారు మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ ఇబ్బందులు అధికమించేందుంకు కా ్యంటిన్ ఏర్పాటుకు అధికారులతో చర్చించి పరిశుభ్రమైన అల్పాహారాలనుతక్కువ ధరకు అందించెందుకు క్యాంటిన్ ఏర్పాటుకు రంగంసిద్దం చేశామన్నారు. త్వరిత గతిన ఈ నిర్మానం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, పోలీస్ సిబ్బందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికిఅధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ అల్పాహారంక్యాంటిన్‌ను నిర్మిస్తున్నామన్నారు. రాబోయేరోజుల్లో పోలీస్ వెల్ఫేర్ సబ్సీడీ క్యాంటిన్‌ను ఏర్పాటు చేయడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డిఎస్పీ ప్రేమ్‌కుమార్, ఎస్‌బిఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఈసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ బాలమురళీకృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్‌ఆర్ఐ మన్మదరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రోజుమార్చిరోజు మంచినీరు సరఫరా

**బాపట్ల. మే31, ప్రభాతవార్త :** బాపట్ల పట్టణంలో జూన్ 1వ తేది నుంచి మంచినీరు రెండు రోజులకు ఒకసారి విడుదల చేయడం జరుగుతుందని పట్టణ ప్రజలు సహాకరించాలని మున్సిపల్ కమీషనర్ బానుప్రతాప్ కోరారు. స్థానిక మున్సిపల్‌కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురపాలక సంఘానికి మంచినీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నందు నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రోజు మార్చి రోజు మంచినీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పిటి చానల్ ద్వారా నీటిని ఇరిగేషన్ శాఖ విడుదల చేయడం అలస్య అవుతున్నందున ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అందువలన పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగంచుకుని పురపాలక సంఘానికి సహాకరించాలని ఆయన కోరారు.



# అసాంఘీ కార్యకలాపాలకు అడ్డాగా తెనాలి

## మాజీ మంత్రి 'ఆలపాటి' ధ్వజం

**తెనాలి, మే 31, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పాలనతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అయితే తెనాలి విషయానికి వస్తే అసాంఘీ కార్యక్రమాలకు ఇక్కడి పాలకులు తెనాలిని అడ్డాగా మార్చేశారని ఇసుక దోపిడి, బుసక దోపిడి, భూముల కొనుగోళ్ళలో దోపిడి, రైతులు మొక్కజొన్నలను వేరే ప్రాంతానికి తరలించే వ్యాగెన్ ర్యాకులకు సైతం క్యాష్ కొడుతూ లోడ్డు పట్టు అన్న చందంగా అవినీతి అరాచకం కొనసాగుతుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తమదైన శైలిలో ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల పంట నష్టం అంచనా వేసే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామికి అధికారులు చెప్పే దానికి పొంతన లేకుండా ఉందని దీనిపై రైతులు



ఆందోళనకు దిగితే నష్టపరిహారం విషయంలో దారికి వచ్చిన, నష్టపరిహారాన్ని అంచనా వేసే విషయంలో సరైన విధానం కొనసాగడం లేదని ఆరోపించారు. కొల్లిపర మండలం తెనాలి రూరల్ మండలాల్లో నష్టపరిహారం అంచనా లోప భూయిష్టంగా ఉందన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం లేదన్నారు. తెనాలి నుంచి సుదూర ప్రాంతానికి రైల్వే వ్యాగిన్ ద్వారా మొక్కజొన్న లోడు పంపించాలంటే ఒక్కొక్క ర్యాక్‌కు రూ.4లక్షలు చెల్లించాలని అంటున్నారని, ఈ మొత్తాన్ని రైతుల నుండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగితే ప్రభుత్వం పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల ధరలు పడిపోయాయని, రూ.2,600లు ఉన్న మొక్కజొన్న నేడు రూ.1000లకు అమ్మే పరిస్థితి ఏర్పడిందని, రూ.2,850లు ఉన్న జొన్న రూ.1200లకు పడిపోయిందని ప్రభుత్వానికి రైతుల కష్టం, నష్టం పట్ల వారిని ఆదుకునే విషయంలో చిత్తశుద్ధి లేదన్నారు. తెనాలి కేంద్రంగా అపరిమితంగా పెరిగిపోయిన అరాచకాలను వివరిస్తూ గంజాయి, గుట్కా, మద్యం, అక్రమ మద్యం, సింగిల్ నెంబర్ లాటరీకి తెనాలి మాఫియా అడ్డాగా మారిందని ప్రకృతి వనరులు దోపిడికి అడ్డు అదుపు లేదన్నారు. ప్రభుత్వం ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి మద్యం ఆదాయం అధికారికంగా రూ.20వేల కోట్లు అయితే అక్రమ మద్యం అమ్మకాల ద్వారా అంతకు రెండు రెట్లు అనధికారికంగా పోగుచేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతోనే అడ్డగోలు విధానం తెనాలి ప్రాంతంలో కొనసాగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా రైతుకు న్యాయం చేయాలని, క్యాష్ కొట్టు ర్యాక్ పట్టు విధానానికి స్వస్థి పలకాలని, కల్తీ మద్యాన్ని ప్రభుత్వ షాపుల్లో అమ్మించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధానానికి స్వస్తిపలకాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, పెండ్యాల వెంకట్రావు, కుదరవల్లి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దేసు యుగంధర్, అన్నం పిన్నారావు, మండల పార్టీ అధ్యక్షులు కేసన కోటేశ్వరరావు, అక్కిశెట్టి వెంకట్రావు, తవ్వా ప్రసాద్, గిరిగణేష్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ బిసి సంఘం అధ్యక్షునిగా కుర్రా శ్రీను

**తెనాలి, మే 31, ప్రభాతవార్త :** బిసి సంక్షేమ సంఘం తెనాలి పట్టణ అధ్యక్షునిగా కుర్రా శ్రీనును నియమిస్తూ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు బుధవారం నియామక పత్రాన్ని కుర్రా శ్రీనుకు అందజేశారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని బృందావనం హోటల్ కాన్ఫరెన్స్ హాలులో నియోజకవర్గ బిసి సంఘ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కుర్రా శ్రీనును పట్టణ అధ్యక్షులుగా నియమిస్తూ తీర్మానించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ కుర్రా శ్రీను బాల్యం నుండి కష్టపడే మనస్తత్వం కలిగిన వ్యక్తి అని, సమాజ సేవ చేయడంలో తన ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవలు, కరోనా సమయంలో అన్నార్తుల ఆకలి తీర్చిన



సందర్భాలను ప్రస్తావించారు. నేటికి తన సేవా కార్యచరణను కొనసాగిస్తూ సమాజంలో ఎంతో మంది ప్రశంసలందుకుంటున్న కుర్రా శ్రీనుకు పట్టణ బిసి సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించడం సముచితమైన నిర్ణయంగా భావిస్తున్నట్లు శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం ద్వారకా శ్రీను, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, జిల్లాలోని వివిధ మండలాల బిసి సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూన్ మాసంలో 1.29 కోట్లతో పట్టణాభివృద్ధి

**రేపల్లెరూరల్, మే 31, ప్రభాతవార్త :** పట్టణంలో జూన్ మాసంలో రూ.1.29 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్ట మంగసుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18వార్డు జగనన్నకాలనీలో రెండు ఎకరాలలో వేసిన 72 ప్లాట్‌లలో మెరక పెట్టేందుకు రూ.20లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిజాపట్నం వచ్చిన సందర్భంగా పిచ్చి చెట్లను తొలగించేందుకు, శానిటేషన్ అభివృద్ధికి





రూ.5లక్షలు ఖర్చు చేయటం జరిగిందన్నారు. మున్సిపల్ కమీషనర్, డిఈ, ఎఈలు ఇతర సమావేశాలు వెళ్లేందుకు వాహనాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.4.5లక్షలు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 12వ వార్డులో పైపులైన్ ఏర్పాటుకు రూ.2.2లక్షలు, 24వ వార్డులో ఉన్న కమ్యూనిటి హాలు మౌలిక సదుపాయలు కల్పించేందుకు రూ.5లక్షలు, 27వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, 3వ వార్డు పైపులైన్ నిర్మాణానికి రూ.2.9లక్షలు, 8వ వార్డులో పైపులైన్ నిర్మాణానికి రూ.2.5లక్షలు, 13వ వార్డు సిసి రహదారి నిర్మాణానికి రూ.16.7లక్షలు, 12వ వార్డు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, 3వ వార్డు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, జూన్ మాసంలో ఈ పనులన్ని ఏర్పాటు చేస్తామని అజెండాలో ప్రతిపాదించగా అజెండాలోని 21 అంశాలను మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంతకుమార్, కమీషనర్ డి.విజయసారధి, ఇంజనీరింగ్ సిబ్బంది మునిసిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వైకాపా పాలన అధ్వాన్నంగా ఉంది

**రేపల్లెరూరల్, మే 31, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పూర్తిగా పడకేసిందని రేపల్లె పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు రాచంశెట్టి మహేష్ అన్నారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా బైక్ ర్యాలీలు ఎందుకు చేశారో ప్రజలకు అర్థం కావటం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట మార్చడం, మడమ తిప్పడం



చేశారన్నారు. 2019లో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98శాతం అమలు చేశారని అబ్ధాలు చెప్పుకుంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు సిపియస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి నేటివరకు రద్దు చేయలేదన్నారు. ఇసుక పాలసీని తీసుకొస్తామని చెప్పి ఇసుక ద్వారా దోపిడి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అనేక సమస్యలుంటే స్థానిక శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి సాయి, బత్తుల మల్లి, డి.గురు బ్రహ్మం, డి.రాజశేఖర్, కె.రవికుమార్, పి.పవన్ కళ్యాణ్‌లు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

**కొల్లిపర, మే 31 ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది.. అధికారులు. .ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పధకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారుడు పి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దంతలూరు



ఉపాధిహామీ పనులను, మున్నంగి సచివాల యాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. సమావేశంలో ఎంపిపి భీమవరపు పద్మావతి, తెనాలి మార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత, ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, వైసీపీ కన్వినర్ ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన: 'ఆలపాటి'

**తెనాలి, మే 31, ప్రభాత వార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి సగటు జీవులకు అన్ని అనార్ధలే చోటు చేసుకుంటున్నాని ఏ ఇంటికి వెళ్ళినా సమస్యలు తాండవిస్తున్నాయని, పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ బిల్లుల ధరలు ఇలా ఏది చూసినా మధ్య తరగతి జీవుల నడ్డి



విరిస్తున్నాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో బుధవారం 5వ రోజుగా జనజాగృతి యాత్రను పార్టీ శ్రేణులతో కలసి మాజీ మంత్రి ఆలపాటి ప్రారంభించారు. జగన్ పాలనలో జరుగుతున్న అనార్ధనలను, దుర్మార్గాలను వివరిస్తూ ప్రతి ఇంటికి వెళ్ళి వారి అభిప్రాయాలను సేకరించి కార్యచరణలో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆయన వెంట పలువురు టిడిపి కార్యకర్తలు, పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో సూపర్‌స్టార్ కృష్ణకు ఘననివాళి

**తెనాలి, మే 31, ప్రభాతవార్త :** తెలుగు చలన చిత్ర చరిత్రలో డేరింగ్, డాషింగ్ హీరోగా తనదైన మార్పును సొంతం చేసుకున్న సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ కూడళ్ళల్లో కృష్ణ అభిమానులు పలు సేవా కార్యక్రమాలతో సూపర్‌స్టార్ కృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో మార్కెట్ ఏరియాలో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని కృష్ణ చిత్రపటానికి పూలదండవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని పేదలకు



అన్నదాన సేవలు చేశారు. అదే విధంగా చినరావూరు పార్కు సెంటర్‌లో వహబ్‌చౌక్‌లో వివిధ విభాగాల కృష్ణ అభిమానులు, సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. వహబ్‌చౌక్‌లో జరిగిన ఘట్టమనేని శివరామకృష్ణ జయంతి కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబులు పాల్గొని సూపర్‌స్టార్ కృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.

# ఘనంగా భావనారుషి స్వామి దేవాలయ ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన

**తెనాలి, మే 31, ప్రభాతవార్త :** స్థానిక షరాఫ్ బజార్ మెయిన్‌రోడ్డు కూడలిలో వేంచేసియున్న శ్రీభద్రావతి సహిత శ్రీ భావనాఋషి స్వామివారి దేవస్థానం ధ్వజస్థంభం జీర్ణోధరణ క్రమంలో ధ్వజస్థంభ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు గత నాలుగు రోజులుగా స్వామివారి రథం మండపం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం బుధవారం ధ్వజస్థంభ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని



ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు దేవాలయ కమిటీ నాయకులు, పలువురు పద్మశాలీయ సంఘీయులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి



**పెదకూరపాడు, మే 31 ప్రభాతవార్త :** దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం మానవతా దృక్పథంతో అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో బుధవారం ఆయన పర్యటించారు. పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దివ్యాంగుడైన ప్రకాశరావుకు డీకే పట్టాను అందజేశారు. జిల్లా కలెక్టర్ మానవతా దృక్పథంతో చేసిన సాయాన్ని పలువురు జిల్లా అధికారులు, ప్రజలు, లబ్దిదారుడు కలెక్టర్ శివశంకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# తమ్మినేని సీతారాంను భర్తరఫ్ చేయాలి

**నరసరావుపేట టౌన్, మే 31 ప్రభాతవార్త :** స్పీకర్ తమ్మినేని సీతారాంను వెంటనే భర్తరఫ్ చేయాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. చంద్రబాబుపై స్పీకర్ తమ్మినేని అణుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాం దిష్టిబొమ్మను, మంత్రి అంబటి, సిఎం జగన్ దిష్టిబొమ్మలను స్థానిక మల్లమ్మసెంటర్‌లో దగ్ధం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. చంద్రబాబునాయుడు యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటనలో ఉన్నప్పుడు మున్సిపల్‌శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ వీధిరౌడీలా చంద్రబాబుపై రాళ్ల వేయించడం నీచమైన చర్య అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైకాపాకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలియజేశారు.

# అంటరానితనం పాటించడం నేరం



**నకరికల్లు, మే 31 ప్రభాతవార్త :** మండలంలోని కండ్లకుంట గ్రామంలో గల ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ సురేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందించిన ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనం పాటించడం నేరమన్నారు. దేశంలోని ప్రతి పౌరునికి రాజ్యాంగం ప్రాథమిక హక్కులను కల్పించిందన్నారు. ఆ హక్కులకు భంగం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఆర్థికంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

**: డాక్టర్ అరవింద్‌బాబు**



**రొంపిచర్ల, మే 31 ప్రభాతవార్త :** మండలంలోని అలవాల గ్రామ ఎస్.సి.కాలనీలో మంగళవారం వీచిన గాలివానకు ఓ గృహం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులను నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో ఎం.శేషిరెడ్డిని బాధితులు కాకాని యర్రబాబు, వెంకాయమ్మలతో కలిసి డాక్టర్ అరవింద్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్‌బాబు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అత్తులూరి సుబ్బారావు, గట్టుపల్లి సత్యనారాయణ, భాష, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణకు అభినందనలు



**నరసరావుపేట, మే 31 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి నియోజకవర్గానికి టిడిపి ఇన్‌చార్జిగా సీనియర్ నేత, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణను నియమించినట్లు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు బుధవారం తెలియజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కన్నాను నియమించారన్నారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న కన్నా లక్ష్మీనారాయణను ఇన్‌ఛార్జిగా నియమించడం ఎంతో సంతోషమన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో టిడిపి పార్టీ విజయ బావుటాను ఎగురవేస్తుందని జి.వి.ఆంజనేయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు వెన్నెల చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభం

**నరసరావుపేట టౌన్, మే 31 ప్రభాతవార్త :** స్థానిక గుంటూరు రోడ్డులోని రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి పక్కన వెన్నెల చిల్డ్రన్స్ క్లినిక్‌ను గురువారం నూతనంగా ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ లంకా ప్రత్యూష బుధవారం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై ప్రారంభిస్తారన్నారు. తమ వైద్యశాలలో ఎదుగుదల సమస్యలు, పోషకాహార సమస్యలు, పురిటి పిల్లల సమస్యలు, విష జ్వరాలు, నెమ్ము, అలర్జీ, ఆస్తమా వంటి వాటికి ప్రత్యేకంగా చికిత్స చేయబడునన్నారు. పిల్లలకు అన్ని రకాల టీకాలు వేయబడునని డాక్టర్ ప్రత్యూష తెలియజేశారు.

# ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



**నరసరావుపేట, మే 31 ప్రభాతవార్త :** పట్టణంలోని 9వ వార్డు శ్రీనివాసనగర్‌లో కె.ఆర్.వృద్ధాశ్రమంలో బుధవారం టౌన్ వైడ సూపర్‌స్టార్ కృష్ణ మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కృష్ణ అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆయన లోటు తీర్చలేనిది అన్నారు. పట్టణ అధ్యక్షులు ఫారూఖ్‌బాబు మాట్లాడుతూ హీరో కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. కృష్ణ అభిమానులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అభిమానులు నిమ్మిశెట్టి శంకర్, షేక్.నబిబాజీ, లింగంగుంట్ల రాములు, ఏ.తిరుపతయ్య, షేక్.మస్తాన్‌షరీఫ్, బి.కొండలరావు, టెంట్ కరిముల్లా భాయ్, కుక్కల పౌలు, థామస్, పి.వెంకటరావు, వైకాపా నాయకులు సింధుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో పలువురికి ఆర్థిక సహాయం



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** పట్టణంలో 38వ వార్డు మదర్ థెరిస్సా కాలనీకి చెందిన కట్టా నాగేశ్వరరావు ఇటీవల మరణించారు. కాగా బుధవారం నారా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సిఈఓ గోనుగుంట్ల శివ నాగేశ్వరారవు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కట్టా నాగేశ్వరరావు కుటుంబసభ్యుల ను పరామర్శించి వారి కుటుంబానికి రూ25వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా సుగాలి కాలనీయందు అనారోగ్యంతో బాధపడుతున్న కొండా దుర్గకు వైద్యఖర్చుల నిమిత్తం రూ 10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్య క్రమాలలో టిడిపి సీనియర్ నాయకులు జంగా వినాయకరావు, గుండా గోపి, అనంత సురేష్, అంకమ్మరావు, ఎస్‌కె జానీ, కట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



పెదకూరపాడు, గురజాల , మాచర్ల , చిలకలూరిపేట , నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి,

# పురుషోత్తమపట్నంలో గోపీనాధస్వామి దేవాలయం పునఃప్రతిష్ట కార్యక్రమం



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** పట్టణంలోని పురుషోత్తమపట్నంలో బుధవారం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోపీనాథ స్వామి వారి దేవాలయ పునఃప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని దంపతులు, వారి కుటుంబసభ్యులు పూజా కార్యక్ర మాలలో పాల్గొని ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. గుడి ప్రతిష్ట కార్యక్రమానికి వచ్చిన మహిళలందరికి విడదల వాయుసుధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మం త్రి విడదల రజిని చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంనుంచి వేలాదిమంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# పట్టణంలో 3వరోజు కొనసాగిన అన్నక్యాంటిన్ అన్నదానం



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** పట్టణంలోని నిరుపేదల కడుపునింపే ఉద్దేశ ంతో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3వ రోజు పట్టణంలోని గడియారస్థంభం సెంటర్ వద్ద మొబైల్ అన్న క్యాంటిన్‌ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. 3వరోజు ఖర్చును 19వ వార్డు తెలుగుదేశం పార్టీ నేతలు విరాళంగా ఇవ్వడం జరిగింది. బుధవారం 400మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి పఠాన్ సమద్‌ఖాన్ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సారధ్యంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ తరుపున ప్రతిరోజు 400మందికి అన్న క్యాంటిన్ ద్వారా అన్నదానం చేస్తున్నామని వివరించారు. పేదలకు అన్నదానం చేసే అన్నక్యాంటిన్ వాహనం వద్ద చంద్రబాబుపై వ్యంగంగా ఫ్లెక్సీలు వేసి అధికారపార్టీ నాయకులు కాలం గడుపుతున్నారన్నారు. మరొకవైపు జనసేన కూడా మంచినీటి చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రజల దాహర్తిని తీరుస్తున్నారన్నారు. అధికారపార్టీ ప్రజాసేవ చేయకుండా ప్రజలను రెచ్చగొట్టే పనులకు దిగుతుందని అయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు అధ్ యక్షుడు షేక్ అబ్దుల్‌భాష, కార్యదర్శి ఏలగాల ఏసుబాబు, పార్టీ నాయకులు అబ్దుల్ రజాక్, షేక్ జానీభాష, షేక్ జాకీర్, సయ్యద్ రఫీ, శ్రీరామ్, గరిక సుబ్బారావు, షేక్ షఫీ, షేక్ నాగూర్, మారం పిచ్చయ్య, షేక్ జాఫర్‌సాధిక్, 19వ వార్డు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా ఆర్థిక అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం

**: నియోజకవర్గ టిడిపి మహిళా నేతలు**



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల ఆర్థికఅభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ టిడిపి మహిళానేతలు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ జరీనా సుల్తానా టిడిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ 2023 మహనాడులో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టో అద్భుతమని కొనియాడారు. ముఖ్యంగా మహిళా శక్తి పేరుతో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రకటించిన నాలుగు పథకాలైన ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు, 18 సంవత్సరంలు నిండిన యువతులకు ప్రతినెల రూ1500, మహిళలకు జిల్లాలలో ఆర్టీసి బస్‌లలో టికెట్‌లేని ఉచిత ప్రయాణం, ఇంట్లో చదువుకునే అందరు విద్యార్థులకు ఏడాదికి రూ 15వేలు, తదితర పథకాల ద్వారా చంద్రబాబు స్త్రీ సంక్షేమం ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి రూ 20వేలు, నిరుద్యోగులకు యువగళం నిధులనుంచి నెలకు రూ 3వేలు, అదేవిధంగా యువతకు 2లక్షల ఉద్యోగాలు ప్రకటించారన్నారు. దుష్ట పరిపాలనతో విధ్వంసానికి గురి అయిన రాష్ట్ర పరిస్థితిని చక్కదిద్దుతూనే మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ఒక్క నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు కొత్తకుమారి, కూనల ప్రమీల, కనమర్లపూడి లక్ష్మీతిరుమల, కంచర్ల కరుణ, పాములపాటి శివకుమారి, రాయని హరిత, జంగా సుజాత టిడిపి నియోజకవర్గ అధ్యక్షురాలు అమరా రమాదేవి, కార్యదర్శి పోపూరి లక్ష్మీ, టౌన్ అధ్యక్షురాలు అద్దంకి అనితాబాయి తదితర మహిళా నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# బీసిల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** బీసిల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం అని నియోజకవర్గ టిడిపి బీసి నాయకులు అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీకార్యాలయంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాడు బీసీల అభ్యున్నతి కొరకు తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. నేడు బీసిలకోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని జనరంజకమైన మేనిఫెస్టోను చ ంద్రబాబు విడుదల చేయడం హర్షనీయమని అన్నారు. బీసీల గుండె చప్పుడు తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీసిసెల్ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు పుల్లారావు, మోతుకూరి శివరాం, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిబోయిన శివ, రాష్ట్ర టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసి సెల్ ప్రధాన కార్యదర్శి జంజనం వెంకటేశ్వర రావు, తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు నిమ్మకాయల ప్రసాద్, పట్టణ మహిళ అధ్యక్షురాలు అద్దంకి అనితాబాయి, నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు మిద్దెల వనితాబాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

# గ్లేనిగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటి అవగాహన సదస్సు



**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ హాలులో బుధవారం జరిగిన గ్లేనిగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటి(చెన్నై) మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లివర్ మార్పిడి శస్త్రచికిత్సల అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌ను గ్లోబల్ హెల్త్ సిటి ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, మహిళ నాయకురాలు నూర్ ఫాతిమా, మరియు గ్లేనిగల్స్ గ్లోబెల్ హెల్త్ సిటికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**వినుకొండ,మే31,ప్రభాతవార్త:** మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామం నందు శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి దేవస్థాన ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జిల్లా తెదేపా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు తదితరులు ఈ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారి అన్న, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



**వినుకొండ,మే31,ప్రభాతవార్త:** కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ ్వర్యంలో నటశేఖర సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు స్థానిక ఆర్టిసి బస్టాండ్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించారు. పి.వి సురేష్‌బాబు ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అభిమానులకు, ప్రజలకు పులిహోర పంపిణీ చేశారు. మంచితనానికి మారుపేరుగా హిరో సూపర్‌స్టార్ కృష్ణ నిలుస్తారని, అద్భుతమైన నటనతో గొప ్ప సాహస పాత్రలు పోషించి సినీ ప్రపంచంలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో నన్నేసా, చిట్టిబాబు, రంగారెడ్డి, శివకుమార్, వెంకట రవీంద్ర, పూర్ణ, ఆచారి, శేఖర్ పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకై జూన్ 4న రౌండ్ టేబుల్ సమావేశం



**వినుకొండ,మే31,ప్రభాతవార్త:** బోయ వాల్మీకి, బెంతు, ఒరియా తదితర గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను నిరసిస్తూ నర్సరావుపేట సీపీఐ హాలులో జూన్ 4వ తేదిన గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. మేధావులు, గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు వి. కోటనాయక్, పిడిఎం నాయకులు వై. వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, ఎమ్మార్పిఎస్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, మాలమహానాడు నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



**పెదకూరపాడు, మే 31 ప్రభాతవార్త :** మండలంలోని 75 తాళ్ళూరు పి.హెచ్.సి. ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, వెలుగొండారెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ పొగాకు త్రాగడం వలన క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అలసత్వం వహించే అధికారులపై చర్యలు



**అమరావతి, మే 31 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. అత్తలూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా బుధవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో డాక్టర్లు, సిబ్బంది విధుల్లో లేకపోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇద్దరు డాక్టర్లు, సిబ్బందికి నోటీసులు జారీ చేసి నివేదిక తన కార్యాలయానికి పంపించాలని జిల్లా వైద్యశాఖను ఆదేశించారు.

# ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు



**పెదకూరపాడు, మే 31 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టమైన విద్యాబోధన జరుగుతుందని 75 తాళ్లూరు హై స్కూల్ పిసి ఛైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కాశిపాడు గ్రామంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విద్యావిధానం గురించి వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకరమైన వసతులు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు పద్మజ, సాంబశివరావులు మాట్లాడుతూ విద్యార్థులకు సిబిఎస్సీ సిలబస్‌తో పాటు అటల్ ల్యాబ , డిజిటల్ క్లాస్, స్మార్ట్ టివి, బైజుస్ యాప్, ఐ.ఐ.టి., ఎన్ఎంఎంఎస్‌లో విద్యాబోధన జరుగుతుందన్నారు. మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి యోగా, స్పోర్ట్స్, ఎన్‌సిసిలో శిక్షణ ఉందన్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా ఉచితంగా బ్యాగ్, బుక్స్, షూస్, యూనిఫాం, అమ్మఒడి, గోరుముద్ద శాఖ పథకాలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల విధానాలతోనే వ్యవసాయ రంగం కుదేలు



**సత్తెనపల్లి, మే 31 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలతోనే వ్యవసాయ రంగం కుదేలైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ విమర్శించారు. జూన్ 13,14,15 తేదీలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం మూడు రోజులు జరుగుతుందన్నారు. ఈ సమ్మేళనంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐటియుసి జిల్లా నాయకులు బూదాల శ్రీనివాసరావు, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.ఇర్మియ, ఏఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి



**రాజుపాలెం, మే 31 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన గుంటూరు - మాచర్ల రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దేవరంపాడు గ్రామానికి చెందిన జెల్ది కోటేశ్వరరావు కుమారుడు కార్తీక్ (16) ద్విచక్ర వాహనంపై అనుపాలెం నుండి పిడుగురాళ్ళ వెళ్తూ మార్గం మధ్యలో కోల్డ్ స్టోరేజ్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కార్తీక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్.ఐ.నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నారా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తూబాడులో పలువురికి ఆర్థిక సహాయం

**నాదెండ్ల,మే31,(ప్రభాతవార్త):** నారా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని తూబాడు గ్రామంలో బుధవారం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికివైద్య ఖర్చుల నిమిత్తం రూ1,10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని షేక్ మెహిరూన్, షేక్ సాహిదా, షేక్ బాజీ, షేక్ సుభాని, షేక్ యాసిన్, షేక్ మస్తాన్, షేక్ అకాతి, షేక్ శ్రీనుభాష, షేక్ ఇమాంమోహిద్దీన్, ఎస్కె భాష, ఎస్కె మైసూర్‌లకు ఒక్కొక్కరికి రూ10వేల వంతున మొత్తం రూ1,10,000 ట్రస్ట్ సిఈఓ గోనుగుంట్ల శివ అందించారు. అదే విధంగా గ్రామంలోని జామియా మసీదుకు రూ1,00,000 ఆర్థిక సహాయాన్ని మసీదు పెద్దలు అయిన షేక్ ఖాసీం, షేక్ ఖాదర్, షేక్ నజీర్‌లకు సిఈఓ గోనుగుంట్ల శివ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవచేస్తూ ఆర్థిక సహాయం అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడటం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దగ్గుమల్లి కోటేశ్వరరావు, నాదెండ్ల మాజీ ఎంపిపి కాటా శ్రీధర్, దగ్గుమల్లి నాగేశ్వరరావు, దగ్గుమల్లి వెంకటేశ్వర్లు, గాదె ఇన్నారెడ్డి, పెంట్యాల శివశంకర్, అప్పారావు మాజీ ఎంపిటిసి షేక్ నజీర్, షేక్ ఖాజావలి, తూబాడు టిడిపి గ్రామ అధ్యక్షుడు షేక్ బుడే, కొలగాని హనుమంతరావు, కొలగాని శ్రీనివాసరావు, షేక్ దాసిభాష, షేక్ ఖాదర్‌భాష, షేక్ రహమాన్, షేక్ ఇమాన్, షేక్ కోట, షేక్ జబ్బార్, షేక్ సమీ, షేక్ గఫార్, షేక్ బాజీ, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



# ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**చిలకలూరిపేట,మే31,(ప్రభాతవార్త):** ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. నరసరావుపేట మార్గంలో ఎన్టీఆర్ కాలనీకిచెందిన ఆంజనేయస్వామి గుడివెనుక ప్రాంతంలో రోడ్డు ప్రక్కన నివసిస్తున్న పేరుపోగు మరియమ్మ తదితరులు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు రెండు గుడిసెలు నిప్పు అంటుకొని తగలబడటంతో వారు నిరాశ్రయులుగా మిగిలారు. వారికి బుధవారం ఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు రూ20వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గాయాల వెంకట్ షేక్ సుభాని (చోటు), షేక్ భాష, జొరిగ శివసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని గుండయ్య తోటకు చెందిన బత్తుల వెంకట్రావు అనారోగ్యంతో మరణించారు. కాగా వారి కుటుంబసభ్యులకు ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు జోగినాయుడు, సభ్యులు పండబ్బాయ్, తనీ న్నరు శ్రీను, ముత్తయ్య, వెంక ట్రావు తదితరులుపాల్గొన్నారు.



# విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేత

**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** పట్టణంలోని 26వ వార్డుకు చెందిన అన్నపరెడ్డి అఖిల నందిని ఇటీవల ప్రకటించిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 537 మార్కులు సాధిం చారు. కానీ ఆర్థిక పరిస్థితి కారణంగా ఇంటర్ చదివేందుకు ఇబ్బంది పడుతు న్నారు. జనసేన వీరమహిళ షేక్ హసీనా ద్వారా ఈవిషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తోట రాజారమేష్ బుధవారం వార్డులోని నందిని ఇంటికి వెళ్లి బాలికను అభినందించి ఇంటర్ చదివేందుకు రూ 15వేలు ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లిదండ్రులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభాని, షేక్ మునీర్‌హసన్, సివి రామన్, లీలకిషోర్, సాంబ, విష్ణు, సాయిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**చిలకలూరిపేట,మే31,ప్రభాతవార్త:** పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం జ్ఞానేశ్వర అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ గ్రంధి శ్రీనివాసరావు పాల్గొని పొగాకు దాని ఉత్పత్తుల వలన కలిగే నష్టాలను గురించి అవగాహన కల్పించారు. అనంతరం అందరిచేత పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అదే విదంగా విద్యార్థులచే నో టుబాకో డే సంబందించి వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గేరా యాకోబు, పొనుగుబాటి బుల్లిబాబు, గోపతోటి రవి, జనవిజ్ఞానవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, గ్రంధాలయ ఇన్‌చార్జి నాగూల్ మీరావలి, సాంబిరెడ్డి, వేసవి వినోద శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# సిబ్బంది సమన్వయంతో పనిచేసి పనితీరు మెరుగు పర్చుకోండి

**యడ్లపాడు, మే 31, ప్రభాతవార్త :** సచివాలయ సిబ్బంది అందరూ కలసి కట్టుగా విధులు నిర్వహించి సమన్వయంతో పనిచేస్తూ పనితీరును మెరుగు పర్చుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయితీ రాజ్ కమీషనర్ మరియు జిల్లా ప్రత్యేకాధికారి ఐఎఎస్ ఎ సూర్యకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని సచివాలయాన్ని, అర్‌బి కేంద్రాన్ని వైద్య అరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయంలో తనిఖీలో భాగంగా కార్యాలయంలోని సిబ్బంది పనితీరు, అన్‌లైన్ మరియు అఫ్‌లైన్ పరిశీలించారు. కార్యాలయంలోని వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ కరిమూన్, జిల్లా పరిషత్ సిఇవో జె మోహనరావు, ఎంపిడివో వై హనుమారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



# అలరించిన "సాహితీ కదంబం"

**గుంటూరు కల్చరల్, మే 31, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై "సాహితీ కదంబం" కార్యక్రమం రసజ్ఞులను అలరించింది. వర్థమాన నాట్య మయూరి వడ్లమన్నాటి నాగజ్యోతి విఘ్నేశ్వర స్తుతి, శివతాండవం కూచిపూడి నృత్యప్రదర్శన గావించింది. విశ్రాంత డిఎస్పీ డాక్టర్ గంటెల రవికుమార్ మహాభారతం మయసభ ఏకపాత్రాభినయం, పౌరాణిక నటులు తేళ్ళ రామారావు పద్యగానం రసజ్ఞులను అలరించింది. డాక్టర్ పెరుగుపల్లి బలరామ్ చే గర్భస్తుండగు జీవుండు భగవంతుని స్తుతించుట దా ్వరా జీవునికి దేవునికి మధ్యగల సంబంధాలపై పురాణశ్రవణం గావించారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ ్బయ్య మాట్లాడుతూ గద్య, పద్య కవితలు, నానిల సాహిత్యం ద్వారా వర్తమాన రచన రచయితలను ప్రోత్సహించడం, సాహితీ కదంబ కార్యక్రమాల ద్వారా కళారూపకాల ద్వారా కళాకారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జిల్లా రచయితల సంఘం ప్రోత్సహిస్తుందని వివరించారు. సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభా నిర్వహణ చేయగా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం సుభాని, కోశాధికారి నానా, నారిశెట్టి గాయత్రి, పలువురు సాహితీవేతలు తదితరులు పాల్గొన్నారు.



# వాలంటీర్లకు అవార్డులు అందించిన ఎమ్మెల్యే పీఆర్కే

**మాచర్ల, మే 31 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలంలోని బోదలవీడు, గుండ్లపాడు, కండ్లకుంట, కేపీగూడెం, శ్రీరాంపురం తండా, రచ్చమలపాడు గ్రామాల్లో ఉత్తమ సేవలందించిన 87 మంది వాలంటీర్లకు బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందించారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ సమస్యలపై సచివాలయానికి వచ్చిన ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కేను దుశ్శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, సంజీవరెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రూ. 60 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం

### మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి

**మాచర్ల, మే 31 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో రూ. 60 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని రింగురోడ్డు, నెహ్రూనగర్, కొమ్మాళ్లకాలువ తదితర ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. పట్టణాభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో కోతులు, ఆవుల బెడదను నివారించాలని కౌన్సిలర్లు కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం అజెండా పొందుపరిచిన అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



# మహిళల అభ్యున్నతికి చంద్రన్న వరాలజల్లు

### టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

**కారంపూడి, మే 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వరాలజల్లు కురిపించారని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామంలో మహిళలు చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలకు అండగా ఉందన్నారు. డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థికంగా చేయూతనందించారు. మహానాడులో ప్రకటించిన మేనిఫేస్టోలో మహిళలకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకొని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కష్టించిన వారికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, గోళ్ల సురేష్‌యాదవ్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, షేక్ నన్నేసా, చికెన్ కొట్టు జాని, మహిళలు పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

**కారంపూడి, మే 31 ప్రభాతవార్త:** వైసీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంపూడిలోని ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీకే సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో పథంలో నడిపిస్తూ దేశానికే ఆదర్శంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకొని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఇందిరాగాంధీ బొమ్మ వద్ద ఎమ్మెల్యే పీఆర్కేకు వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి పూలమాలతో పార్టీ కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ షేక్ షఫి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషా, వైస్ ఎంపీపీ గుండెబోయిన అమృతలక్ష్మి, సర్పంచ్ ప్రమీలాబాయి తేజానాయక్, మండల కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, బొమ్మిన అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, అంతరగడ్డ ఏసోబు, కరాలపాటి సుబ్బారావు, చీతిరాల వెంకటకోటేశ్వరరావు, షేక్ ఆరీఫ్, వేముల పద్మ లింగయ్య, చల్లా వీర్ల వరప్రసాద్, చిలుకూరి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చింతపల్లిలో అధికార పార్టీలో వర్గపోరు

### ఎమ్మెల్యే పీఆర్కే దృష్టికి వెళ్లిన నేతలు

**కారంపూడి, మే 31 ప్రభాతవార్త:** టీడీపీ కంచుకోటగా ఉన్న మండలంలోని చింతపల్లి గ్రామంలో అధికార పార్టీలో వర్గపోరు మొదలైంది. తొలి నుంచి టీడీపీకి చింతపల్లి గ్రామం అనుకూలంగా ఉండేది. గ్రామం నుంచే మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్‌లు తెలుగుదేశం పార్టీ నుంచే ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకొని గ్రామంలో ఎలాంటి గొడవలు, వర్గాలు లేకుండా అన్ని కులాలకు సముచితస్థానాన్ని కల్పించారు. పార్టీ కోసం కష్టపడే వారికి ముఖ్య ప్రాముఖ్యతను కల్పించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి రెండేళ్ల కాలం వస్తుండడంతో అధికార పార్టీ నేతల మధ్య సమన్వయం లోపించింది. దీంతో వర్గపోరు తయారైంది. గ్రామంలో తమ పెత్తనం కొనసాగాలంటూ ఎవరికి వారు హవాను కొనసాగిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌గా పనిచేసిన వారికి ఎలాంటి బేధాభిప్రాయాలు ఉండేవి కావు. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తమ హవాను ప్రదర్శిస్తున్నారు. గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు, ఉపాధిహామీ పనుల్లో అవినీతి, కౌలు రైతు కార్డుల్లో అక్రమాలు, వాటర్‌పైపులైన్లో అక్రమాలు ఇలా ఒకరికొకరు అక్రమాలు చేసుకుంటూ, దూషించుకుంటున్నారు. ఈ విషయం చిలికిచిలికి గాలివానలా మారి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వద్దకు ఫిర్యాదులతో నేతలు కారంపూడిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తీసుకొచ్చేందుకు వచ్చారు. చింతపల్లి వైసీపీ నాయకులతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఏ చిన్నపాటి ఆలస్యమైనా అధికారులపై మండిపడడం, దురుసుగా మాట్లాడుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికార పార్టీ నేతలతో అధికారులు నిరుత్సాహానికి గురికావడం, పనిచేయలేకపోతున్నామంటూ బాధను మనసులో పెట్టుకొని దాచుకుంటున్నారు. ఎమ్మెల్యే పీఆర్కే జోక్యం చేసుకుంటే తప్ప ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని అదికారులు వేడుకుంటున్నారు.

# ఘనంగా శీతలదేవి (బొడ్రాయి వార్షికోత్సవం )

**దుర్గి, మే 31, ప్రభాతవార్త :** ఓబులేశునిపల్లెలో బుధవారం శీతలదేవి (బొడ్రాయి) 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచే బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి భారీ అన్నదానం జరిగింది. ఈ వార్షికోత్సవానికి స్థానికులే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.



# ఫిర్యాదుపై విచారణ

**భట్టిప్రోలు,మే 31, ప్రభాత వార్త :** మండలంలోని ఐలవరం గ్రామ నివాసి పప్పల పోతురాజు ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, పంచాయితీరాజ్ అధికారులు అక్రమ నిర్మాణాలు చేపట్టి పంచాయితీ నిధులు దుర్వినియోగం చేసున్నారంటూ అనేక పర్యాయాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఈ ఫిర్యాదుపై వెంటనే విచారణ జరిపి ప్రస్తుతము అమలులో గల ప్రభుత్వ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కమీషనర్ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదుపై వెంటనే విచారణ చేపట్టి విచారణ తేదిని అర్జీ దారుకు ముందుగానే తెలియజేసి విచారణ నివేదికను సంబంధిత రికార్డుల పరమైన ఆధారములతో ఈ నివేదిక అందిన ఐదు రోజుల్లో కార్యాలయంలో తప్పని సరిగా సమర్పించవలసినదిగా ఆదేశించారు. సంబంధిత అధికారులు బుదవారం విచారణ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈఓపిఆర్‌డి శేఖర్‌బాబు విచారణ చేపట్టగా ఐలవరం గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, కార్యదర్శి ఎ.రమాదేవి, అసిస్టెంట్ ఇంజనీర్ కెఎస్ రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# జీతాలు ఇవ్వలేదు - పని మానేయమన్నారు. !

**గుంటూరు క్రైమ్, మే 31, ప్రభాతవార్త :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బందికి 404రోజుల నుంచి జీతాలు ఇవ్వకపోగా పని మానేయమని చరవాణి ద్వారా ప్రతి ఒక్కరికి ఫోన్ చేసి తెలియజేశారని ఆరోగ్యశ్రీలో పనిచేసే రోజు వారి కూలీలు వాపోతున్నారు. పేరుకు రోజువారి కూలీలు లెక్క తీసుకొని సంవత్సరాలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదని అదేమని ప్రశ్నిస్తే డ్యూటికి రావాల్సిన పనిలేదు నిధులు లేవంటూ సాకులు చెప్పి ఆగిపొమ్మన్నారని సిబ్బంది తెలిపారు. రోజువారి కాంట్రాక్టర్లది రెక్కాడితే డొక్కాడని జీవితాలను కరోనా సమయంలో కూడా బేషుగ్గా విధులు నిర్వహించి ప్రాణాలను సైతం లెక్క చేయలేని ఆరోగ్యశ్రీ సిబ్బందిని తొలగింతే తమ కుటుంబ పరిస్థితి ఎలా అని వారన్నారు. గతంలో ప్రాణవాయువులో పనిచేస్తున్న కోట అనిల్ తమ సమస్యని స్పందనలో అర్జిరూపంలో సమర్పించారని వేతనాలు ఇవ్వలేదని అడిగితే విధులకు రావద్దని సమాధానం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అనిల్ ప్రశ్నించారు. జూన్ ఒకటో తారీకు నుంచి ఆరోగ్యశ్రీలో పనిచేసే రోజువారి కూలీలు అవసరం లేదని జిజిహెచ్ అధికారులు కరాకండిగా తెలియజేశారని అరా ్థంతరంగా ఆగిపోవడం వల్ల తమ పరిస్థితి ఉందని సిబ్బంది తెలిపారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడా ఇవ్వలేదని తమ సమస్యను విన ్నవించుకోవడం వల్లసుమారు 4దఫాలుగా 100మందిని విధుల నుంచి తొలగించారని సిబ్బంది తెలిపారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై పునరాలోచన చేసి ఎన్నాళ్ళ నుంచో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టు బేస్ పద్ధతిలో వారిని కొనసాగించాలని కోరారు. తమ వేతనాలు తమకు ఇచ్చి తమను విధుల్లోకి తీసుకోకుంటే కలెక్టరేట్ ఎదుట నిరసన కొనసాగిస్తామని కరాకండిగా తెలిపారు.




# 'అసాధ్యుడు మనసున్న మనిషి'

**గుంటూరు కల్చరల్, మే 31, ప్రభాతవార్త :** తెలుగు సినిమా చరిత్రలో సుదీర్ఘకాలం నిలిచివెలిగిన హీరో కృష్ణ అసాధ్యుడని, మంచి మనసు ్నన్న మనిషి అని అవగాహన మనమూ పాడుదాం రండి బృందసభ్యులు నివాళులరి ్పంచారు. సంస్థ కార్యాల యంలో నిర్వహించిన సినీనటుడు కృష్ణజయంతి కార్యక్రమం జరిగింది, తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సినీరంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాటకరచయిత పివి రామ్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణ నటుడిగా ఉంటూనే సినిమారంగంలో సమస్త విభాగాలపైన పట్టుసాధించారన్నారు. గాయకుడు, కృష ్ణవీరాభిమాని అశోక్ మాట్లాడుతూ కథల ఎంపికలో సాంకేతికతలను కొత్త పుంతలు తొక్కించడంలో కృష్ణ ది ఒక విలక్షణమైన దారి అన్నారు. కార్యక్రమంలో సంగీత విధా ్వంసుడు మొగిలి, గాయకులు మురళీకృష్ణ, బాబురావు, గోవిందయ్య తదితరులు కృష్ణ సినిమాల్లోని పాటలు ఆలాపించారు.

# 'మహిళా మల్లయోధులపై పోలీసుల దాష్టీకాన్ని ప్రతిఒక్కరూ నిరసించాలి'

**గుంటూరు కల్చరల్, మే 31, ప్రభాతవార్త :** లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై కాకుండా దానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులపై పోలీసుల దాష్టీకాన్ని, కేసులు పెట్టి వేధించడాన్ని భారత ప్రజలందరూ నిరసించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తిచేస్తుంది. ఒలింపిక్ ్స, ప్రపంచ చాంపియన్ షిప్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు తదితర క్రీడావేదికలపై దేశం పేరుప్రఖ్యాతలను దశదిశలా ఇనుమడింపచేసిన మహిళా క్రీడాకారుల పట్ల పోలీసులు కనీస గౌరవం చూపకుండా తీవ్రమైన కాఠిన్యం చూపిస్తున్న తీరు అందర్ని కంటతడి పెట్టిస్తున్నాయని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. మహిళా మల్లయోధులకు పతకాలు వచ్చినప్పుడు పొగడ్తలతో ముంచెత్తే ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రులు ఇప్పుడు మౌన నిద్రలోనికి జారుకున్నారని ఇలాంటి నాయకులు మహిళా లోకానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారో ప్రతిఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. మహిళా మల్లయోధులపై పోలీసుల దాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని లైంగిక వేదింపులకు పాల్పడ్డ బ్రిజ్‌భూషణ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని అవగాహన సంస్థ డిమాండ్ చేస్తుంది.

# 'మూఢనమ్మకాల్ని ప్రచారం చేస్తున్న టీవి సీరియల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి'

**గుంటూరు కల్చరల్, మే 31, ప్రభాతవార్త :** దయ్యాలు, భూతాలు, క్షుద్రపూజలు అతీంద్రియశక్తుల గురించి వస్తున్న టీవి సీరియల్స్, ఇతర వినోద కార్యక్రమాల వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని వాటిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. ఈ తరహా టీవి సీరియల్స్ వలన మానవీయ విలువలు, మానవత్వం మంట కలిసిపోతుందని క్షుద్రపూజలు, చేతబడులతో చాలా జీవితాలు నాశనమై పోతున్నాయని ప్రభుత్వాలు, నియంత్రణ సంస ్థలు గుడ్లప్పగించి చూస్తున్నాయని అవగాహన సంస్థ విమర్శిస్తుంది. మేధావులు పిహెచ్‌డి చేసిన ఉద్దండులు కూడా గుడ్డిగా ఈ మూఢ నమ్మకాలను నమ్మివారి అజ్ఞానాన్ని బహిరంగ పరుచుకుంటున్నారని దేశం ఎటువైపు పోతుందో ప్రజలు గమనించాలని అవగాహన సంస్థ ఆందోళన ప్రకటిస్తుంది. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, తదితరులు ప్రసంగించారు.

# పర్యావరణ పరిరక్షణపై లోపిస్తున్న శ్రద్ధ

### ...విలవిలలాడుతున్న గ్రామీణ ప్రాతవాసులు

**యడ్లపాడు, మే 31, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో లోపిస్తున్న శ్రద్ధ కారణంగా రానున్నకాలంలో ప్రాణకోటి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం రాన్నుది. విచక్షణా రహితముగా వృక్షాల నరికివేత, రోజురోజుకు భారీగా పెరిగిపోతున్న వాహనాలు, ఫ్యాక్టరీలు ప్రకృతిలోకి వెదజల్లుతున్న విషవాయువుల కారణంగా గాలిలో బొగ్గుపులుసు వాయువు శాతం పెరుగుతున్నది. నేడు 16వ నెంబరు జాతియ రహదారిపై వేలాదిగా పయనిస్తున్న వాహనాల కారణంగా ధ్వని కాలుష్యం ఏర్పడి రహదారి ప్రక్కన నివశించేవారికి అనారోగ్య పరిస్తితులు నెలకోంటున్నాయి. కాళీ ప్రదేశాలు, బీడు భూములు, పచ్చికబైయిళ్ళు తగ్గిన కారణంగా గత 10 సంవత్సరాలలో యడ్లపాడు ప్రాంతములో గరిష్ట వర్షపాతం నమేదు కావటంలేదు. సమీప భవిష్యత్‌లో వర్షపాతం తగ్గి పంటలు పండే పరిస్తితులు ఉడవేమోన్న అనుమానంలో రైతాంగం అందోళన చెందుతున్నారు. ప్రతి వేసవిలోను తీవ్రస్దాయిలో నీటి ఏద్దడి ఏర్పడుతున్నది. నిత్యం శబ్దకాలుష్యంతో పలురకాల కొత్త కొత్త వైరస్ జ్వరాలు ప్రజలను పీడిస్తున్నాయి. వాతావరణంలో సంభవిస్తున్న పేనుమార్పులు వచ్చి సమతుల్యాత లోపించిన కారణంగానే ఈ రకమైన సమస్యలు ఉద్భవిస్తున్నాయి. చెట్లను పేంచాలని ప్రభత్వం ఎన్నో ప్రణాళికలను ప్రకటించిన అచరణలో మాత్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొలేక పోతున్నదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ స్దలాలు, పాఠశాలలో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలు, రహదారుల వెంబటి వున్నటువంటి వాటిని నరికివేసి కైంకర్యం చేసుకుంటున్నా ఏవరూ పట్టిపట్టనట్లు వున్నటువంటి స్దితి నెలకొని ఉన్నది. మండల పరిధిలో సుమారు విస్తీర్ణం 15,708 హెక్టార్లు కాగా అడవులు సుమారు వెయ్యి హెక్టార్లలో సంతరించుకోని వున్నాయి. వాతావరణ పరిరక్షణలో చెట్ల ప్రాముఖ్యాన్ని రైతాంగం కూడా అంతగా శ్రద్ధ చూపించటం లేదు. రోజు రోజుకు పెరిగిపోతున్న జనాబా, సాగు విస్తీర్ణం కొరత కారణంగా గ్రామాలల్లో ప్రస్తుతం పచ్చిక బైళ్ళుకూడా కానరావడంలేదు. నేడు వాగులు, వంకలునుసైతం దున్ని సాగుకు అనువుగా తయారు చేసుకుటుంన్నారు. ప్రాణకోటికి జీవనాధారమైన గాలిలో నత్రజని 78శాతం, అక్సిజన్ 21శాతం, బొగ్గుపులుసు వాయువు 0.03శాతం మాత్రమో వుండాలి. రవాణా వాహనాలు, పెద్ద పరిశ్రమల వల్ల వెలువడే పోగలో బొగ్గుపులు శాతం అధికంగా వుంటుంన్నది. వాతావరణంలో సమతుల్యతలు లోపించిన కారణంగానే వర్షాలు తగ్గుముఖం పట్టాయని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. గ్రామీణ ప్రాంతములో నేటికి వంటచెరకు నిమిత్తం కలపనే వాడుతున్నారు. "చెట్లను పెంచితే అది నిన్ను రక్షిస్తుంది" అనే నినాదాన్ని ఇచ్చిన ప్రభుత్వం అచరణలో రాకపోవటం భాధాకరం. ఇక నైన గ్రామాల్లోని బంజరు భూములు, కాళీ అసైన్‌డ్ భూములలో, రోడ్ల ప్రక్కన చెట్లను పేంచవలసిన పరిస్తితులు నేలకోనివుంది.

# రూ.17 వేల కోట్ల విలువైన 2 వేల నోట్లు వచ్చాయి : ఎస్‌బిఐ

**న్యూఢిల్లీ, మే 31:** రూ.వేల నోటును చలామనిలో నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 19న ప్రకటన విడుదల చేసిన ఆర్‌బిఐ 24వ తేదీ నుంచి నోట్ల మార్పిడికి అవకాశం కల్పించింది. దీంతో జనం తమ దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో




మార్చుకుంటున్నారు. ఇందులో ఎక్కువ శాతం మంది బ్యాంకు ఖాతాదారులు రూ.2వేల నోట్లను డిపాజిట్ చేయడానికే మొగ్గు చూపుతున్నారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఆర్‌బిఐ నిర్ణయంతో ఈ వారం రోజుల్లో రూ.17 వేల కోట్ల విలువైన పెద్ద నోట్లు ఎస్‌బిఐకి వచ్చాయని పేర్కొంది. ఇందులో సుమారు రూ.14 వేల కోట్ల విలువైన నోట్లను ఖాతాదారులు డిపాజిట్ చేయగా మిగతా రూ.3 వేల కోట్ల విలువైన నోట్లను ఖాతాదారులు డిపాజిట్ చేయగా మిగతా రూ.3 వేల కోట్ల విలువైన నోట్లను మార్చుకున్నారని వివరించింది. నోట్ల మార్పిడి, డిపాజిట్‌కు సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఉండడంతో బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుతాయని బ్యాంకు రీసెర్చ్ వింగ్ అంచనా వేసింది. దాదాపు 80 శాతం ఖాతాదారులు రూ.2 వేల నోట్లను డిపాజిట్ చేస్తుండడంతో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌ల పరంగా బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ లక్ష కోట్లకంటే గణనీయంగా పెరుగుతుందని ఎస్‌బిఐ రీసెర్చ్ వింగ్ పేర్కొంది.

# శాంతికి భగ్నం కలిగించే చర్యలను కఠినంగా అణిచివేస్తాం




## ప్రత్యేక గిరిజన రాష్ట్రం మణిపూర్ ప్రాదేశిక సమగ్రతకు విఘాతం

## సుస్థిర శాంతిస్థాపనకు పౌరసంఘాలు కలిసిరావాలి

## కుకీ, మైతీ తెగల నేతలతో కేంద్ర మంత్రి అమిత్‌షా చర్చలు

**గువాహతి, మే 31:** మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండను అదుపుచేసేందుకుగాను జరుగుతున్న రాష్ట్రప్రభుత్వ కార్యాచరణను మరింత వేగవంతంచేసి ఇరువర్గాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కేంద్ర మంత్రి అమిత్‌షా ఆదేశాలు జారీచేసారు. తన నాలుగు రోజులపర్యటనలో భాగంగా అమిత్‌షా మణిపూర్‌లోని సరి హద్దు పట్టణం మోరేను సందర్శించారు. భారత్ మైన్మార్ సరిహద్దుల్లో ఈ పట్టణం ఉంది. నెలరోజులుగా కొన సాగు తున్న జాతుల వైరం, ఉద్రిక్తతలను పరిగణనలోనికి తీసుకుని అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలన్నింటినీ హోంమంత్రి సంద ర్శించారు. ఇప్పటివరకూ ఈ ఘర్షణల్లో 80 మంది చనిపోయారు. అతేకాకుండా రెండుజాతులమధ్య చెలరేగిన వైరం సర్దుబాటుచేసేందుకు ఇంఫాల్‌లో మంత్రి విడతల వారీగా సమావేశాలునిర్వహించారు. కుకీ, మైతీ తెగల నాయ కులతోను, ఉన్నతస్థాయి సెక్యూరిటీ అధికారులు, మణిపూర్ కేబినెట్‌తో కూడా పాల్గొని ఈ ఉద్రిక్తతల పరిష్కారంపై చర్చించారు. అలాగే శాంతిస్థాపనకోసం మణిపూర్‌లో ఆఃలపక్ష సమావేశం కూడా నిర్వమించారు. మొత్తం ఇప్పటివరకూ తొమ్మిది సమావేశాలునిర్వహించిన అమిత్‌షా తక్షణమే సుస్థిర శాంతినెలకొల్పేందుకు అన్నివర్గాలు సహకరించాలనికోరారు. సరిహద్దుపట్టణం మోరేను పర్యటించిన మోడీ కుకీ సివిల్‌సొసైటీ నాయకులతో చర్చలుజరిపి ప్రస్తుతం అక్కడ ఉన్న భద్రతా చర్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కాంగ్పోక్పి జిల్లాలోపర్యటించారు. ఈ ప్రాంతంలోనే కుకీ తెగలు అత్యధిక జనాభా ఉంది. అలాగే మైతీ తెగకు చెందినవారి గ్రామాలుకూడా ఉన్నాయి. ఈఘర్షణల్లో భారీగా దెబ్బతిన్న జిల్లాకూడా ఇదే. రెండుతెగలకు చెందిన ఆరాధ్యమందిరాలు, ఇరువర్గాల భవనాలు కట్టడాలను కూడా ధ్వంసంచేసారు. ఓపక్క అమిత్‌షా చర్చలుజరుపుతుండగానే రాష్ట్రంలోకొన్ని చోట్ల అల్లర్లుజరిగాయి. కల్లోలితకారులు, సెక్యూరిటీ దళాలమధ్య కాల్పులుజరిగాయి. కాక్‌చింగ్‌జిల్లాలోని సుగ్ను ప్రాంతంలో ఈ కాల్పులుజరిగినట్లు నివేదికలందాయి. ఇంఫాల్ తూర్పు ప్రాంతంల్నోఇ సాగోల్మాంగ్ ప్రాంతంలోను ప్రత్యేక దాడులు జరిగాయి. ఒక గిరిజన సాలిడారిటీ మార్చి సందర్భంగా గతనెలలో ఈ ఘర్షణలు ఎగిసిపడ్డాయి. మైతీతెగను ఎస్టీజాబితాలో చేర్చాలని, తమకు ఎస్టీహోదా కల్పించాలని డిమాండ్‌చేసారు. అక్కడినుంచే ఘర్షణలు పెరిగి తుపాకులమోత ఎక్కువయింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు ఆశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్‌భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్‌కుమార్ దేకా కూడా ఉన్నారు. మణిపూర్‌కేబినెట్ సమావేశం తర్వాత ఐదు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవాలని భావించారు. రాష్ట్రంలో ముందు సాధారణపరిస్థితులు నెలకొల్పడం, శాంతిభద్రతలను మెరుగుపరచడం, పునరావాస రక్షణ చర్యలు పర్యవేక్షణ, హింసలో మృతుల కుటుంబాలకు పరిహారం, ప్రసార సౌకర్యాలను తిరిగి పునఃప్రారంభించి విషప్రచారాన్ని కట్టడిచేయాలనినిర్ణయించారు. శాంతికి భగ్నం కలిగించే చర్యలను కఠినంగా అణిచివేయాలని ఈ హింసకు మూలకారణాలను సిబిఐ దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు. పదిమంది గిరిజన ఎమ్మెల్యేలు ఈసందర్భంగానే గిరిజనులకోసం ప్రత్యేకరాష్ట్రం కావాలని కోరారు. అయితే మణిపూర్ ప్రాదేశిక సమగ్రతలో రాజీపడే ప్రశ్నేలేదని అమిత్‌షా వారికి స్పష్టంచేసారు

. గిరిజన ప్రాబల్యం అధికంగా ఉన్న చురచంద్‌పూర్‌జిల్లాలో షా పర్యటించి హింసను కట్టడిచేసేందుకు పౌరసంఘాల నాయకులు సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని గిరిజన తెగలకు 20 టన్నుల బియ్యం వెంటనే పంపిస్తామని అన్నారు. పర్యటించిన ప్రతిచోటా ప్రజలనుంచి పౌరసంఘాలనేతలనుంచి శాంతిస్థాపనకు అవసరమైన సూచనలు సలహాలను స్వీకరించారు.

### ధ్రువ్ హెలికాప్టర్లకు క్లియరెన్స్ పునరుద్ధరించిన సైన్యం

**న్యూఢిల్లీ, మే 31:** భారత సైన్యంలో ధ్రువ్ హెలి కాప్టర్లకు క్లియరెన్స్‌ను సైన్యం పునరుద్ధరించింది. దాదాపు నెలరోజులుగా ఈ దేశీయ హెలికాప్టర్లను సైన్యం వినియోగించడం లేదు. తాజాగా కొన్ని షర తులతో కూడిన క్లియరెన్స్ ను జారీ చేశారు. దీంతో కేవలం కొన్ని పరిమిత, అత్యవసర ఆపరేషన్ల కోసం మాత్రమే దీనిని వినియోగించే అవకాశం ఉంది. అంతేకాదు. ఈ హెలికాప్టర్లను పూర్తిగా తనిఖీలు చేసి అవసరమైన ఫిట్‌నెస్ ధృవీకరణ లభిం చిన తర్వాత మాత్రమే ఎగరాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం సైన్యం వద్ద దేశీయంగా తయారుచేసిన 145 ధ్రువ్ హెలికాప్టర్లు ఉండగా వాయుసేన వద్ద 70, నౌకాదళం వద్ద 18, కోస్టుగార్డ్ వద్ద 20 వరకు ఉన్నాయి. తాజా నిబం ధనల ప్రకారం హెలి కాప్టర్లకు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి ఫిట్‌నెస్ లభించిన తర్వాతే వినియోగంలోకి తీసుకురా వాల్సి ఉంటుంది. మే 4న జమ్ముకశ్మీర్‌లో జరిగినధ్రువ్ హెలికాప్టర్ ప్రమాదంలో ఒక టెక్ని షియన్ మృతి చెందగా ఇద్దరు పైలట్లు గాయ పడ్డారు. ఈ ప్రమాదం తర్వాత నిబంధనల ప్రకా రం సైన్యం ధ్రువ్‌ల విన యోగాన్ని తాత్కా లికంగా నిలిపివేసింది. అంతకు ముందే రెండు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో నౌకా దళం, కోస్టుగార్డ్ కూడా నెలరోజుల పాటు ధ్రువ్‌ల వినియోగాన్ని నిలిపి వేశాయి. ధ్రువ్ హెలి కాప్టర్లు భారత సాయుధ దళాలకు ప్రధాన సాధ నంగా ఉన్నాయి. సియా చిన్, లద్దాఖ్ వంటి అత్యధిక ఎత్తైన ప్రాంతా ల్లోని సైనికులకు ఇవి సేవలు అందిస్తున్నాయి.

# మోడీజీ దేవుడికే పాఠాలు చెప్పగల ఘనుడు

# అమెరికాలో రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 31:** అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం భారత ప్రజలను భయపెడుతోందని, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక ప్రధాని మోడీ దేవుడికే పాఠాలు చెప్పే ఘనుడంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాలిఫోర్నియాలోని శాంటా క్లారాలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలతో రాహుల్ చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోడీపై విమర్శల వర్షం కురిపించారు. అంతా తమకే తెలుసు అని ప్రజలను నమ్మించే వ్యక్తులు భారత్‌లో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. వారు శాస్త్రవేత్తలకే శాస్త్రాన్ని చెబుతారు. చరిత్రకారులకు చరిత్రను వివరిస్తారు. సైన్యానికి యుద్ధాన్ని నేర్పిస్తారు. వారు దేవుడితో కూర్చుంటే ఆయనకే వివరించగల సమర్థులు, ప్రధాని నరేంద్ర మోడీ అందుకు గొప్ప




ఉదాహరణ. ఒకవేళ మోడీ ఆ భగవంతుడి పక్కన కూర్చుంటే, ఈ ప్రపంచం ఎలా పనిచేస్తుందని దేవుడికే చెప్పగలరు. అప్పుడు భగవంతుడు కూడా తాను సృష్టించిన విశ్వం ఇదేనా అని గందరగోళానికి గురవుతారు' అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. బిజెపి ప్రజలను భయపెడుతోంది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. ప్రజలతో మమేకమయ్యేందుకు అవసరమైన అన్ని సాధనాలను బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రించింది. ఒకప్పటి రాజకీయ వ్యూహాలు ఇక పనిచేయని అర్థమైంది. అందుకే బిజెపి జోడో యాత్రను చేపట్టా. నా యాత్రను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు. మా యాత్రకు మరింత ఆదరణ దక్కింది. ఆ ప్రయాణంలో నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా' అని రాహుల్ గాంధీ వివరించారు. వారం రోజుల పర్యటన నిమిత్తం రాహుల్ గాంధీ మంగళవారం అమెరికా చేరుకున్నారు.' మొహబత్ కి దుకాణ్' పేరుతో కాలిఫోర్నియాలో ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు. వాషింగ్టన్, న్యూయార్క్‌లోనూ రాహుల్ పర్యటించనున్నారు. అక్కడి ప్రవాసభారతీయులతో ఆయన ముచ్చటించనున్నారు. అమెరికా చట్టసభ ప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులతో ఆయన చర్చలు జరపనున్నారు. జూన్ 4న న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నట్లు కాంగ్రెస్ వెల్లడించింది.

# నేను మళ్లీ అధికారంలోకి వస్తే ఆ హక్కు ఉండదు: ట్రంప్

**వాషింగ్టన్, మే 31:** అక్రమ వలసదారులకు అమెరికాలో జన్మించే చిన్నారులకు లభించే పౌరసత్వ హక్కును తాను అధికారంలోకి వస్తే రద్దు చేస్తానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున 2024 అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగేందుకు అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న అభ్యర్థుల్లో ట్రంప్ ముందున్న విషయం విదితమే. తాజాగా ట్రంప్ ప్రచార వీడియో ఒక దానిని ఆయన కుమారుడు ట్రంప్ జూనియర్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఈ వీడియోలో బర్త్ రైట్స్ అంశాన్ని సీనియర్ ట్రంప్ ప్రస్తావించారు. వాస్తవానికి ఇది అమెరికా రాజ్యాంగానికి విరుద్ధం,



చిన్నారులకు అమెరికాలో పుట్టుకతో లభించే పౌరసత్వాన్ని ఆ దేశ రాజ్యాంగం 140 సవరణతో అందించారు. దీనికి అమెరికా చట్టసభ 1868లో ఆమోదించింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టగానే తొలిరోజే ఈ హక్కును రద్దు చేస్తానని పేర్కొన్నారు. పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరికి అమెరికా పౌరసత్వం లేదా చట్టపరంగా అమెరికాలో నివసించే హక్కు ఉండాల్సిందని ట్రంప్ జారీచేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో ట్రంప్ ఇటువంటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీచేయాలని ట్రంప్ భావించారు. కానీ తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. జో బైడెన్ తీరును ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుతం రికార్డుస్థాయిలో వలసదారులు అమెరికాలోకి చొరబడుతున్నారని విమర్శించారు. పిల్లలకు పుట్టుకతో లభించే పౌరసత్వ హక్కు వలసదారులను ఎక్కువగా ఆకర్షిస్తోందన్నారు.



# హామీల ఫార్ములాతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

## రాజస్థాన్‌లో ప్రధాని మోడీ

**అజ్మేర్, మే 31:** కాంగ్రెస్‌పార్టీ ఇస్తున్న హామీల ఫార్ములా అలాగే కొనసాగితే దేశం దివాలా స్థితికి చేరుతుందని ప్రధానిమోడీ పేర్కొన్నారు. మరో ఐదునెలల్లో ఎన్నికలకు వస్తున్న రాజస్థాన్‌పై బిజెపి ఫోకస్ పెంచింది. ఇప్పటికే రాజస్థాన్‌లో మూడుసార్లు పర్యటించిన మోడీ నాలుగోపర్యటనగా అజ్మేర్, పుష్కర్‌లలో జరిగిన ర్యాలీల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకోసం కాంగ్రెస్‌ప్రభుత్వం హామీల ఫార్ములా కొనసాగిస్తోందని, ఇదే తీరులో కొనసాగితే ప్రభుత్వ స్థిరత్వం ఏమిటో పాలకులు చెప్పాలంటూ విమర్శించారు. బిజెపి జన్‌సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధానిమోడీ ఈ రెండుచోట్లా అవినీతికాంగ్రెస్ అంటూ ధ్వజమెత్తారు. కర్ణాటకలోని కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఐదు గ్యారంటీలు ఇచ్చిందని, చెపుతూ కాంగ్రెస్‌పార్టీ ఇపుడు కొత్తఫార్ములా చేపట్టిందని, హామీల ఫార్ములాతో వస్తోందని, అయితే వారు ఎక్కడా వారిచ్చిన హామీలను భర్తీచేసారా అని ప్రశ్నించారు. అదేజరిగితే దేశం మొత్తం దివాలా దిశకు చేరుతుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లోత్ ఆధ్వ ర్యంలోప్రారంభించారు. సాంఘికసంక్షే పథకాలు ఉచిత విద్యుత్‌నుంచి వంటగ్యాస్ చౌకధరలకే అంది స్తామని ప్రకటించారు. దీనిపై ప్రధానిమోడీ మాట్లా డుతూ 50 ఏళ్ల క్రితం కాంగ్రెస్‌పార్టీ దేశంలో పేద రికాన్ని నిర్మూలిస్తామని చెప్పిందని, ఇప్పటికయినా హామీ నెరవేర్చిందా ఆపార్టీ నిరుపేదలకు ఈ హామీతో ద్రోహంచేసిందని చెప్పుకొచ్చారు. పేదలను పేదలు గానే అణగదొక్కేందుకు కాంగ్రెస్ పార్టీ నిరుపేదలను మభ్యపెడుతోందని అన్నారు. రాజస్థాన్‌ప్రజలు కూడా ఇలాంటి హామీలతో ఎక్కువ నష్టపోయారన్నారు. ఇపుడు రాజస్థాన్ పరిస్థితినే ప్రజలు గమనించాలని, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి, మంత్రులు వారిలో వారే కొట్టుకుంటున్నారని మోడీ ఎద్దేవాచేసారు. గడచిన తొమ్మిదేళ్లలో తమ ప్రభుత్వం ప్రజలసేవకే అంకితం అయిందని, సుపరిపాలన, పేదల సంక్షేమమే తమకు లక్ష్యమని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఒకేసారి చదువుతూ ఏకరువుపెట్టారు.

2014కు ముందు ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారని, ప్రధాన నగరాల్లో ఉగ్రదాడులు ముమ్మరంగా సాగాయని, ఆనాడు కాంగ్రెస్‌పార్టీ రిమోట్‌కంట్రోల్‌ప్రభుత్వం నడిపిందని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీయే అవినీతి వ్యవస్థను వృద్ధిచేసిందని, ప్రజల రక్తం తాగుతూ అభివృద్ధిని దాచిపెట్టిందన్నారు. ఆనాడు రాజీవ్‌గాంధీయే స్వయంగా పేదలకు ఖర్చుచేసే వందపైసల్లో కేవలం 15 పైసలు మాత్రమే పేదలకు చేరుతోందనిఅన్న అంశాన్ని మోడీ ర్యాలీలో గుర్తుచేసారు. అంతకుముందు ప్రధానిమోడీ పుష్కర్‌ను సందర్శించారు. దేశంలోనే ఏకైక మందిరంగా ఉన్న బ్రహ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

# ప్రపంచదేశాల్లో 68.95 కోట్లమంది వైరస్ బాధితులు

## 68.84 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 31:** ప్రపంచదేశాల్లో కరోనా ఛాయలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. చిన్నచిన్నదేశాల్లో ఈవైరస్ జాడ ఇంకా ప్రజలను భయపెడుతూనే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా బుధవారం నాటికి 68.95 కోట్లమందికికరోనాసోకి వారిలో 68.84 లక్షలమందిచనిపోయారు. మరో 38,124 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.19 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.06 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 24.93 కోట్లకుపైగా నమోదుకాగా మరో 20.61 లక్షలమంది చనిపోయారు. మరో 5785 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.54 కోట్లకుపైగా నమోదుకాగా మరో 19.28 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికాదేశాల్లో 12.67 కోట్లకుపైగా కేసులునమోదుకాగా 16.33 లక్షలమంది చనిపోయారు. 6209 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.26 కోట్లకుపైగా నమోదుకాగా మరో 24.77 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.75 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 15.46 లక్షలమంది చనిపోయారు. మరో 15,368 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.12కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.47 కోట్లకుపైగా బాధితులు ఇప్పటికీ వైరస్‌తో బాధపడుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.87 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 13.56 లక్షలమందిచనిపోయారు. మరో 10,115 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.64 కోట్లకుపైగా నమోదుకాగా మరో 9.05 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 2,58,772 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 1.21కోట్లకుపైగా నమోదయ్యాయి. మరో 4,79,281 మందిపరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 19 ద్వీపకల్పదేశాల్లో 1.43 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 28,093 మందిచనిపోయారు. రికవరీలు 1.42 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1,49,258 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది.

# ప్రధాని హత్యకు కుట్రకేసులో ఎన్‌ఐఎ దాడులు!

**న్యూఢిల్లీ, మే 31:** జులై 2022లో పాటాలో ప్రధాని నరేంద్ర మోడీని హత్య చేయాలన్న పిఎఫ్‌ఐ కుట్రపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఐఎ తాజాగా కర్ణాటకలోని 16 చోట్ల దాడులు నిర్వహించింది. ఈ కుట్రకు సంబంధించి పుట్టూరు, కుర్నాడక్, కుంబ్ర, తారిపాడ్పు గ్రామల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసింది. అనుమానితులుగా మహమ్మద్ హారిస్, సాజిద్ హుస్సేన్, ఫైజల్ అహ్మద్, సంషుద్దీన్‌లను గుర్తించారు. గతే




డాది ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ పిఎఫ్‌ఐపై చేసిన దాడుల్లో ఆ సంస్థ సభ్యుడు షఫీక్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించింది. పిఎఫ్‌ఐ సంస్థ 12 జులై 2022 నాడు ప్రధాని మోడీని పాట్నాలో హత్య చేయడానికి కుట్రపన్నినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. అంతేకాకుండా పిఎఫ్‌ఐ మరిన్ని టెర్రర్ మాడ్యూల్స్, దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించింది. బుధవారం దక్షిణ కన్నడ జిల్లాలోని 16 చోట్ల ఎన్‌ఐఎ దాడులు చేసి ఈ కుట్రకు సంబంధించిన పలు పత్రాలను స్థానికుల సాయంతో వెరిఫికేషన్ చేసింది. పుత్తూరు, బెల్తంగాడి, వెనూరు వంటి ప్రదేశాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. పిఎఫ్‌ఐ ప్రతినిధులకు చెందిన ఇళ్లు, ఆఫీసులు, ఆసుపత్రుల్లో ఇవి జరిగాయి. గల్ఫ్ దేశాల నుంచి అందే సొమ్ముతో పిఎఫ్‌ఐ భారత్‌లో ఉగ్రవాదానికి పాల్పడుతోందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ భారత దేశంలో పిఎఫ్‌ఐ హవాల నెట్‌వర్క్‌ను పెకలించేందుకు ఈ దాడులు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. 2022లో పాట్నాలోని ఫుల్వార్ షరీఫ్ వద్ద ఐదుగురు వ్యక్తులు జాతి వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఎన్‌ఐఎ అరెస్టు చేసింది. ఈ దాడిలో చాలా కీలక పత్రాలు బయటపడ్డాయి. వీటిల్లో పిఎఫ్‌ఐ మిషన్ 2047 కూడా ఉంది. తాజాగా పిఎఫ్‌ఐ నెట్‌వర్క్ దక్షిణ కన్నడ జిల్లాలో ఉన్నట్లు అంచనాకు వచ్చి ఎన్‌ఐఎ ఈ దాడులు చేపట్టింది.

# పంజాబ్ కేబినెట్‌లోకి మరో ఇద్దరు ఎమ్మెల్యేలు



**చండీఘర్, మే 31:** పంజాబ్‌లోని భగవంత్‌సింగ్‌మాన్ ప్రభుత్వం కేబినెట్‌ను విస్తరించింది. ఆప్ ఎమ్మెల్యేలు గుర్మీత్‌సింగ్ ఖుదియాన్, బల్కార్‌సింగ్‌లను మంత్రివర్గంలోకి తీసుకుంది. గవ ర్నర్ బన్వారిలాల్ పురోహిత్ ఇద్దరు మంత్రులచేత రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారంచేయించారు. ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు. ముక్త్‌సర్‌జిల్లాలోని లాంబి స్థానంనుంచి ఖుదియన్ పోటీచేసి ఆప్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రకాష్‌సింగ్ బాదల్‌ను ఆయన స్వస్థలంలోనే 11,396 ఓట్లతో ఓడించారు. 2021లో కాంగ్రెస్‌కు రాజీనామాచేసి ఖుదియన్ ఆప్‌లోచేరి మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. బాల్కర్ సింగ్ కర్తార్‌పూర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. జలంధర్‌ప్రాంతంలోని రిజర్వుడు స్థానం కర్తార్‌పూర్. సింగ్‌మాజీ పోలీస్ అధికారికూడా ఆమ్ ఆద్మీపార్టీలో 2021లో చేరారు. పంజాబ్‌పోలీస్‌నుంచి రిటైర్ కాగానే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. కర్తార్‌పూర్ అసెంబ్లీస్థానం జలంధర్ పార్లమెంటుస్థానం పరిధిలో ఉంది. అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లోనే సుశీల్‌రింకు భారీ విజయంతో ఉప ఎన్నికలో గెలిచారు. 14నెలల మాన్ ప్రభుత్వం మూడోసారి మంత్రివర్గాన్ని విస్తరించింది. 2022 జులైలో మాన్‌ప్రభుత్వం మొదటి విస్తరణలో ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకుంది. ఈ ఏడాదిజనవరిలోకూడా సీనియర్ ఆప్ నేత పాటియాలా రూరల్ ఎమ్మెల్యే డా.బల్బీర్‌సింగ్‌ను కేబి నెట్ మంత్రిగా ఎంపికచేసారు. ఫౌజాసింగ్ సరారి రాజీ నామాతో బల్బీర్‌సింగ్‌కు స్థానం కల్పిం చారు. ఇక మంగళవారం ఇందర్‌బీర్ సింగ్ నిజ్జర్ వ్యక్తిగత కార ణాలపై రాజీనామా చేసారు.

పంజాబీ దినపత్రికఅజిత్ ఎడిటర్ ఇన్‌ఛీఫ్ బర్జిందర్‌సింగ్ హందర్ద్‌కు మద్దతుగా నిలిచినందుకుగాను నిజ్జర్ విమర్శలు ఎదుర్కొన్నారు. జంగ్ ఇ ఆజాది స్మారక నిర్మాణం జలంధర్‌లో చేపట్టాల్సి ఉంది. ఇందు కోసం 315 కోట్లను దుర్వినియోగం చేసారన్న ఆరోపణలపై ఇపుడు అజిత్ ఎడిటర్‌ఇన్‌ఛీఫ్ విజిలెన్స్ నిఘాలో ఉన్నారు. అందువల్లనే నిజ్జర్‌రాజీనామా చేయడంతో గవర్నర్ ఆమోదం తెలిపారు.

# మా వాటా జలాలు మాకివ్వాల్సిందే

## మహారాష్ట్ర సిఎం షిండేకు కర్ణాటక సిఎం సిద్ధరామయ్య లేఖ



**బెంగళూరు, మే 31:** మహారాష్ట్ర, కర్ణాటక మధ్య జలాల పంపిణీ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. వరనా, కొయినా రిజర్వాయర్ నుంచి కృష్ణానదికి 2.00 టిఎంసిల జలాలు, ఉజ్జయిని రిజర్వాయర్ నుంచి భీమా నదికి 3.00 టిఎంసి నీటిని వదలాల్సిందిగా సంబంధిత అధికారుల ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు ఒక లేఖ రాశారు. ఉత్తర కర్ణాటకలోని ప్రజలు, పశువుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు తక్షణం ఈ జలాలను విడుదల చేయాలని సిద్ధరామయ్య ఆ లేఖలో కోరారు. కర్ణాటకకు మహారాష్ట్రతోనే కాకుండా పొరుగున్న ఉన్న తమిళనాడుతోనూ జలవివాదాలు ఉన్నాయి. కావేరీ జలాల అంశం తమిళనాడు, కర్ణాటక మధ్య ఉండగా, కృష్ణ జలాల షేరింగ్ వివాదంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి. చిరకాలంగా ఉన్న ఈ సమస్యలను పరిష్కరిచేందుకు కేంద్రం, సుప్రీంకోర్టు, హైకోర్టులు, కేంద్ర జలవనరుల కమిషన్, కావేరీ రివర్ మేనేజిమెంట్ అథారిటీ, కావేరీ వాటర్ రెగ్యులేషన్ కమిటీ ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. ఇది చాలా క్లిష్టమైన అంశం కావడంతో పాటు భాగస్వామ్య రాష్ట్రాల్లోని లక్షలాది మంది రైతులపై ప్రభావం సైతం ఉంటుంది. గత యేడాది సెప్టెంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చొరవ తీసుకుని, నదీ జలాల పంపిణీకి సంబంధించి సంయుక్త పరిష్కారాన్ని దక్షిణాది రాష్ట్రాలు కొనుగొనాలని కోరారు. తిరువనంతపురంలో జరిగిన 30వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఉద్దేశించి అమిత్ షా ఈ సూచన చేశారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణను కోరారు. ఈ సమావేశంలో మొత్తం 26 అంశాలపై చర్చ జరగగా 9 అంశాలు పరిష్కారమయ్యాయి. 17 అంశాలపై మరోసారి చర్చించేందుకు నిశ్చయించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్‌కు సంబంధించిన 9 అంశాలున్నట్లు సమావేశానంతరం విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది.

### ఐదునెలల కనిష్టానికి కీలకరంగాల వృద్ధి

**న్యూఢిల్లీ, మే 31:** భారత్‌లో కీలక రంగాల వృద్ధిఐదు నెలల కనిష్టానికి నమోద యింది. మార్చినెలనాటికి 3.6శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. మొత్తం ఎనిమిది మౌలిక వనరుల పరిశ్రమలు మార్చి నెలలో కేవలం 3.6శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేసాయి. మొత్తం ఆరు కీలకరంగాల్లో వృద్ధి మందగించింది. సహజ వాయురంగంలో 2. 8శాతం, చమురు శుద్ధి రంగ ఉత్పత్తుల్లో 1.5 శాతం, ఎరువులరంగంలో 9.7శాతం, ఉక్కుపరంగా 8.8శాతం, సిమెంట్ మైనస్ 0.8శాతం విద్యుత్ మైనస్ 1.8శాతం వృద్ధిని నమోదుచేసాయి. బొగ్గు ఉత్పత్తి మాత్రం 12.2 శాతంగా ఉంది. ముడి చమురు ఉత్పత్తి మెరుగు పడినా ఇప్పటికీ మైనస్ 2.8శాతంగానే ఉంది. 2023 ఆర్థిక సంవత్స రంలో కీలకరంగం వృద్ధి 7.6శాతంగా ఉంది. అంతకు ముందు సంవత్స రం 10.4శాతం గా ఉంటే ఈ ఏడాది భారీగా తగ్గింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 1.7శాతంగా ఉంది. గడచిన 11 నెలలుగా ఉత్పత్తి మందగించింది.

# జ్ఞానవాపి మసీదుకేసులో వారణాసి కోర్టుకే విచారణ బాధ్యతలు

## మసీదుకమిటీ సవాల్ పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు



**వారణాసి, మే 31:** గ్యానవాపి మసీదులో హిందూ శివలింగానిన ఆరాధించేందుకు అనుమతించాలన్న పిటిషన్‌పై ఈ విచారణ స్థానిక కోర్టులోనే కొనసాగుతుందని, వారణాసి కోర్టు విచారణ పూర్తిచేస్తుందని అలహాబాద్‌హైకోర్టు స్పష్టంచేసింది. బుధవారం మసీదు కమిటీ దాఖలుచేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ మసీదులో హిందూ మహిళలు కొందరు గ్యానవాపి మసీదులో ఉన్న దేవుళ్లను ఆరాధించేందుకు అనుమతించాలన్న కోర్టు అనుమతిని వారణాసి కోర్టు విచారణచేస్తుందన్నారు. అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ, సున్నీ వక్ఫ్‌బోర్డులు హైకోర్టులో ఈకేసును డిస్మిస్‌చేయాలని పిటిషన్ దాఖలుచేసారు. 1991 ఆరాధనమందిరాల చట్టం ప్రకారం ఈ పిటిషన్ చెల్లదని, సెంట్రల్ వక్ఫ్‌బోర్డు చట్టం 1995 ప్రకారం కూడా చెల్లదనం అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టివేయాలన ఇకోరారు. వీరి పిటిషన్ వారణాసి జిల్లా కోర్టు జడ్జి నిర్ణయానికి వ్యతిరేకంగా ఉంది. అంతకుముందు ఇదే అభ్యంతరాలను వారు కేసులో దాఖలుచేస్తే జిల్లా జడ్జి తిరస్కరించారు. రాఃసింగ్‌మరో తొమ్మిది మంది ఈ కేసును వారణాసి కోర్టులో దాఖలుచేసారు. గ్యానవాపి మసీదరులో ఉన్న శృంగార్‌గౌరి మాతను నిత్యం పూజించేందుకు అనుమతించాలన ఇకోరారు. దీనితో అక్కడినుంచే వివాదం మొదలయింది. అలహాబాద్‌కోర్టు ఈ వాదనలను విన్నతర్వాత 2022 డిసెంబరు 23వ తేదీ తన తీర్పును రిజర్వులో ఉంచింది. 2021 ఏప్రిల్‌నుంచి ఈ గ్యానవాపి మసీదు వివాదం చెలరేగుతోంది. వారణాసి కోర్టు పురావస్తుసర్వేశాఖను సమగ్ర సర్వేనిర్వహించాలని ఆదేశించింది.

### విఫలమైన నిఘా ఉపగ్రహ ప్రయోగం

**ప్యాంగ్యాంగ్, మే 31:** ఉత్తర కొరియా తొలిసారి చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం తీవ్ర భయాందోళనకు కారణమైంది. ఈ ప్రయోగం విఫలం కావడంతో ఆ రాకెట్, ఉపగ్రహ శకలాలు ఎక్కడొచ్చి మీద పడతాయోనని దక్షిణ కొరియా వణికిపోయింది. ఉత్తరకొరియా అధికారికంగా ఈ ప్రయోగం విఫలమైన విషయాన్ని బుధవారం వెల్లడించింది. ఉపగ్రహాన్ని తీసుకెళుతున్న రాకెట్ తొలి, రెండో దశల సమయంలో థ్రస్ట్‌ను కోల్పోయినట్లు పేర్కొంది. తమ శాస్త్రజ్ఞులు ఈ వైఫల్యానికి గత కారణాలను అధ్యయనం చేస్తున్నారని తెలిపింది. ఈ శకలాలు కొరియా ద్వీపకల్పంలోని ఉత్తరం వైపు సముద్ర జలాల్లో పడినట్లు వెల్లడించింది.

NCML FINANCE NCML FINANCE 6వ అంతస్తు, "SAS టవర్" యొక్క టవర్-B, సపోర్ట్ ఏరియా, మెడిసిటీ, సెక్టార్ 38, గురుగ్రామ్-122001

అనుబంధం IV [రూల్ 8(1)]
స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 క్రింద NCML ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయినందున దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క రూల్ 8 మరియు 9 తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద అఫర్ అయిన అధికారాలను వినియోగిస్తూ క్రింద పేర్కొన్న విధంగా రుణగ్రహీతలను నోటీస్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

రుణగ్రహీతలు, మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీస్‌లో ప్రకటించునది ఏమనగా దిగువ సంతకందారుడు సదరు నిబంధనలు యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద ఇందులో వివరింపబడిన ఆస్తి స్వాధీనం చేసుకొన్నారు.

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఆస్తితో ఎలాంటి లావాదేవీలైనా రుణ అగ్రిమెంట్ ప్రకారం అటుపై వడ్డీ మరియు పీనల్ వడ్డీ ఛార్జీలు అన్ని వ్యయాలు వగైరా డిమాండ్ నోటీస్ తేదీ నుండి NCML ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఛార్జీకి లోబడి ఉండును.

| క్ర. సం. | రుణ ఖాతా సం. | రుణగ్రహీతల పేర్లు | డిమాండ్ నోటీస్ తేది మరియు మొత్తం | స్వాధీనతా తేది |
|---|---|---|---|---|
| 1. | NFINMPBLAP000000500056 | శ్రీ మంచాల చిన్నా (దరఖాస్తుదారుడు) మరియు శ్రీమతి మంచాల మధుబాల & శ్రీ మంచాల ఏసురత్నం & శ్రీమతి మంచాల లక్ష్మి మరియు శ్రీమతి మంచాల సునీత (సహ-దరఖాస్తుదారులు) | 23/03/2022, రూ.20,77,404/- (రూపాయలు ఇరవై లక్షల డెబ్బై ఏడు వేల నాలుగు వందలు మరియు నాలుగు మాత్రమే | 31/05/2023 |

ఆస్తి యొక్క వివరణ: సబ్ క్లాజ్ (a)
గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ రీసర్వే ప్రకారం ఇం.నం.304/A3, 115.5 చ.గజాల విస్తీర్ణంలో అఫ్‌సైడ్‌లో దాని ఇం.నం.1-35-229, Asst No. 900/1020 యొక్క RCC దాబా ఇల్లు, సరిహద్దులు:
స్థిరాస్తి యొక్క సరిహద్దులు
తూర్పు: 6 అడుగుల వెడల్పు రోడ్ పడమర: చేపల ఖాసిమ్ కుమారుల చెందిన ఆస్తి
ఉత్తరం: వరకాల దానయ్యకు చెందిన ఆస్తి దక్షిణం: 15 అడుగుల వెడల్పు రోడ్
తేది: 31/05/2023
ప్రదేశం: గురుగ్రామ్
సం/- అధీకృత అధికారి
(శ్రీ అమిత్ అగర్వాల్)
NCML ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్



## హనుమంతునిపై గోవిందరాజులు

**తిరుపతి, మే 31 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడికి అనుబంధంగా ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో కన్నులపండుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం స్వామివారు హనుమంతవాహనంపై ఊరేగారు. ఉదయం 7 గంటల నుండి 9గంటల వరకు స్వామి విశేష అలంకారభూషితుడై వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. ఆలయమాడవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. వాహనసేవ అనంతరం శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం వసంతోత్సవం ఘనంగా జరిగింది. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, కంకణభట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ రవి కుమార్, సూపరింటెండెంట్ నారాయణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పొట్టిపాడు చెక్ పోస్టు సమీపంలో 160 కేజీల గంజాయి పట్టివేత

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు చెక్‌పోస్టు సమీపంలో ఒక కారులో రవాణా చేస్తున్న 160 కేజీల గంజాయి పట్టుబడింది. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వారి వద్ద నుంచి గంజాయి తరలించే కారుల్లోనే సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్టణం నుంచి ఎండిన స్థితిలో గంజాయి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం రావడంతో పోలీసులు నిఘా పెట్టారు. గంజాయి తరలిస్తున్న కారును పొట్టిపాడు చెక్ పోస్టు దగ్గర అడ్డగించి పట్టుకున్నారు. కారులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని రవాణా చేస్తున్న సాధిక్, మనోజ్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కారులో పట్టుపడిన గంజాయి విలువ రూ.10లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పట్టుబడిన వ్యక్తులు గంజాయి రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్న కొందరి సమాచారాన్ని విచారణలో పోలీసులకు తెలిపారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



## భారతదేశ ప్రాచీన క్రీడ చదరంగం

**కోవూరు(నెల్లూరు) మే 31 ప్రభాతవార్త** భారతదేశపు ప్రాచీన క్రీడ అయిన చదరంగం పట్ల పిల్లలు మక్కువ చూపాలని రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు డి నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కోవూరులోని చైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఓపెన్ చెస్ పోటీలు
బుధవారం సాయింత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారతదేశంలో బలహేతు అనే రాజు తన అస్థానంలోని తెలివైన వాడైన చిసాను మెదడుకు పదునుపెట్టి ఒక మంచి ఆట రూపొందించాలని ఆదేశించాడు. ఈనేపద్యంలో ఆయన 64 గడులతో ఈ చదరంగం ఆటను రూపొందించారని అన్నారు.
ఈ చదరంగం వలన పిల్లల మేదస్సుకు మరింత పదును పెడుతుందని అన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడా స్పూర్తిని కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అద్యక్షులు పి మస్తాన్‌బాబు, జిల్లా అద్యక్షరాలు ఎన్ మంజులా, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ప్రదీప్‌లు పలు సూచనలు చేశారు. రాష్ట్రస్థాయిలో ఓపెన్ చెస్ పోటీలలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 2 వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన అఫ్రిద్ టికాన్ ప్రధమబహుమతి సాధించి 20 వేలు నగదు బహుమతి, మెమోంటో ప్రశంసాపత్రం కైవశం చేసుకున్నాడు. రెండో వ బహుమతి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కె బావన్ పది వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెడల్ కైవశం చేసుకున్నాడు. మూడో వ బహుమతి తిరుపతి జిల్లాకు చెందిన ఎస్.నిహాల్ 5 వేలు నగదు బహుమతి, మోమెంటో మెడల్, ప్రశంసాపత్రం కైవశం చేసుకున్నాడు. కొత్త వంగల్లు గ్రామానికి వి.ప్రజమ్మ లక్ష్మీ ( ఎఇఎం) సైకిల్ డక్ బహుమతి కైవశం చేసుకుంది.

# నిర్మల్ హృదయ్ భవనంలో గడిపిన సిఎం జగన్ దంపతులు



నిర్మల హృదయ నూతన భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన సిఎం జగన్

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** చిన్నారులు కల్మషం ఎరుగని తెల్లని మంచువంటి హృదయులని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు. పిల్లల్లో దైవత్వం ఉంటుందని, అనాధులుగా ఉన్న బాలల పట్ల మానత్వం చూపడటమంటే దైవాన్ని నేరుగా ఆరాధించడమని అన్నారు. రాష్ట్రంలో వైకాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో సిఎం జగన్, తన సతీమణి భారతితో కలిసి విజయవాడ నగరంలోని నిర్మల్ హృదయ భవానికి చేరుకున్నారు. అక్కడి మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మిషనరీ ఆఫ్ చారిటీ నిర్మల్ హృదయ భవనంలో అనాధులైన చిన్నారులను, మానసిక ఎదుగుదల లేని పిల్లలను, దివ్యాంగులకు ఆశ్రయం కల్పిస్తుంది. వృద్ధులకు, రోగులకు ఆశ్రమంలో స్థానం కల్పించి సేవలను అందిస్తోంది. నిర్మల్ హృదయ్ భవనానికి విచ్చేసిన సిఎం జగన్ అక్కడి పిల్లలతో సిఎం జగన్ ఎంతో ఉల్లాసంగా గడిపారు. వారితో ముచ్చట్లు చెబుతూ ఆయన ఉత్తేజపరిచారు. పలువురు పిల్లలతో కలిసి ఆటలాడారు. వారికి పలు బహుమతులు, పువ్వులు అందజేసారు. శిశు ప్రాయంలోనే హృదయభవనం ఎదుట అజ్ఞాతులు వదిలివెళ్లిన పసిబిడ్డలున్న వార్డులకు సిఎం జగన్ వెళ్లారు. ఆ శిశువులను ఆయన ముద్దాడారు. ఆ తరువాత సిఎం జగన్ ఆశ్రమంలోని అనాధ బాలలతో కలిసి నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా సిఎం జగన్ అక్కడి పరిచారకులు, మదర్స్, సిస్టర్స్‌తో మాట్లాడారు. ఆశ్రమానికి ప్రభుత్వపరంగా పూర్తి స్ధాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. అనాధ బాలలకు, కళ్లు తెరిచి తెరవని శిశువులకు అండగా నిలవడం ఎంతో గొప్పతనం అన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలోని అనేక మంది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలబడుతుందన్నారు. పసి పిల్లలఆరోగ్యం, వారికి మంచి పౌష్టికాహారం అందించడంతో పాటుగా నాణ్యమైన విద్యను అందిస్తోంది. సంపూర్ణపోషణ్, గోరుముద్ద కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. శిశుమరణాల నియంత్రణకు చర్యలు తీసుకుందన్నారు. ఎక్కడా పేదపిల్లలు ఇబ్బంది పడుతున్నారనే అపవాదురాకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆయన నిర్మలహృదయభవన్‌లో సేవలందిస్తున్న వారందరికి ధన్యవాదాలు తెలిపారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం భూమి పూజ

## లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం

### భూమిపూజ చేసిన చైర్మన్

**శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పురాతన కాలం నాటి దేవాలయాలకు మహర్థశ కల్పించుటకు యువ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవ తీసుకున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం పురాతనమైనది. ఈ ఆలయాన్ని ఓ దాత సహాకారంతో ఆతని సొంతనిధులతో పునర్నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాలను చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బుధవారం భూమి పూజ కార్యక్రమాల్ని నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా గత మార్చి 1న బాధ్యతలు చేపట్టిన తరువాత పురాతన కాలం నాటి ఆలయాల జీర్ణోద్ధారణకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపధ్యంలో 6 దేవాలయాల మరమ్మత్తులు చేపట్టారు. కుంభాభిషేకం జరిపించారు. అలాగే రూ.6కోట్లతో ప్రసన్నవరదరాజ స్వామి ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికపై సాగుతున్నాయి. పుణ్యక్షేత్రంలోని పురాతన ఆలయాలకు కొత్త శోభ చేకూర్చుకోవటానికి చర్యలు తీసుకుంటున్నారు.

**రిటైర్డ్ ఎస్ఐ చొరవ:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు రిటైర్డ్ ఎస్‌బిఐ అధికారి శ్రీనివాసమూర్తి ముందుకు వచ్చారు. శ్రీనివాసమూర్తి గతంలో నిత్యాన్నదన పథకానికి రూ.5లక్షలు విరాళం ఇచ్చారు. దాతలను ఆకర్షించటంలో చైర్మెన్ చొరవ చూపుతున్నారు. దేశ విదేశాల నుంచి అంజూరు తారక శ్రీనివాసులు హయాంలో వచ్చినన్ని విరాళాలు మరెప్పుడూ రాలేదంటే అతిశయోక్తి కాదేమో? బుధవారం శాస్త్రోక్తంగా ఆలయ పునర్నిర్మాణం భూమి పూజలు జరిపించారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చిన శ్రీనివాసమూర్తికి జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరునితీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ పౌరోహితులు, వేదపండితులు అర్థగిరి శర్మ, ఎఇఇ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ బాలాజి, సుదర్శనరెడ్డి, అర్కాటుముత్తు, కార్తిక్, హేమంత్, పట్టణ ప్రముఖులు ధన, కళ్యాణ్, తేజ స్థానికులు పాల్గొన్నారు.

# టిడిపి మేనిఫెస్టో పిచ్చికి పరాకాష్ట

## జగన్ చేయగలిగినవే చెప్తారు...చేసి చూపుతారు: మంత్రి రోజా



**తిరుపతి,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వరాల మేనిఫెస్టో ఆ పార్టీ నాయకుడు చంద్రబాబు పిచ్చికి పరాకాష్టగా తయారైందని రాష్ట్రమంత్రి ఆర్‌కె రోజా అభివర్ణించారు. 600 హామీలు ఇచ్చి, ఆరు హామీలు కూడా నెరవేర్చని వ్యక్తి చంద్రబాబుఅని, ముఖ్యమంత్రి సంతకాలకు విలువ లేకుండా చేశారంటూ ఘాటు వ్యాఖ్యలుచేశారు. ఆస్తికోసం కుటుంబీకులను వేధించిన వ్యక్తి బోండా ఉమాఅని విమర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్సీ పాలనచూసి చంద్రబాబుకు నరాలు చిట్లిపోయాయంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏంచేశారని ఆమె ప్రశ్నించారు. బుధవారం ఉదయం తిరు పతిలో మీడియాప్రతినిధులతో ఆమె మాట్లాడారు. చంద్రబాబు లాంటి మోసగాడు దేశంలోనే ఎక్కడా లేడని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమపథకాలు అందుతున్నాయని, జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98.5 శాతం నెరవేర్చారని ఉద్ఘాటించారు. జగనన్న ప్రభుత్వం తీసుకువచ్చిన అమ్మఒడిపై ఇష్టానుసారం మాట్లాడి....ఇప్పుడు అమ్మకు వందనం అంటున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా దీన్ని ఎందుకు అమలుచేయలేదని విమర్శించారు.
రాష్ట్రంలో యువతను ఆదుకుంటామని చంద్రబాబు చెప్పడం పెద్దజోక్‌అన్నారు. బాబు వస్తే జాబు అంటూ గతంలో మోసం చేశారని, చంద్రబాబు మోసాన్ని యువత మరచిపోలేదన్నారు. రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు సిఎం జగన్ అండగా నిలిచారని తెలిపారు. చంద్రబాబు అబద్ధపు హామీలతో మోసం చేయడం ఆయన నైజమన్నారు. టిడిపిని నమ్మేవారు ఎవరూ లేరన్నారు. అవినాష్‌రెడ్డిపై సిబిఐ చేసిన ఆరోపణలకు న్యాయమూర్తి సాక్ష్యాలు లేవని తెలిపారని ,తప్పుడు సమాచారంలో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం మంచిదికాదన్నారు.

## రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఈ పరీక్షల కోసం 2,12,221 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 915 పరీక్షా కేంద్రాలను అధికారులు సిద్ధం చేసారు. పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తామని ఎస ఎస్‌సీ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి మంగళవారం తెలిపారు. విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతినిస్తామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 915 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 915 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 11 వేల మంది ఇన్విజిలేటర్లు, 86 ఆకస్మిక తనిఖీ బృందాలు(ఫ్లైయింగ్ స్క్వాడ్)ను నియమించినట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండ్లుతో సహా ఎవరూ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్స్, కెమెరాలు, ఇయర్‌ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదని స్పష్టం చేసారు, పరీక్షలు రాసే సందర్భంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్ళినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరీక్షల స్పాట్ వ్యాల్యూషన్ జూన్ 13,14 తేదీల్లో రాష్ట్రంలోని 23 కేంద్రాల్లో జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణపై సందేహాల నివృత్తి కోసం విజయవాడలో 0866-2974540 నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని చెప్పారు. ఇది జూన్ 10వ తేది వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

# మంచుకొండల్లో ఏడుకొండలవాడి ఆలయం



### జూన్ 8న ఆలయ మహా సంప్రోక్షణ

**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం జమ్మూకాశ్మీర్ ప్రాంత ప్రజలకు చేరువచేసేలా తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రంగా ఆలయాన్ని నిర్మించింది. ఈ ఆలయ నిర్మాణ పనులు పూర్తికావడంతో జూన్ 8వతేదీ జమ్మూలోని మజీన్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనుంది. అదేరోజు నుంచి భక్తులకు దేవదేవుని దర్శనభాగ్యం కల్పిస్తారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఖానస ఆగమోక్తంగా జరిపించే తరహాలోనే నిత్యకైంకర్యాలు, సేవలు, పూజలు జరిపిస్తారు. భారతదేశవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్తరాదిలోని జమ్మూలో కూడా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించింది. ఎంతో సర్వాంగసుందరంగా ఆలయనిర్మాణం పూర్తిచేశారు. జమ్మూలోని మాతా వైష్ణోదేవి దర్శనం కోసం జమ్మూ వచ్చే భక్తులకు వేంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం మరో అనుభూతిని ఇవ్వనుంది. జూన్8వతేదీ జరిగే మహాసంప్రోక్షణ కార్యక్రమానికి ముందు 3వతేదీ నుండి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 3వతేదీ శనివారం సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8గంటల వరకు ఆచార్యవరణం, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ చేపడతారు. జూన్ 4వతేదీ ఆదివారం ఉదయం 8గంటల నుండి 11వరకు పంచగవ్యప్రాసన, వాస్తుహోమం, అకల్మషప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం, సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8.30గంటల వరకు అగ్నిప్రతిష్ట, కుంభస్థాపన, కుంభారాధన, విశేషహోమం జరిపిస్తారు.
జూన్5న ఉదయం యాగశాలలో వైదికకార్యక్రమాలు, అక్షిన్మోచనం, నవకలశ స్నపనం, పంచగవ్యాధివాసం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు చేపడతారు. జూన్ 6వతేదీ ఉదయం యాగశాల కార్యక్రమాలు, నవకలశ స్నపనం, క్షీరాధివాసం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. జూన్ 7న ఉదయం యాగశాల కార్యక్రమాలు, జలాధివాసం, రత్న న్యాసం, ధాతున్యాసం, విమానకలశస్థాపన, బింబస్థాపన (విగ్రహప్రతిష్ట) సాయంత్రం మహాశాంతి తిరుమంజనం, రాత్రి శయనాధివాసం నిర్వహిస్తారు. చివరగా జూన్ 8వతేదీ గురువారం ఉదయం 7.30గంటల నుండి 8.15గంటల వరకు మిధున లగ్నంలో మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. ఉదయం 9.30గంటల నుండి భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంమవుతుంది .అదేరోజు సాయంత్రం 5గంటలకు దేవదేవుని కల్యాణోత్సవం వేడుకగా నిర్వహిస్తారు.

## బృందావనానికి ప్రత్యేక రైళ్లు జూన్ ఆఖరుదాకా పొడిగింపు

### కొత్త నెంబర్లతో సర్వీసులు

**గుంతకల్లు రైల్వే, మే 31 ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా, భక్తుల కోర్కె తీర్చే కామధేనువుగా విశేషంగా కీర్తించబడుతూ, విలసిల్లే ప్రతిసిద్ధపుణ్య క్షేత్రం అయిన మంత్రాలయంలో వెలిసిన శ్రీ గురు రాఘవేంద్ర స్వాముల వారిని దర్శించుకోవాలనుకునే భక్తులు, ప్రయాణికుల సైకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్, గుంతకల్లు- మంత్రాలయం- గుంతకల్లుల మధ్య వేసవి ప్రత్యేక ఫాస్ట్ పాసింజర్ రైలు సర్వీసుల గడువును జూన్ ఆఖరి వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. గుంతకల్లు నుంచి మంత్రాలయం రోడ్ వెళ్లే నెంబర్ 07411 ప్రత్యేక పాసింజర్ రైలు జూన్ 1 నుంచి 30 వరకు ప్రతి రోజు సాయంత్రం 5:40 గంటలకు బయల్దేరి గుంతకల్లులో బయల్దేరి మంత్రాలయం రోడ్‌కు రాత్రి 7:30 గంటలకు చేరుకుంటుంది. అలాగే మంత్రాలయం రోడ్ నుంచి గుంతకల్లుకు వెళ్లే నెంబర్ 07412 ప్రత్యేక పాసింజర్ రైలు జూన్ 2 నుంచి జులై 1 వరకు పొడిగించారు. ప్రతిరోజు తెల్లవారు జామున 4:40 గంటలకు మంత్రాలయం రోడ్ నుంచి బయల్దేరి 6:20 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గ మద్యంలో మొలగపల్లి, ఆధోని, కుప్పగల్లు, కోసిగి రైల్వే స్టేషన్లలో నిలుస్తాయి.

# 12 యేళ్ల క్రిందటి వాహనాలు అనుమతించం: టిటిడి



### అలిపిరి వద్ద ట్యాక్సీడ్రైవర్లు,యజమానులు నిరసన

**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచపుణ్యక్షేత్రం తిరుమలకు దేశంలోని అనేక రాష్ట్రాలనుంచి వస్తున్న యాత్రికులను చేరవేస్తున్న వాహనాలు, ట్యాక్సీలు 12ఏళ్ల క్రిందటి వయితే అనుమతించబోమని టిటిడి అధికారులు ప్రకటనతో తిరుపతి, తిరుమలలోని వాహనాల డ్రైవర్లు, ట్యాక్సీడ్రైవర్లు, యజమానులు నిరసన తెలిపారు. దాదాపు నాలుగైదు దశాబ్ధాలుగా తిరుమలకు వచ్చే యాత్రికులను నమ్ముకుని 3వేల వరకు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తిరుమల ఘాట్‌లో వాహనాలు ఇటీవల ప్రమాదాలకు గురవడం జరుగు తుంది. ప్రమాదాలకు కారణం వాహనాల కండిషన్ లేకపోవడం, డ్రైవర్లకు అనుభవం లేకపోవడమేనని తిరుమల పోలీసులు, రవాణా, టిటిడి విజిలెన్స్ పేర్కొంది. దీంతో తిరుమలలో పర్యావరణ పరిరక్షణతోబాటు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో 12ఏళ్ల క్రిందటి వాహనాలను కొండపైకి అనుమతించరాదని ఇటీవల నిర్ణయించారు. ఈ విషయంగా హుకుం జారీ అయింది. ఈ సమాచారంతో తిరుపతి, తిరుమలలోని సుమారు 3వేల ట్యాక్సీ వాహనాల కుటుంబాలు అయోమయంలో పడ్డారు. టిటిడి తీసుకున్న తాజా నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సుమారు వందమంది ట్యాక్సీడ్రైవర్లు, యజమానులు అలిపిరివద్ద గరుడవిగ్రహంముందు తమ నిరసన తెలిపారు. ఘాట్‌లో ప్రమాదాలకు కారణమవుతున్నవారెవరు? స్థానికంగా ఉంటూ వాహనాలు నడుపుకునేవారిపై ఎందుకు వివక్ష అంటూ వాపోయారు. తిరుపతిలోని వాహనాల డ్రైవర్లు ఏడాదికి ఒకసారి వాహనసామర్థ్యం సర్టిఫికెట్ పేరుతో వాహనాలను మరమ్మతులు చేసుకుని గ్రీన్ ట్యాక్స్, కోటర్‌ట్యాక్స్, పిట్నర్‌ట్యాక్స్‌లను ప్రభుత్వానికి చెల్లిస్తూ ఆర్‌టిఏ అధికారుల అంగీకారంతో అనుమతి ఉన్నా ఈ నిర్ణయం తీసుకోవడంపై నిరసన తెలిపారు. తమకు తగిన న్యాయం చేయాలని గోవింద నామంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలకు సిద్దమవుతామని తెలిపారు.

# టిడిపి మేనిఫెస్టో టిష్యూపేపర్

## డిసెంబర్‌కి రామాయపట్నం పోర్ట్ మొదటిదశ: మంత్రి జోగిరమేష్



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం అధినేత చంద్రబాబు థర్డ్,డర్టీ ఫెలోఅని.... ఆ పార్టీ మ్యానిఫెస్టో టిష్యూపేపర్‌తో సమానమని రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి జోగిరమేష్ ఎద్దేవా చేశారు. 2019లో వైఎస్సార్సీకి ఓట్లు వేయనివారు కూడా రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రామాయపట్నం పోర్టు మొదటిదశ పనులు డిసెంబర్‌నాటికి పూర్తిచేస్తామని అన్నారు. మేనిఫెస్టో అంటే చంద్రబాబుకు అర్థం తెలియదని, పొత్తులు లేకుండా పార్టీని నడపలేనని పవన్‌కల్యాణ్ చెప్పాడని, అదే ఫ్లెక్సీలో చెప్పామన్నారు. దానికి జనసేన నాయకులు ఉలికి పడుతున్నారని వ్యాఖ్యానించారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత రాష్ట్రానికి ఇన్ఫోసిస్ సంస్థ వచ్చిందని, ఇలాంటి పెద్దసంస్థ ఏదేని లోకేష్ తీసుకువచ్చాడా ?అని జోగి సవాల్ విసిరారు. లోకేష్ హయాంలో ఒక పెద్దకంపెనీ అయినా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిందా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇప్పటికే గ్రామాలలో బెల్టుషాపులు లేకుండా చేశామన్నారు.
సిపిఎస్ రద్దుపై అధ్యయనం జరుగుతోందని, ఉద్యోగుల మా పక్షాన ఉన్నారన్నారు. కాపులు మా ఆస్థిఅని, వారికి పెద్దపీట వేసింది వైఎస్ఆర్‌అని, కొడాలి నాని వ్యాఖ్యలను టిడిపి వాళ్ళు తప్పు దారిపట్టించారని అన్నారు. బుధవారం ఉదయం మంత్రి జోగిరమేష్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు సిద్ధం

## 2న గుంటూరులో రైతులకు పంపిణీ చేయనున్న సిఎం జగన్



సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేయనున్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

**గుంటూరు మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ఈనెల 2న తేదీన డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ట్రాక్టర్లు, హార్వెస్టర్ల పంపిణీకి సంబంధించి గుంటూరు మిర్చియార్డులో ఉంచిన ట్రాక్టర్లు, హార్వెస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు.. ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంబంధించి జిల్లా వారీగా ట్రాక్టర్లను వరుస క్రమంలో ఉంచాలన్నారు. లబ్దిదారులకు, వాహన డ్రైవర్లకు బస ఏర్పాట్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం,మంచినీరు., రాత్రి భోజనం సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు.

ఈకార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి, జడ్పీ సిఇఓ జె,మోహనరావు, డిఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, డిపిఒ కేశవరెడ్డి, డిసిఓ వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ రైల్వేలైన్‌కు రాష్ట్ర వాటా కోరుతూ వినతులు



**విజయవాడ, మే 31, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోనసీమ జెఏసీ కార్యవర్గం తాడేపల్లిలో కార్యలయంలో కలసి కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇప్పించవలసినదిగా బుధవారం కోనసీమ జెఏసి సంఘం కోరటం జరిగింది. సానుకూలంగా స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ వినతి పత్రాల సమర్పణ కార్యక్రమంలో కోనసీమ జెఏసి చైర్మన్ విఎస్ దివాకర్, కన్వీనర్ బండారు రామోహన్‌రావు, కో కన్వీనరు మంత్రిప్రగడ వేణుగోపాల్, డాక్టర్ మంగళంపల్లి అరుణ్‌కుమార్, డాక్టర్ మధుర నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలను దత్తత తీసుకుంటా : నారా లోకేష్

**జమ్మలమడుగు, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేతలను దత్తత తీసుకుంటానని నారా లోకేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుంకులాంబ దేవాలయం వద్ద చేనేతలతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తల్లీ, చెల్లిని రోడ్డు మీదకు గెంటేశాడు జగన్.. తల్లి లాంటి కడప జిల్లాకు కూడా అన్యాయం చేశాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలను దత్తత తీసుకుంటానని వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చేనేత క్లస్టర్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక బ్రాండింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రూ.110 కోట్ల రుణ మాఫీ చేసింది టీడీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో దేవగుడి నారాయణరెడ్డి,



ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, చేనేత నాయకులు తిరుమల కొండయ్య తదితరులు పాల్గొన్నారు. గిరిజనులను ఆదుకోవాలని లోకేష్‌కు వినతి చిటిమిటిచింతలలోని గిరిజన తాండా ప్రజలు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేసి తమను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు లోకేష్‌తో మాట్లాడుతూ జీవో నెం 52 రద్దు చేయాలన్నారు. 2007లో బ్రహ్మణి స్టీల్ ఫ్యాక్టరీకి మా ప్రాంత వ్యవసాయ భూములను ఇచ్చామని వారు భూమి పాసుపుస్తకాలను తీసుకొని నామమాత్రపు పరిహారం చెల్లించారన్నారు. 15 సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు ఫ్యాక్టరీ నిర్మించలేదన్నారు. ఎస్టీ కార్పొరేషన్ నిధుల నుంచి వాహనాల లోన్లు మంజూరు చేయాలని కోరారు. 700 మంది ప్రజలు ఉన్న మా తాండాని పంచాయతీగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బి.హనుమంతు నాయక్, కృష్ణా, నరసింహా, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్‌లో కొత్త పోకడలు

≫శ్రీ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జెఎన్టియుకె 9వ స్నాతకోత్సవం బుధవారం ఉదయం యూనివర్సిటీ ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాంతా బయోటెక్స్ లిమిటెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె ఐ వరప్రసాద్ రెడ్డి విచ్చేశారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విశిష్ట అతిథులుగా హాజరు కాగా ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాదరాజు స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. గ్రీన్కో గ్రూప్ సిఈఓ, ఎండి అనిల్ చలమలశెట్టికి డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రసాదరాజు మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విజయాలు, నూతన ఆవిష్కరణలు, నూతన నిర్మాణాలు, కొత్త కోర్సులు, కొత్త పిజి ప్రోగ్రామ్స్, పరిశోధన అంశాలు, అవార్డులు, పబ్లికేషన్స్, పతకాలు, నూతన భవన నిర్మాణాలు, బిఓఎస్ సమావేశాలు, ఎంఓయులు, క్రీడాంశాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్స్‌లు గురించి వివరించారు. ఎంతోమంది మేధావులు, పద్మశ్రీ, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీతలను ప్రపంచానికి అందించిన ఘనత కెఎఎస్ఆయుకెకు దక్కిందన్నారు.జాతీయ విద్యా విధానం- 2020కు అనుగుణంగా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, సాంప్రదాయ ఇంజనీరింగ్ విద్యను విస్మరించకుండా గ్లోబల్ ఇంజనీర్స్‌లు నోబుల్ ఇంజనీర్స్‌గా తీర్చిదిద్దేందుకు వృత్తిపరమైన, మేధో సంపత్తి హక్కులు వంటి అంశాలను పాఠ్యాంశాలలో చేర్చడం జరుగుతుందన్నారు. ప్రయోగ పద్ధతి విద్యకు ప్రాధాన్యత కల్పించటానికి ఇంటరెషిన్స్, ఇండస్ట్రీయల్ టూరు తప్పనిసరిగా చేశామన్నారు. జెఎన్టి ట్యుకె యూనివర్సిటీ ముఖ్యంగా సైన్స్‌టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు మ్యాథమెటిక్స్ విభాగాల్లో విద్యను ప్రొత్సహించడానికి వినూత్నమైన కోర్సులను అందించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. జెఎన్టీయుకె స్నాతకోత్సవంలో గ్రీన్కో గ్రూప్ సిఈఓ చలమలశెట్టి అనీల్‌కు డాక్టరేట్ గవర్నర్ చేతులమీదుగా ప్రధానం చేశారు.

**అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా మనదేశం**

ప్రపంచంలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా మనదేశం సాంకేతిక అభివృద్ధిలో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జీవితం చాలా మంది విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని,భారత రాష్ట్రపతిగా ఆయన అనేక మంది హృదయాలను హత్తుకున్నారని పీపుల్స్ ప్రెసిడెంట్‌గా ప్రసిద్ధ చెందారన్నారు. ఆయన పేదరికం నుండి వచ్చినందున ఒకరి భవిష్యత్తును మార్చడంలో విద్య యొక్క శక్తి ఆయనకు తెలుసునని, పేదరికాన్ని నిర్మూలించడానికి విద్య కీలకమని ఆయన నమ్మారన్నారు. ప్రపంచంలో సాంకేతిక పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో భారతదేశం మూడవ స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలోసాంకేతిక పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో భారతదేశం మూడవ స్థానంలో ఉందన్నారు. గత పది సంవత్సరాలలో పరిశోధనాభివృద్ధిపై స్థూల వ్యయం మూడు రెట్లు పెరిగిందని రెసిడెంట్ పైలింగ్ 9వ స్థానంలో ఉందన్నారు. జెఎన్టీయుకె యూనివర్సిటీ న్యాక్ సెకన్డ్ గ్రేడ్ సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ దీనికి కృషి చేసిన ప్రతీ ఒక్కరిని ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. దేశానికి ఎడ్యుకేషన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి ఇంజనీరింగ్ విభాగం ఎంతో కీలకమైనదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నవరత్నాల్లో భాగంగా జగనన్న విద్యాదీవెన ,జగనన్న వసతి దీవెన, అమ్మఒడి పథకాలు విజయవంతంగా విద్యార్థులకు అందిస్తు విద్యకు పెద్దపీట వేశారని వైఎస్సార్ స్కాలర్స్ ఇనెంటివ్ స్కీమ్, కార్పొరేషన్ల ద్వారా విదేశీ విద్య స్పాన్సర్‌షిప్, గ్లోబ్ సమ్మిట్, స్టార్టప్లు వంటివన్నీ సామాన్యుడు ఆర్థిక భారం లేకుండా చదువుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. తొమ్మిదవ స్నాతకోత్సవంలోభాగంగా 144 పిహెచ్ అవార్డులు, 66 బంగారు పతకాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, మంత్రి దాడిశెట్టి రాజా,
సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, కాకినాడ ఎంపి వంగా గీతా విశ్వనాథ్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు,రాజకీయ పార్టీల నాయకులు చలమలశెట్టి సునీల్, దవులూరి దొరబాబు, రెక్టార్ ప్రొ కెవి రమణ, రిజిస్ట్రార్ ప్రొ ఎల్ సుమలత, ఓఎస్‌డి ప్రొ డి.కోటేశ్వరరావు,డైరెక్టర్లు , స్పెషల్ ఆఫీసర్లు , మాజీ ఉపకులపతులు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి జెఎన్టీయుకె కళాశాలల ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు,విద్యావేత్తలు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, వివిధ కళాశాలల అధ్యాపకులు, పిహెచ్ అవార్డు గ్రహీతలు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

## వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై రైతులకు వివరించాలి: మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నాగవరం రైతువేదికలో అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,మే31,ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీన జరిగే రైతు దినోత్సవం వేడుకలు జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం నాగవరం తాండ రైతు వేదిక దగ్గర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో కలిసి పర్యవేక్షించారు. రైతువేదికలో రైతు దినోత్సవ సంబరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిని విశ్లేషించి పంట కాలాన్ని ఒక రోజు ముందుకు జరపడంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం రైతు దినోత్సవం రోజు ఉంటుందన్నారు. ఒకప్పుడు తెలంగాణ రైతులు బీడుపారి మన ప్రాంతం గుండానే కృష్ణా గోదావరి పారుతూ తెలంగాణ ప్రాంతానికి సాగు, తాగునీరు దొరికేది కాద న్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించాక ప్రశ్నించే గొంతుకలకు తాళం వేస్తు కల్వకుర్తి లిఫ్ట్ , కాళేశ్వరం, తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషనన వంటి ఎన్నో పనులు పూర్తి చేసుకుని తెలంగాణ రైతాం గానికి సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇస్తున్నామన్నారు. త్వరలో పాలమూరు రంగారెడ్డి పూర్తి చేసి సస్యశ్యామలం కాబోతుందని ఇలాంటి విజయాలను గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో సాధించి పదో సంవత్సరంలో అడుగి డుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను రైతు దినోత్సవ వేడుకల నుండే ప్రారంభి స్తున్నట్లు తెలిపారు. 5వేల మంది రైతులకు సరిపడ అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లలో, నడుచుకుంటూ డప్పు , నృత్యాలతో ర్యాలీగా రాను న్నట్లు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచందు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కో ఆపరేటివ్ అధికారిని కాలి క్రాంతి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## నేడు ముగియనున్న పిజిఇసెట్-2023 పరీక్షలు రెండో రోజు 85 శాతం హాజరు నమోదు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో పీజీ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే పీజీఈసెట్-2023 పరీ క్షలు ప్రశంతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు జరిగిన పరీక్షకు 85 శాతం మంది హాజరయ్యారు. సోమవారం పరీ క్షలు ప్రారంభం కాగా మంగళ, బుధవారాలు కొనసాగాయి. నేటి(గురువారం)తో ముగియ నున్నాయి. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మా డి(పీబీ) వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీఈసెట్-2023 పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం సెషన్ 10 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి 4 గంటల వరకు కొనసాగాయి. నేడు పరీక్షలతో పీజీ ఈసెట్- 2023 పరీక్షలు ముగియనున్నాయి.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాలక ప్రతిపక్షాల వాగ్వాదం

## - 45 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో చెప్పగలరా!?



జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల వాగ్వాదం

**జగ్గయ్యపేట, మే 31 ప్రభాతవార్త:** మున్సిపల్ యంత్రాంగం పనితీరులపై పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పారిశుధ్యం, విద్యుత్, ఇంజనీరింగ్, పట్టన ప్రణాళికశాఖ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం కౌన్సిలర్లు కూడా ప్రభుత్వ యంత్రాంగం పనితీరులపై విమర్శనాత్మక బాణాలు సంధించారు. పాలకపక్షం మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహావేశాలు వ్యక్తంచేయటం, అవకతవకలు జరుగుతున్నాయని, కౌన్సిలర్లపట్ల అలక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ ఆరోపణలు చేయటం గమనార్హం. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. అధికార వైఎస్ఆర్‌సిపి, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు ఇంజనీరింగ్, శానిటేషన్, పట్టణ ప్రణాళికా విభాగాల నిర్వాహకులైన అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు సభలో ఇంజనీరింగ్ శాఖ, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళికశాఖ అధికారుల పనితీరులపై పలు ఆరోపణలుచేశారు. ఇంజనీరింగ్ శాఖలో ఏర్పాటుచేసుకున్న 45 మంది కార్మికులు ఎవరి దగ్గర, ఏమి పనులు చేస్తున్నారు, మున్సిపాల్టీకి వారి వలన ఏమాత్రమైనా ప్రయోజనం ఉన్నదా అంటూ కౌన్సిలర్ వట్టెమ మనోహర్ నెల రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన తీరుగానే తిరిగి ప్రస్తుత సమావేశం కూడా అదే ప్రశ్నను ఇంజనీరింగ్ అధికారులకు సంధించారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలు ఇస్తారా, వారి అటెండెన్స్ రిజిష్టర్ మెయింటైన్ చేస్తున్నారా, ఎలాంటి మున్సిపల్ విధులకు హాజరుకాకుండానే వారు వేతనాలు పొందుతున్నారంటూ మండిపడ్డారు. కౌన్సిలర్, వైఎస్ఆర్‌సిపి యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా ప్రభుత్వవిప్ ఉదయభాను హయాంలో నియోజకవర్గంలో, పట్టణంలో కోట్లాది రూపాయల నిధులతో పనులు జరుగుతున్నాయని, మాజీ ఎంఎల్ఏ శ్రీరాం తాతయ్య తన హయాంలో చేసిందేమీ లేకపోగా చిల్లకల్లు రోడ్డు విస్తరణలో అధికారులను బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. అంతకు ముందు కో-ఆప్షన్ సభ్యులు ఎం చైతన్యశర్మ కూడా అభివృద్ధి కార్యక్రమాలు ఉదయభాను నేతృత్వంలోనే జరుగుతున్నాయంటూ చేసిన వ్యాఖ్యలకు టిడిపి కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, వెంకట్ ప్రతిఘటించారు. సభలో ఇరుపక్షాలు పెద్దస్వరంతో వాదులాడటంతో గంద్రగోళ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. కళ్ళుండి చూడలేని కబోదులు అంటూ వైస్‌చైర్మన్ ప్రభాకర్ మండిపడ్డారు. సభను శాంతపర్చేందుకు చైర్మన్ రాఘవేంద్ర శ్రమించాల్సి వచ్చింది. మున్సిపల్ పంపుల నుండి కలుషిత నీరు వస్తోందని కౌన్సిలర్ రామలక్ష్మి ప్రశ్నించగా వాటర్ వర్క్స్ యూనిట్ వద్ద మూడు చోట్ల పైపులకు మేజర్ లీకులు ఏర్పడ్డాయని, వాటిని మరమత్తు చేస్తున్నారని చెప్పారు.

పట్టణంలో అనధికార లేఅవుట్లు పెరిగిపోతున్నాయని, తద్వారా మున్సిపాల్టీకి దాదాపు కోటి రూపాయలకు పైగా ఆదాయం కోల్పోతుందని, పట్టణ ప్రణాళికశాఖ యంత్రాంగం ఏమి చేస్తుందంటూ కౌన్సిలర్ మనోహర్ విచారం వ్యక్తంచేశారు. శాంతినగర్ ఏరియాలో దాదాపు 150 అడుగుల ఎత్తున జాతీయ జెండా స్తూపం ఏర్పాటు చేసేప్రయత్నం అభినందనీయమని చైర్మన్ రాఘవేంద్రను అధికారపార్టీ కౌన్సిలర్లు ప్రశంశించారు. పలువులు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకున్న సమస్యలపై ప్రశ్నించారు.

సమావేశంలో కమిషనర్ సిహెచ్ మల్లేశ్వరరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

కాగా పట్టణంలోని జగ్గయ్యపేట చేపలు, మాంసం విక్రయశాల వద్ద నెలకున్న డ్రైనేజీని పరిశీలించిన చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దాదాపు రూ.5 లక్షల నిధులతో కాల్వపునర్నిర్మాణం చేస్తామన్నారు.

# సేవ,సుపరిపాలన,పేదల సంక్షేమంగా మోడీ పాలన

- 9 యేళ్లలో టిడిపి, వైఎస్సార్సీలు రాష్టానికి ఏం చేశాయి?
- అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఇరు పార్టీలు రావాలి
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి

**తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 31 ప్రభాతవార్త:** దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ తన పాలన ప్రారంభించి తొమ్మిదేళ్లు పూర్తయింది.ఈ 9 ఏళ్లలో దేశంలో సేవ,సుపరిపాలన,పేదల సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని మోడీ పాలన సాగిస్తున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి కొనియాడారు.బుధవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన దేశంలో జరిగిన 9 ఏళ్ల అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 వరకు దేశాన్ని పాలించిన యుపిఏ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి అభివృద్ధిని మరచిందన్నారు.అదే మోడీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.9 ఏళ్ల మోడీ సుపరిపాలనపై దేశ వ్యాప్తంగా 30 రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తామన్నారు.గతంలో ఐదేళ్లు పాలన సాగించిన టిడిపి కానీ,ప్రస్తుతం నాలుగేళ్లుగా పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వం కానీ రాష్ట్రంలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు.తామే దేశ వ్యాప్తంగా లక్షల కి.మీ రోడ్లు వేశామని,ఏపిలో జగన్ ప్రభుత్వం ఎన్ని రోడ్లు వేసిందో చెప్పాలన్నారు.మోడీ జాతీయ విద్యా విదానం తీసుకొస్తే ఈ రాష్ట్రంలో జగన్ అమలు చేయలేదని మండిపడ్డారు.రాష్ట్రంలో అప్పులు ఫుల్ అభివృద్ధి నిల్ అంటూ ఎద్దేవా చేశారు.రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఏపిలో ఉండేది తక్కువ,ఢిల్లీలో ఉండేది ఎక్కువ.ఎందుకంటే ఆయన ఆర్థిక శాఖా మంత్రిగా కాకుండా అప్పుల శాఖా మంత్రిగా మారిపోయాడు కాబట్టని గేలి చేశారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్ర పథకాలేనని,ఈయన పేరు మార్చి తాను ఇచ్చినట్లు ప్రజలను మభ్య పెడుతున్నారని జగన్‌పై మండిపడ్డారు.ప్రస్తుతం తిరుపతిలో నిర్మిస్తున్న ఫైఓవర్(శ్రీనివాస సేతు) సైతం కేంద్రం,టిటిడి ఇచ్చిన నిధులతో నిర్మాణమవుతుంది తప్ప వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని దుయ్యబట్టారు.ఏపిలో అన్ని వ్యవస్థలపై దాడులు చేయడం ఈ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందన్నారు.ఆఖరికి మీడియాపై కూడా దాడికి దిగడం సిగ్గుచేటన్నారు.తాము అధికారంలోకి వస్తే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్ధానాలన్నీ నెరవేరుస్తామని బీరాలు పలికిన జగన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చి నాలుగేనాలుగేళ్లు పూర్తయినా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే జర్నలిస్టులకు హౌస్ సైట్ ఇస్తామని చెప్పి చివరికి వారిని సైతం సైతం మోసగించాడని ఛీత్కరించారు.వివేకా హత్య కేసు విషయంలో తాము అనుమానితుడిగా ఉన్న అవినాష్‌రెడ్డికి కేంద్ర సహకారం ఉంది కాబట్టే అరెస్ట్ కావడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.అతనికి సహాయం చేయవలసిన అవసరం బిజెపికి లేదని,తప్పు చేసినవారు శిక్ష అనుభవించక తప్పదన్నారు.9 ఏళ్ల పాలనలో బిజెపి ఈ రాష్ట్రానికి ఏం చేసింది,5 ఏళ్ల పాలనలో టిడిపి,నాలుగేళ్ల పాలనలో వైసిపిలు ఏం చేశాయో తిరుపతి నడిబొడ్డున బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు.వైసిపి,టిడిపిల మేనిఫెస్టోలు ఒక డ్రామా అంటూ కొట్టిపారేశారు.జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి శ్రీలంక లాగా చేశాడు.రేపు అధికారంలోకి వస్తామని చెప్పే చంద్రబాబు రాష్ట్రాన్ని మరో పాకిస్థాన్ చేస్తాడా అంటూ ప్రశ్నించారు.రాష్ట్రంలో పాలన గాలికొదిలి ఎంత సేపూ ప్రతిపక్ష నేత చంద్రబాబును ఎలా జైలుకు పంపాలా అంటూ రాత్రి పగలు జగన్ ఆలోచిస్తున్నాడని,ఆ పని మాని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. టిడిపి,వైసిపి లాంటి ప్రాంతీయ పార్టీల శకం ముగిసిందని, ప్రస్తుతం ఏపిలో బలమైన పార్టీలు బిజెపి,జనసేనలేనని ఆయన స్పష్టం చేశారు.టిడిపి,వైసిపి పార్టీలను రాబోవు 2024 ఎన్నికల్లో ప్రజలు కోల్డ్ స్టోరేజీలో ఉంచడం ఖాయమని జోస్యం చెప్పారు.ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ కోలా ఆనంద్‌కుమార్,జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి,నాయకులు వరప్ర సాద్,రాటకొండ విశ్వనాథ్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బిజెపి మధ్య క్విడ్ ప్రోకో

## ప్రభుత్వం మీ కనుసన్నల్లోనే నడుస్తోంది మరి ఎందుకు రోడ్డు విస్తరణ చేపట్టడం లేదని

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



బుధవారం జగిత్యాలలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన రెడ్డి

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు అన్ని రంగాలలో మోసపోతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంది రాభవన్‌లో బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మాస్టర్ ప్లాన్ ఉప సంహరణను స్వాగతిస్తున్నామన్నారు. న్యాయ స్థానంలోని వివాదాలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏం చర్యలు చేపట్టారో శ్వేత పత్రం ప్రకటించాలన్నారు. నాలుగున్నరేళ్లుగా యావర్‌రోడ్డు విస్తరణకు ఎందుకు చొరవ చూపడం లేదన్నారు.మాస్టర్ ప్లాన్ ఉపసంహరణ కోసం మే 8న ప్రభుత్వానికి విన్న వించి,మే 28న మాస్టర్‌ప్లాన్ ఉపసంహరణ జీవో జారీ చేయించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ యావర్‌రోడ్డు విస్తరణకు జూన్ 14,2021న ఉత్తర్వులు జారీ చేసిన నేటికి విస్తరణ పనులు చేపట్టడం లేదని ప్రశ్నించారు.2018 ఎన్నికల్లో రోడ్డు విస్తరణ ప్రధాన అంశంగా చర్చకు లేవనెత్తారు.నాలుగున్నర ఏళ్లు గడుస్తున్న విస్తరణ చేయడంలేదని అన్నారు.

సిఎం కెసిఆర్ ఎక్కడికి వెళితే అక్కడ వరాలు ప్రకటిస్తున్నారు కదా జగిత్యాల వచ్చినప్పుడు యావర్ రోడ్డు విస్తరణ కోసం రూ.100 కోట్లు ప్రకటన చేపిస్తే పరిష్కారం అయ్యేది కదా అని అన్నారు.బిజెపి టిఆర్ఎస్ మధ్య గతంలో ఉన్న మైత్రి బంధం కొనసా గుతోందని వీరు ఇరువురి మధ్య అంతర్గత ఒప్పందం ఉందని బిజెపి నాయకులే అంటు న్నారన్నారు.లిక్కర్ స్కాంలో కవిత పాత్ర ఆధారాలతో వెలుగు చూస్తున్నా సిబిఐ మెతక ధోరణి బిజెపి బిఆర్ఎస్ మైత్రికి నిదర్శనం అన్నారు. లిక్కర్ స్కాంలో కవిత పాత్రపై నిన్న,మొన్నటి వరకు బండి సంజయ్,అరవింద్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.ప్రజలు విజ్ఞులని అన్ని గమనిస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.ఈటల రాజేంధర్ వాస్తవ దృక్పథంతో మాట్లాడారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రమే బలమైన పార్టీ అని,రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్ర కాంగ్రెస్ బలోపేతానికి మరింత దోహద పడింది.పిసిసి పిలుపు మేరకు జూన్ 2న జిల్లా పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ ప్రధాత సోనియాగాంధీకి గ్రామ గ్రామాన క్షీరాభిషేకం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు గిరి నాగభూషణం,పిసిసి కార్యదర్శి బండ శంకర్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కండ్లపల్లి దుర్గయ్య,పిసిసి ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ చాంద్‌పాషా,పుప్పాల అశోక్,చందా రాధా కిషన్, లక్ష్మణరావు, మామిడిపల్లి మహిపాల్, లైసెట్టి విజయ్ పాల్గొన్నారు.

# నైటీలో వచ్చి చోరీ సికింద్రాబాద్‌లో బెడిసి కొట్టిన సెక్యూరిటీగార్డ్ ప్లాన్

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త:** అతడు ఒక సెక్యూరిటీ గార్డు..మొబైల్ షోరూమ్‌లో చోరీ చేయాలని పథకం వేశాడు. తనపై అనుమానం రాకుండా ఉద్యోగానికి ముందే సెలవు పెట్టాడు. తనను గుర్తుపట్టకుండా ఉండేందుకు సోదరి నైటీలో వచ్చి దుకాణం తాళం పగులగొట్టి మొబైల్ ఫోన్లు దొంగిలించాడు. చివరకు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రూ.8.28లక్షల విలువైన 37 రియల్ మీ ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ మహంకాళీ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించిన వివరాలను ఏసిపి రమేష్, ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివా సులు, ఎస్ఐ శ్రీకాంత్ మీడియాకు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లెకు చెందిన మంకాల యాకయ్య అలియాస్ వినయ్ (28) తండ్రి చనిపోవడంతో ఉపాధి కోసం తల్లి సోదరితో కలిసి ఐదేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. కంటోన్మెంట్ తాడ్‌బండ్, బాపూజీనగర్‌లో నివాసముంటూ సికింద్రాబాద్ ఎస్‌డి రోడ్డులోని ఎమరాల్డ్ హౌస్‌లో నైట్ సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం అతని సోదరి ప్రేమవివాహం చేసుకొని వెళ్లిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు గతంలో యాకయ్య రియల్ మీ మొబైల్ షోరూమ్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేశాడు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎమరాల్డ్ హౌస్ మొదటి అంతస్తులో కూడా రియల్ మీ షోరూమ్ ఉంది. అందులో సిసి కెమెరాలు పనిచేయడం లేదని తెలుసుకుని చోరీ చేయాలని పథకం వేశాడు. పక్కా ప్లాన్‌తో మే 28వ తేదీ రాత్రి 12.30 గంటలకు అతని సోదరి నైటీని ధరించి దుకాణం వద్దకు వెళ్లాడు. దుకా ణానికి మరో వైపు మూసివేసి ఉన్న షట్టర్ తాళం పగులగొట్టి లోపలికి వెళ్లాడు. ట్యాబ్‌తో కలిపి 27 సెల్‌ఫోన్లు చోరీ చేసి సొంతూరు వెళ్లిపోయాడు. మే 29వ తేదీ ఉదయం మొబైల్ షోరూమ్‌లో చోరీ జరిగినట్లు స్టోర్ ఇన్‌ఛార్జ్ మహ్మద్ యూసుఫ్ మహంకాళీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడి పరిసరాల్లో ఉన్న సిసి కెమెరాల రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించగా నైటీలో ఒక మహిళ వచ్చి నట్లుగా గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్కడ ఉండే సెక్యూరిటీ గార్డులను కూడా విచారించారు. ఇందులో భాగంగా యాకయ్యపై అనుమానం వచ్చి ఆ దిశలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం మహబూబాబాద్ ఇజిల్లా మడిపల్లెలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అక్కడే దాచిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



## మోహిత్‌ను మధ్యలో డిస్టర్బ్ చేసిన పాండ్యా

### ఏకిపారేసిన క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్

**అహ్మదాబాద్:** చివరి ఓవర్‌లో మొదటి మూడు నాలుగు బంతులు అద్భుతంగా బౌల్‌చేస్తే మధ్యలో హార్ధిక్ పాండ్యావచ్చి మోహిత్‌శర్మను డిస్టర్బ్‌చేసాడని గుజరాత్ టైటాన్స్ ఓటమిపై సునీల్ గవాస్కర్ పాండ్యాను ఏకిపారేసాడు. బౌలరు సరయిన దిశలో వెళుతున్నపుడు అనవసర సలహాలు దేనికి, దూరంనుంచి చూసి మనం ఆతడు అలా బౌల్‌చేస్తున్నాడు. ఇలా చేస్తున్నాడు అని విశ్లేషణలుచేస్తాం. సదరు బౌలర్ ఫామ్‌లో ఉంటే ఎవరైనా అంతవరకే ఆగిపోవాలి. ఆతడి దగ్గరికి వెళ్లి సలహాలుసూచనలు ఇవ్వడం సరికాదు. పాండ్యా అక్కడికి వెళ్లగానే మోహిత్‌ముఖమే మారిపోయింది.
ఆతడు బిత్తరచూపులు చైసాడు. ఆ వాటర్ బాటిల్ ఎందుకో అని టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. చివరిమ్యాచ్‌లో పాండ్యా తీరు ఎంతమాత్రం సరికాదన్నాడు. దీనివల్ల వరుసగా రెండోసారి ఛాంపియన్ కావాలనుకున్న జట్టు పూర్తిగా షాక్ తిన్నదని చెప్పాడు. చివరి ఓవర్‌లో గుజరాత్‌పేసర్ మోహిత్‌శర్మ చేతికి కెప్టెన్ పాండ్యా బంతి ఇచ్చాడు. మొదటి బంతిని సరైన యార్కర్‌గా మిలిచిన మోహిత్ దూబేకు పరుగుతీసే ఛాన్స్ ఇవ్వలేదు.
రెండోబాల్‌కూడా యార్కరే ఈసారి దూబే ఒకే ఒక్కపరుగుతీసాడు. మూడో బంతికి కూడా అద్భుత యార్కర్‌సంధించి సిఎస్కే ఫ్యాన్స్ గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. అంతలోనే హార్ధిక్‌పాండ్యా వచ్చి మోహిత్‌తో గుసగుసలాడాడు. తర్వాత బంతిని జడ్డూ సిక్సర్‌గా మలిచాడు. విజయానికి ఒక్కబంతికి నాలుగుపరుగులు అవసరం అయితే జడ్డు బౌండరీ బాది సిఎస్కేను ఛాంపియన్‌గా నిలిపాడు. అందుకే సునీల్ గవాస్కర్ చివరి ఓవర్ హైడ్రామాపై పాండ్యాను తిట్టిపోసాడు.

# ప్లేయర్లకు కాసులు కురిపించిన ఐపిఎల్ అవార్డులు!




**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2023 సీజన్ విజేత జట్టుకు ప్రైజ్‌మనీ 20 కోట్లు వస్తే ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ జట్టుకు 13 కోట్లు వచ్చిన సంగతి తెలిసిందే. క్వాలిఫయర్2లో ఓడి మూడోస్థానంలోనిలిచిన ముంబయి ఇండియన్స్ ఏడుకోట్లు దక్కించుకుంది. ఎలిమినేటర్‌మ్యాచ్‌లో ఓడిన లక్నో సూపర్‌జెయింట్స్ 6.5 కోట్లు సొంతంచేసుకుంది. ఇక ఈ సీజన్‌లో 17 మ్యాచ్‌లు ఆడి 890 పరుగులుచేసిన గుజరాత్ ఓపెనర్ శుభమన్‌గిల్ అత్యధిక పరుగులుచేసిన ఆటగాడిగా ఆరెంజ్‌క్యాప్‌సొంతంచేసుకున్నాడు. దీనితో ఆతడికి 15 లోలు వచ్చాయి. అత్యధిక వికెట్లుతీసి పర్పుల్‌క్యాప్‌సొంతంచేసుకున్న మహ్మద్‌షమీకి రూ.15 లక్షలు దక్కాయి. ఈసీజన్‌లో అవార్డు గ్రహీతలు వివిధ విభాగాల వారీగా భారీగానే నజరానాలు పొందారు. రాజస్థాన్ బ్యాటర్ యశస్విజైస్వాల్ ఎమర్జింగ్‌ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీ గెలుచుకని పది లక్షలు సంపాదించాడు. ఆర్సీబీకి చెందిన గ్లెన్ మాక్స్‌వెల్ ఎలక్ట్రిక్ స్ట్రైకర్ ఆఫ్‌ది టోర్నీగా నిలిచి పదిలక్షలు సాధించాడు. గేమ్‌ఛేంజర్ ఆఫ్‌ది సీజన్ శుభ్‌మన్‌గిల్ 10 లక్షలు సంపాదించాడు. సీజన్ మోస్ట్ వాల్యూబుల్‌ప్లేయర్‌గా గిల్‌కు పదిలక్షలు లభించాయి. అత్యధిక ఫోర్లుకొట్టిన ప్లేయర్‌గా గిల్‌కు పదిలక్షలు వచ్చాయి. లాంగెస్ట్ సిక్స్ ఆఫ్‌ది సీజన్ ఫాఫ్ డుప్లెసిస్‌కు పదిలక్షలు దక్కాయి. సీజన్‌లో బెస్ట్ క్యాచ్‌కు రషీద్‌ఖానకు పదిలక్షలు, ఫెయిర్‌ప్లే అవార్డు ఢిల్లీకేపిటల్స్ టీమ్‌కు పదిలక్షలు, బెస్ట్‌పిచ్, గ్రౌండ్ ఆఫ్‌ది సీజన్ ఈడెన్ గార్డెన్స్, వాంఖేడే ముంబయి స్టేడియాలకు రూ.50 లక్షలుచొప్పున లభించాయి. ఇక సిఎస్కేలోని సూపర్‌స్ట్రైకర్ ఆఫ్ ది ఫైనల్‌కు లక్ష, గేమ్‌ఛేంజర్ ఆఫ్‌ది ఫైనల్‌లో గుజరాత్ సాయిసుదర్శన్‌కు లక్ష, మోస్ట్ బాల్యూబుల్‌ప్లేయర్ ఆఫ్‌ది ఫైనల్ సాయి సుదర్శన్‌కు లక్ష రూపాయలు లభించాయి. అదే సాయిసుదర్శన్‌కు మరోలక్ష రూపాయలు సూపర్‌ఫోర్స్ ఆఫ్‌ది ఫైనల్‌కు లభించాయి. లాంగెస్ట్ సిక్స్ ఆఫ్‌ది ఫైనల్ సాయిసుదర్శన్‌కు లక్ష, క్యాచ్‌ఆఫ్‌ది ఫైనల్ కెప్టెన్‌దోనీకి లక్ష, ప్లేయర్ ఆఫ్‌ది ఫైనల్ డెవాన్‌కాన్వేకు లక్షరూపాయలు లభించాయి.

## డాట్‌బాల్‌కు 500 మొక్కలు

### బిసిసిఐ కొత్తకార్యాచరణకు సంపూర్ణ మద్దతు




**న్యూఢిల్లీ:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనిచెపుతూ బిసిసిఐ కొత్త వ్యవస్థను అమలులోకి తెచ్చింది. ఐపిఎల్ ప్లే ఆఫ్స్‌లో ప్రతిడాట్‌బాల్‌కు 500 చెట్లు నాటాలని ప్రకటించింది. గుజరాత్ టైటాన్స్ చెన్నై సూపర్‌కింగ్స్‌మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌తో ఐపిఎల్ 16 సీజన్‌ముగిసింది. ప్లే ఆఫ్స్‌లో ఎన్ని డాట్‌బాల్స్ నమోదయ్యాయి? ఎన్నిమొక్కలు నాటాల్సి ఉంటుందో బిసిసిఐ వివరాలను బట్టిచూస్తే లక్షల్లోనే ఉన్నాయి. సిఎస్కే, గుజరాత్ టైటాన్స్‌మధ్య జరిగిన క్వాలిఫయర్ వన్‌లో 84 డాట్‌బాల్స్ వచ్చాయి.
ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్‌జెయింట్స్‌మధ్య జరిగిన ఎలిమినేటర్‌మ్యాచ్‌లో ఇరుజట్ల బౌలర్లుకలిపి 96 డాట్‌బాల్స్‌వేసారు. గుజరాత్‌ముంబయి మధ్యజరిగిన క్వాలిఫయర్2లో 67 డాట్‌బాల్‌సవేయగా చెన్నై,గుజరాత్‌మధ్య జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో కేవలం 45 డాట్‌బాల్స్ నమోదయ్యాయి. ఈ లెక్కన ప్లే ఆఫ్స్‌లోని నాలుగు మ్యాచ్‌ల్లో మొత్తం 292 డాట్‌బాల్స్‌నమోదయ్యాయి. అంటే 292 డాట్‌బాల్స్‌కు 500 మొక్కలుచొప్పున బిసిసిఐ మొత్తం 1.46 లక్షలమొక్కలు నాటాలి. ఈ డాట్‌బాల్స్‌లో సింహభాగం ఆకాశ్‌మధ్వాల్, మహ్మద్‌షమీ, రషీద్‌ఖాన్, మతీశాపతిరణలదే. బిసిసిఐ చేపట్టిన ఈ కొత్త కార్యాచరణకు అన్ని వర్గాలనుంచి మద్దతు లభిస్తోంది. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలుచేపట్టాలనికోరుతున్నారు. ఐపిఎల్‌ఫైనల్‌లోచెన్నై సూపర్‌కింగ్‌స చివరి బంతికి విజయం సాధించి ఐదో టైటిల్‌ను ముద్దాడిన సంగతి తెలిసిందే.

## 45రోజుల్లో కొత్తకమిటీ వేయకపోతే సస్పెన్షన్!

### రెజ్లర్ల ఆందోళనకు ప్రపంచ సమాఖ్య మద్దతు

**న్యూఢిల్లీ:** భారత రెజ్లింగ్‌సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టుచేయాలని అగ్రశ్రేణి రెజ్లర్లుచేస్తున్న ఆందోళనలకు ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య సంపూర్ణ మద్దతుప్రకటించింది. గతనెలరోజులుగా ఢిల్లీలో స్టార్ రెజ్లర్లు చేస్తున్న ఆందోళనలను ఎవరూ పట్టించుకోకపోవడంపై యుడబ్ల్యుడబ్ల్యు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అలాగే రెజ్లర్లపై పోలీస్ చర్యను తీవ్రంగా ఖండించింది. టాప్‌స్టార్లపై పోలీస్‌జులుంపై విచారం వ్యక్తంచేసింది. గడచిన కొన్నినెలలుగా భారత్‌లోని రెజ్లర్ల నిరసన కార్యక్రమాలు నిశితంగా గమనిస్తోందని ప్రకటించింది. గతంలోప్రకటించినట్లుగా 45రోజుల్లోగా డబ్ల్యు ఎఫ్ఐకి ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గం ఏర్పాటుచేయకపోతే సస్పెన్షన్ వేటు తప్పదని ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య హెచ్చరించింది. ఆ తర్వాత రెజ్లర్లు నిష్పాక్షికంగా తటస్థ జెండా కిందకు వస్తారని, రెజ్లర్లనిరసనల దృష్ట్యానే ఈసారి ప్రపంచ రెజ్లింగ్‌సమాఖ్య న్యూఢిల్లీలోనిర్వహించాల్సిన ఆసియా రెజ్లింగ్‌పోటీల వేదికను మార్చాలని నిర్ణయించినట్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ప్రకటించింది.



## కోకిలా బెన్ ఆసుపత్రికి ధోనీ

**ముంబయి:** చెన్నై సూపర్‌కింగ్స్‌కెప్టెన్ మహేంద్రసింగ్‌దోనీ త్వరలో ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలోచేరి తన మోకాలి గాయానికి సంబంధించి పలు టెస్టులుచేయించుకోవాలని నిర్ణయించాడు. టెస్టులకు సంబందించిన రిపోర్టులు వచ్చాక ధోనీ సర్జరీకి వెళతాడా లేదా అనేదానిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుంది. ఐపిఎల్‌లో మోకాలి గాయంతో బాధపడుతున్నా కెప్టెన్‌కూల్ జట్టు విజయానికి విశేష కృషిచేసాడు. చేపాక్ మైదానంలో సిస్కే చివరిలీగ్‌మ్యాచ్ ముగిసాక ధోనీ మైదానం అంతా కలియతిరిగాడు. అభిమానులవైపు సియెస్కే జెర్సీలు విసిరాడు. ఈ క్రమంలో దోనీ తన మోకాలికి ఒక క్యాప్ ధరించి కనిపించాడు.
ఇందుకు సంబంధించి ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇటీవలే ఇర్ఫాన్‌పఠాన్ దోనీని మర్యాదపూర్వకంగా కలిసాడు. అప్పుడు కూడా ధోనీ తన మోకాలికి క్యాప్‌ధరించి కనిపించాడు. గాయం నుంచి త్వరగా కోలుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. శరీరం సహకరిస్తే వచ్చే సీజన్‌కు అందుబాటులో ఉంటానని ధోనీ సూచనప్రాయంగా చెప్పాడు.

## టిటిడి ఆలయంలో ఐపిఎల్‌ట్రోఫీతో సిఎస్కే పూజలు



**చెన్నై:** ఐపిఎల్ 2023 విజేతగా నిలతిచిన చెన్నై సూపర్‌కింగ్స్ మేనేజ్‌మెంట్ సభ్యులు టైటిల్‌ట్రోఫీని తీసుకుని చెన్నైలో టిటిడి నిర్మించిన వెంకటేశ్వరస్వామి గుడికివెళ్లిప్రత్యేక పూజలునిర్వహించారు. ట్రోఫీని ఆ దేవదేవుడి పాదాలచెంత ఉంచి పూజలునిర్వహించారు. గతంలో ముంబయి ఇండియన్స్ ఐపిఎల్ టైటిల్ గెలిచిన సమయంలోకూడా నీతా అంబానీ శ్రీకృష్ణుడి ఆలయానికి వెళ్లిట్రోఫీకి పూజలునిర్వహించారు. తమజట్టు ఐదో టైటిల్ గెలవడంఆస్వామి కృపవల్లనేనని సిఎస్కే మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ నుంచి తిరిగి రాగానే దైవదర్శనానికి వ ఎళ్లారు. టినగర్‌లోని తిరుమల తిరుపతి ఆలయంలో ఐపిఎల్ ట్రోఫీకి పూజలునిర్వహించారు. ప్రస్తుతం ఈవిడియో నెట్టింట వైరల్‌అవుతోంది. అయితే ట్రోఫీతో గుడికి అనవసరం అని కొందరు చెపుతుంటే మరికొందరు వెళితే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. చెన్నై జట్టు ఈసారి ఫేవరేట్స్‌కాకపోయినా టైటిల్ గెలిచిందని గుర్తుచేస్తున్నారు. ఈసారి ఆరంభంలో ఓటములు ఎదురైనా కీలక ఆటగాళ్లు గాయాలబారినపడినా ధోనీసేన సమిష్టి పోరాటంతో టైటిల్ గెలిచింది. సిఎస్కే విజయాన్ని ద్రవిడ మోడల్ విజయం అంటూ డిఎంకె మంత్రులు వేడుకలు నిర్వహించారు. ఐపిఎల్‌ట్రోఫీని చెన్నైకి తెచ్చాక టిటిడి ఆలయంలో వెంకటేశ్వరస్వామి ముందు ఉంచి పురోహితులు ప్రత్యేకపూజలు నిర్వహించిన వైనాన్ని విడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టులు వెల్లువెత్తించారు సిఎస్‌కేఫ్యాన్స్.

# వాణిజ్యం

## పసిడి ధరలకు యుఎస్ డెట్ సీలింగ్ ఎఫెక్ట్

**వాషింగ్టన్, మే 31:** అమెరికా డెట్ సీలింగ్ ఒప్పందం ఇప్పుడు చాలా కీలకంగా మారింది. ఈ క్రమంలో దాని ప్రభావం బంగారం ధరలపై కూడా భారీగా ఉంటుందని తెలుస్తోంది. అంచనాల ప్రకారం, రానున్న కాలంలో దాదాపు 25శాతం మేర పెరగొచ్చని ఒక అంచనా. డెట్ సీలింగ్ ఖరారు తర్వాత గోల్డ్ ధరలు పెరుగుతాయని గ్లోబల్ స్థూల-పెట్టుబడి సంస్థలో పోర్ట్‌ఫోలియో మేనేజర్ వెల్లడించారు. నిపుణుల అంచనా ప్రకారం, ఇకపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు తమ బంగారం నిల్వలను పెంచుకుంటాయని తెలుస్తోంది. ఈ క్రమంలో గ్లోబల్ బ్యాంకులు తమ విదేశీ నిల్వల కోసం బంగారంపై ఎక్కువ మొగ్గు చూపుతాయని, బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్‌లో గోల్డ్ హోల్డింగ్‌ల వాటాను చారిత్రక సగటు 40శాతానికి పెంచినట్లయితే, బంగారం ధర ఔన్స్‌కి 25శాతం పెరిగి 2500 డాలర్ల వరకు పెరగవచ్చని తెలుస్తోంది. ఇదే సమయంలో డెట్ సీలింగ్ చర్చలు పరిష్కారానికి వస్తున్న తరుణంలో మార్కెట్లో సెక్యూరిటీల కొనుగోలు



ధరలు తగ్గుతాయని, ఇదే క్రమంలో బ్యాంకులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలుస్తోంది. దీర్ఘకాలంలో వడ్డీరేట్లు కూడా పెరిగే అవకాశం ఉంది. 1971లో గోల్డ్‌స్టాండర్డ్ ముగిసిన తర్వాత కూడా సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం కొనసాగించిన విషయం విదితమే. అయితే విదేశీ సెంట్రల్ బ్యాంకులు మళ్లీ తమ వైఖరిని మార్చుకున్నాయి. బంగారానికి కొనుగోలుదారులుగా ఉన్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం సమయంలో అనేక మంది పెట్టుబడిదారులు తమ డబ్బును బంగారం వంటి సేఫ్ మార్గాల్లోకి మళ్లించడం కూడా గోల్డ్ ధరల పెరుగుదలకు కారణంగా నిలిచింది.

## అన్‌రిజిస్టర్డ్ అడ్వయిజర్లకు సెబి వార్నింగ్

**ముంబై, మే 31:** పెట్టుబడిదారుల ఇన్వెస్ట్‌మెంట్‌ను సురక్షించడం కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సందర్భోచితంగా పలు నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది. తాజాగా మరోసారి సంచలన మార్పువైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. సెబి వద్ద రిజిస్టర్ కాకుండా ఇన్వెస్ట్‌మెంట్ సలహాలు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇండియన్ కేపిటల్ మార్కెట్ రెగ్యులేటర్ పరిధిలో నమోదు కాని పెట్టుబడి సలహాదారులపై కొరడా ఝుళిపించేందుకు సెబి రెడీ అవుతున్నట్లు కూడా సమాచారం. ఇందుకోసం కొన్ని ప్రత్యేక నిబంధనలు



అమలు చేసేందుకు సెబి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ మధాబి పూరి బుచ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ముంబైలో అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా కొత్త కార్యాలయాన్ని ప్రారంభం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మధాబి మాట్లాడారు. సెబి వద్ద రిజిస్టర్ కాని ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైసర్స్‌ను అడ్డుకునేందుకు ఏదైనా విధానం ఉందా అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. 'సమ్‌తింగ్ కుకింగ్. వెయిట్ ఫర్ సమ్ టైమ్' అంటూ కొత్త నిబంధనలు ప్రవేశపెట్టనున్నట్లు హింట్ ఇచ్చారు. రెగ్యులేటర్ వద్ద నమోదు కాకుండా సలహాలు ఇస్తున్న ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లపై సెబి కఠినంగా వ్యవహరిస్తోంది. మోసపూరిత విధానాల ద్వారా ప్రజలసొమ్మును ఇష్టం వచ్చినట్లు వివిధ స్టాక్స్‌లోకి మళ్లించడం ద్వారా సలహాదారులు లబ్ధి పొందడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

## మూడో వంతుకు తగ్గిన ట్విట్టర్ విలువలు: ఫిడెలిటీ

**వాషింగ్టన్, మే 31:** గత యేడాది కార్పొరేట్ ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశంగా మారిన అంశాల్లో ట్విట్టర్ కొనుగోలు ఒకటి. బిలియనీర్ ఎలాన్ మస్క్ ఈ కంపెనీని 44 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్నారు. కానీ దాని విలువ ఇప్పుడు కొన్న మొత్తంలో మూడో వంతుకు పడిపోయినట్లు ప్రముఖ ఆర్థిక సంస్థ ఫిడెలిటీ తెలిపింది. ఈ ఫిడెలిటీకి స్వయంగా ట్విట్టర్‌లో ఈక్విటీ వాటాలున్నాయి. ట్విట్టర్ తాను చాలా ఎక్కువ ధర పెట్టి కొన్నానని స్వయంగా ఎలాన్ మస్క్ గతంలో అన్నారు.



ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ, ట్విట్టర్ విలువ తాను కొన్న మొత్తంలో సగం కూడా ఉండదని బాహాటంగానే చెప్పారు. తాజాగా ఫిడెలిటీ అదే చెప్పింది. అయితే ట్విట్టర్ విలువను ఎలా లెక్కగట్టారనే విషయాన్ని మాత్రం ఫిడెలిటీ వెల్లడించలేదు. ఫిడెలిటీ తొలుత ట్విట్టర్‌లోని తమ వాటాల విలువను కొన్ని ధరతో పోలిస్తే గత నవంబరులో 44 శాతానికి తగ్గించింది. డిసెంబరు, ఫిబ్రవరి వాటాల విలువ మరింత తగ్గినట్లు తెలిపింది. మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలు చేసే నాటికే కంపెనీ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. మస్క్ చేతికి వచ్చిన తర్వాత అవి మరింత ఎక్కువయ్యాయి. ట్విట్టర్‌లో ఆయన చేసిన మార్పుల నేపథ్యంలో కొన్ని కంపెనీలు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ఆపేశాయి. దీంతో అడ్వర్‌టైజ్‌మెంట్‌ల ద్వారా వచ్చే ఆదాయం 50శాతానికి పడిపోయిందని మస్క్ స్వయంగా అప్పట్లో ప్రకటించారు.

## ఎస్‌బ్యాంకు లోగో మార్పు

**ముంబై, మే 31:** కస్టమర్లకు చేరువయ్యే దిశగా ప్రైవేట్ రంగ ఎస్‌బ్యాంకు మార్కెటింగ్‌పై మరింతగా దృష్టిపెడుతోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి ప్రకటనలపై 30శాతం అధికంగా వెచ్చించనున్నట్లు సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిపుణ్ కౌశల్ తెలిపారు. జూన్ 20 నుంచి ప్రారంభించే ప్రచార కార్యక్రమాలు ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు వరకు కొనసాగనున్నట్లు ఆయన వివరించారు. తమ రిటైల్ కార్యకలాపాలు కీలక స్థాయికి చేరుకున్నాయని, ఇకనుంచి లాభదాయకత పెరగగలదని చెప్పారు. ఎస్ బ్యాంకు కొత్త లోగోను ఆవిష్కరించిన సందర్భంగా కౌశల్ ఈ విషయాలుతెలిపారు. స్వల్ప మార్పులతో ఎస్ బ్యాంకు తమ కొత్త లోగోను ఆవిష్కరించింది. బ్యాంకు ప్రస్తుత ప్రస్థానాన్ని ప్రతిబింబిస్తూ టిక్ స్థానంలో పైకెగిరేపక్షిని తలపించలా మార్పులుచేశారు.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 31:** స్టాక్ మార్కెట్లలో నాలుగు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయమే ప్రతికూలంగా ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదేబాటలో పయనించాయి. ఏ దశలోనూ మార్కెట్లకు కొనుగోళ్ల మద్దతు లభించలేదు. ఫలితంగా నెలసిరీస్‌కు మార్కెట్లునష్టాలతో ముగింపు పలికాయి. అమెరికాలో అప్పుల పరిమితి పెంపు బిల్లు బుధవారం రాత్రి ఓటింగ్‌కు రానుండడంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో అప్రమత్తత నెలకొంది. చివరికి సెన్సెక్స్ 346.89 పాయింట్లు క్షీణించి 62,622.24 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 99.45 పాయింట్లు నష్టపోయి 18,534.40 పాయింట్ల వద్ద నిలిచింది. భారతీఎయిర్‌టెల్, ఏసియన్‌పెయింట్స్, టెక్‌మహీంద్రా,



టాటా మోటార్స్ కోటాక్ మహీంద్రా బ్యాంకు, నెస్లే ఇండియా, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, విప్రో, టైటాన్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎన్‌టిపిసి, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐటిసి వంటి షేర్లు క్షీణించాయి.

## రెనాల్ట్ ఇండియా అమ్మకాలు రయ్..రయ్..

**ముంబై, మే 31:** ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్ ఇండియా విక్రయాల్లో సరికొత్త మైలురాయిని అధిగమించింది. దేశంలో 9 లక్షల వాహనాల విక్రయాలను అధిగమించినట్లు రెనాల్ట్ ప్రకటించింది. తద్వారా ఈ ఘనతను సాధించిన దేశంలోని స్మాలెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ కార్‌మేకర్లలో ఒకటిగా అవతరించింది. గత ఫిబ్రవరిలో 8 లక్షల సేల్స్ మార్క్‌కు చేరింది. త్వరలోనే కొత్త డస్టర్ లాంచ్‌కు సన్నద్ధమవుతున్న క్రమంలో ఈకీలక విక్రయ మైలురాయిని చేరుకోవడం విశేషం. పదకొండేళ్ల క్రితం 2012లో భారత దేశంలోకి ఎంట్రీ ఇచ్చింది రెనాల్ట్. కైగర్, ట్రైబర్, క్విడ్‌లాంటి కార్లతో కస్టమర్లను ఆకట్టుకుంటోంది. ముఖ్యం




గా 2015లో క్విడ్ రాకతో మరింత పాపులర్ అయింది. ప్రస్తుతం భారతదేశంలో సేల్ అవుతున్న మూడు రెనాల్ట్ కార్లలో క్విడ్ ఒకటి. త్వరలోనే డస్టర్ ఎస్‌యువిని భారత మార్కెట్‌లో లాంచ్ చేయనుంది. అంతేకాకుండా రాబోయే సంవత్సరాల్లో భారత దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండియా తమకు టాప్ 5 మార్కెట్‌లలో ఒకటి. గత కొన్నేళ్లుగా దేశంలో బలమైన మార్కెట్‌ను సాధించామని రెనాల్ట్ ఇండియా ఆపరేషన్స్ కంట్రీ సిఇఒ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్‌రామ్ మామిళ్లపల్లె తెలిపారు.

## షియామీతో ఫోన్‌ల తయారీకి డిక్సన్ డీల్

**న్యూఢిల్లీ, మే 31:** ప్రముఖ ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీ డిక్సన్ టెక్నాలజీస్ చైనా మొబైల్ ఫోన్ బ్రాండ్ షియామీతో భాగస్వామ్యం చేసుకోనున్నట్లు తెలిసింది. షియామీ ఫోన్‌ల తయారీతో పాటు ఎగుమతుల కోసం ఇరు సంస్థల మధ్య భాగస్వామ్యం కోసం చర్చలు జరుగుతున్నాయని, అవి ముగిసిన అనంతరం భాగస్వామ్యం గురించి అధికారికంగా



వెల్లడించనున్నట్లు డిక్సన్ టెక్నాలజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. భారత ఎలక్ట్రానిక్ తయారీ రంగం పుంజుకుంటున్న ధోరణి సానుకూలంగా ఉంది. దేశీయంగానే కాకుండా గ్లోబల్ బ్రాండ్లు కూడా మొబైల్ ఫోన్ తయారీ, సరఫరా కోసం గణనీయంగా పెట్టుబడులను పెడుతున్నాయి. రానున్న కొన్నేళ్లలో దేశీయ ఎలక్ట్రానిక్ తయారీ పరిశ్రమ మరింత సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని డిక్సన్ టెక్నాలజీస్ వైస్ చైర్మన్, మెడీ అతుల్ బి లాల్ అన్నారు. షియామీ ప్రస్తుతం భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో విజయవంతమైన బ్రాండ్‌గా కొనసాగుతోంది. నాణ్యత, ట్రాక్ రికార్డ్ ద్వారా దేశంలోని వినియోగదారుల నుంచి మంచి ఆదరణ ఉంది. ముఖ్యంగా కేంద్ర మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ కార్యకలాపాలను నిర్వహిస్తోందని ఆయన వివరించారు. ఇరు సంస్థల మధ్య భాగస్వామ్యం కుదిరించిన తర్వాత డిక్సన్ ఈ యేడాది ఆగస్టు నాటికి ఉత్పత్తిని ప్రారంభించాలని భావిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14